పోవును. ఊపిరియాడుట కష్టముగానుండును. కునుకుపాట్లు పడుచుండును. దీనినే సర్పనిద్రయందురు.

మొదటిఅవస్థ:—పశువుపండ్లు తెలుపు రంగుగానుండి నీరు కారుచుండును. జ్వరముండును. ఈఅవస్థలో జిల్లేడుకొనలు, ఉప్పు, ఆవుపాలతో నూరి కండ్లలో కలికెము వేయుము. లేక దిరిసెన పువ్వులరసము కండ్లలో పెట్టుము. లోపలికి నాగమల్లివేరు 2 తులములు, సన్నావాలు అరతులం నూరి మూడుగొట్టముల గంజిలో కలిపిపెట్టుము.

రెండవఅవస్థ:—పశువు శరీరమంతయు నలుపురంగుగా మారి చొంగనుకార్చుచుండును. ఈఅవస్థలో మణుగుతామర 3 తులములు, తెల్లగలిజేరు 3 తు॥ ఈశ్వరివేరు 3 తు॥ నూరి ముద్దచేసి నీటిలోకలిపి త్రాగించవలెను. శేలవేరు గంధముతీసి కండ్లలో పెట్టవలెను.

మూడవఅవస్థ:—శిరస్సుబరువుగానుండును. మెడనిలుపజాలదు. ఈ అవస్థయందు తెల్లఉలిమిరివేరు 2 తులములు, ఈశ్వరివేరు 3 తు॥ దిరిసెనచెక్కరసం 3 తు॥ నూరి నీటితో కలిపి త్రాగించవలెను. కలి నీటితో దిరిసెనపిత్తులునూరి కండ్లలో వేయుము.

నాలుగవ అవస్థ:— పండ్లుకొరుకును. భూమిమీఁద పడును. శరీరము నల్లబడును. ఈఅవస్థలో చికిత్సలు చేయుట లాభములేదు.



## తదితర చికిత్సలు

1 నాగదుండదుంప నీటితోఅరగదీసి అయిదుతులములు లోపలికి త్రాగించి కొంతకరచినచోట పూసిన విషము విరుగును.

2 తెల్లఈశ్వరివేరు గంధముతీసి నాలుగుతులములు లోపలికిచ్చి కుట్టినచోట పూసిన విషము హరించును.

3 ఉత్తరేణి ఆకులునూరి పాముకరచినచోట మందముగ పట్టించిన విషము హరించును. దీని ఆకురసము లోపలికి త్రాగించుము.

4 కాకిదొండాకుపసరు సేరువంతున రెండుపర్యాయము లీయుము.

5 గాడిదగడపాకు పసరు సేరు త్రాగించుము.

6 నాగముషినివేరుచెక్క రసము 5 తులములు త్రాగించుము.

7 పచ్చినేలవేమురసముతో మిరియాలపొడి కలిపి యిచ్చిన సమస్తవిషములు హరించును.

8 చేదుబీరాకుపసరు సేరు త్రాగించుము.

ఇంకను అనేకవిధములుగా చికిత్సలు చేయుదురు.

పశువైద్య గ్రంథమాల 17 వ పుష్పము

# ప్రాచీన పశుసంరక్షణ.

గ్రంథకర్త:

"అభినవ సహదేవ" ఆయుర్వేద పశువైద్యాచార్య, వైద్యకళా విభూషణ, పశువైద్యగ్రంథమాల, ఆయుర్వేద పశుచికిత్సాలయ సంస్థాపకులు, ఆంధ్ర జాతీయ పశువైద్య విద్యాపీఠ ప్రెసిడెంటు, ఆంధ్ర జాతీయ పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ నగు,

డాక్టర్ యేజెళ్ల శ్రీరాములు చౌదరి,

A. V. L. M. & S., A. M. B. & B.S.

అంగలూరు, కృష్ణాజిల్లా.

కళింగ కవి సమాజ
భీమవరం తాలూకా.
(ప॥గో॥ జిల్లా)
ముదవల్లి.

1937

సర్వస్వామ్యసంకలితము]

[వెల రు 0-8-0.

బెజవాడ:

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

# విజ్ఞప్తి

భీమవరం తాలూకా (ప.గో.జిల్లా) ...ముదవల్లి

నేను సుమారు పదిసంవత్సరములక్రిందట ఆయుర్వేద పశుచికిత్సాలయమును, ఆయుర్వేద పశువైద్యగ్రంథమాలను స్థాపించి అనుభవపూర్వకముగా నపుడపుడు పశువైద్య గ్రంథముల బ్రకటించుచు వార్తాపత్రికలలో వ్యాసములువ్రాయుచు నా శక్తికొలది పశుసేవ చేయుచున్న సంగతి తామెల్లరకును దెలిసియే యున్నది. నేను వ్రాసిన గ్రంథములనుబట్టియు, నా యొద్ద తరిబియతయిన వైద్యులద్వారాను, కరపత్రముల మూలకముగను ఆంధ్రదేశమంతటను ఆయుర్వేద పశువైద్యమును వ్యాపింపజేసితిని.

మరియొక ముఖ్యవిషయ మేమన నే నిపు డొక ఆంధ్ర జాతీయ పశువైద్య కళాశాలను స్థాపించి గవర్నమెంటువారిచే రిజష్టరు చేయించి యనేకమంది పశువైద్యులను తరిబియతు చేయుచున్నాడను. ఈకళాశాల ప్రభుత్వమువారివలన ద్వరలో రికగ్నైజు కానున్నది.

ప్రస్తుత కాలపరిస్థితులనుబట్టి రైతులకును విద్యార్థులకును తదితరులకును అర్థమగునటుల సులభశైలియందు ఇరువది పశువైద్య గ్రంథములను మాపశువైద్య గ్రంథమాలతరపున

ప్రకటించితిని. మా యాయుర్వేద పశువైద్య గ్రంథమాల యందు వెల్వడిన గ్రంథరాజములం దిదియు నొక్కటి. ఇయ్యది పశుధనాభిమానులగు హైందవులకెల్లరకును హస్తభూషణమని చెప్పనగును.

మా యీగ్రంథములపై గవర్నమెంటు వెటరినరీ, అగ్రికల్చరల్, రెవిన్యూ, ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంటుల యందలి ప్రముఖులగు నుద్యోగులును, తదితర డిపార్ట్మెంటుల వారును జమీందారులును భూస్వాములును మున్నగు వారు పెక్కురు పెక్కు సదభిప్రాయములను నొసంగియున్నారు.

మా యీ గ్రంథముల నాంధ్రలోక మాదరించి ప్రతి పాఠశాలయందును, ప్రతిపుస్తకభాండాగారమందును, కో-ఆపరేటివు సొసైటీలయందును ఉంచి మాపశువైద్య గ్రంథమాల నభివృద్ధికి దెత్తురని విశ్వసించుచున్నారము.

ఇట్లు,

గ్రంథకర్త.

# ప్రాచీన పశు సంరక్షణ

గావోమేఅగ్రతః సంతు గావోమే సంతు పృష్ఠతః
గావోమేహృదయే సంతు గవాంమధ్యే వసామ్యహమ్.

భారత దేశ భాగ్యముకొరకై నేడు గోరక్షణయొక్క ప్రశ్న యెంత మహత్వపూర్ణమును, యెంత ఆవశ్యకమును అయి వున్నదో దానివిషయములో అంతకంటె కూడ అశ్రద్ధయు చేయబడుచున్నది. ఈ ఉపేక్షాభావము భారత దేశములో నివసించువారు, నివసించి వెళ్ళిపోవువారు, యీ మొదలైనవా రందరికి అత్యంత హానికరమును, లజ్జాప్రదమును అయి వున్నది.

భారత దేశ వర్తమాన హిందువులు గోవును ధార్మిక దృష్టితో పూజనీయముగా భావించుచున్నారు. కావున దానిని చంపి తినువారలనుండి దానిప్రాణరక్షణకొరకు వారు యెల్లప్పుడు యత్నశీలు రగుచున్నారు. గోరక్షణప్రశ్నను గురించి వాటి రక్షక, భక్షక జనులయందు అనేక పర్యాయములు భీషణ సంగ్రామములు జరిగియున్నవి; ఇప్పటివరకు జరుగుచునే యున్నవి. ఇందుచే వుభయపక్షముల సాక్షర, నిరక్షర జనులు అనేక విధములైన అపమానజనిత శరీరకష్టములను అనుభవింపవలసి వచ్చెను; అనుభవింపవలసి వచ్చుచుండెను.

ఈ వివాదమును, వివేకవంతులై పరిష్కరించుకొన నంత వరకు గోరక్షణయొక్క ఆశాతీతములైన లాభములనుండి వారు వంచితులై ఆత్మభ్రష్టులై వుండవలసివచ్చుటయే కాక పరమదయాళుడైన ఈశ్వరునియొక్క కృపాఫలితమునుండి కూడ వంచితులై వుండవలసివచ్చును.

భారతదేశహిందువులు గోవును పవిత్రమైనదిగాను పూజనీయమైనదిగాను యేల భావించుచున్నారు? ఈప్రశ్నయొక్క నిర్ణయమును సత్యానురాగులైన వుభయపక్షవిద్వాంసులు గోభక్షకులకు ఈశ్వరుడు ఆప్రాణిని మనుష్యునకు గొప్ప ఉపకారమును చేయుటకు సృజించి వున్నాడనియు, యిట్టి స్థితిలో తమవివేకశూన్యతవలన దానిని చంపి తినువారు హిందువులకీహాని కలుగచేయుటకాక తమకు తమసంతానమునకు హానికలుగజేసికొనుచున్నారనియు దీనితోపాటు ఈశ్వరసృష్టినైపుణ్యమును నాశన మొనర్చుచున్నారనియు బోధించి నచ్చజెప్పినయెడల, వారు గోవుల, హిందువులమీద దయ చూపు అభిప్రాయముతో కాకపోయినప్పటికి తమమేలు కొరకు ఈశ్వరాజ్ఞాపాలనలాభముకొరకైనను గోరక్షణకు సహాయకు లగుదురు.

హిందువులు గోవును యేల పూజనీయముగా భావించుచున్నారు? ఈప్రశ్నయొక్క చర్చ యిచ్చుట సంక్షిప్తముగా చేయబడుచున్నది. ఇతరదేశములలోని భిన్నభిన్నజాతుల ప్రజలవలె ఆధునిక హిందూదేశప్రాచీనార్యులుకూడ మాంసభక్షకులనియు, నానావిధములైన పశు, పక్షులమాంసమును



తినుచుండెడివారనియు వైదిక, పౌరాణిక, సాహిత్యపాఠకులకు బాగుగా తెలియును. కాని ఈశ్వరుడు మానవుని మాంసాహారిగా నిర్మించలేదని వారిబుద్ధి వికసింప దొడగిన కొలది తెలిసికొనదొడంగిరి. మరియు మానవుని మాంసాహారిగా చేయుటయే ఈశ్వరేచ్ఛ అయినయెడల ఆయన వారిదంతనిర్మాణము వ్యాఘ్రాదిహింసపశువుల దంతనిర్మాణమునకు ప్రతికూలముగా చేయువాడు కాడనియు, మాంసాన్వేషణయందు నిత్యము అనుభవించవలసివచ్చుకష్టమును, దానితోపాటు దానిరక్షణకై చేయవలసినంత చింతయు ఉద్భిజ్జపదార్థముల రక్షణకై చేయవలసియుండదనియు, మాంసము శీఘ్రముగా కుళ్లిపోవును- అందుచే తినుటకు యోగ్యముగా నుండదనియు తెలిసికొనగనే భరతఖండప్రాచీనార్యులుకృషియొక్క అన్వేషణమునందును, దాని ఉన్నతియందును శ్రద్ధవహించిరి. సావధానముతో పూర్వాపరములు ఆలోచించి చేయబడుపని తప్పక సఫలమగును. భారతదేశపు వర్తమానహిందువులయొక్క పూర్వులైనఆర్యులు వ్యవసాయాభివృద్ధియందు దత్తచిత్తులు కాదొడంగినకొలది వారికి గోవంశముయొక్క ఉపయోగజ్ఞానము ప్రాప్తించనారంభించెనని చెప్పనవుసరములేదు. దాని వుపయోగజ్ఞానమువలన వారి శరీరమానసిక శక్తులు విజృంభించుచున్నకొలది దానిరక్షణను వృద్ధిచేయదొడంగిరి. బుద్ధిమంతులు ఉపయోగార్హములైన వస్తువుల రక్షణయు వాటి ప్రచారమును అనేక ఉపాయములద్వారా వృద్ధిచేయుచుందురు. ఏవిధముగా గార్హస్థ్యసుఖముల రక్షణకొరకును,

వానివృద్ధికొరకును స్త్రీ పతివ్రతధర్మము అవుసర మని తలంచి ఆర్యులు దానిని వృద్ధిపొందించినారో అదేవిధముగా గోరక్షామహత్వమును తెలిసికొని వాటిరక్షణోపదేశమిచ్చిరి. వర్తమానహిందువులు తమ పూర్వులైన ఆర్యులవలన గోరక్షణోపదేశమును పొందిరి. ఆ ఉపదేశము వారికి హితకరమగుట వలన దానిని నేటివరకు పాలించుచూ వచ్చుచున్నారు.

ఏమనుష్యుడు యేజాతిలేక యేరాష్ట్రము తనకర్తవ్య కర్మలను మరచిపోవునో వానిపతనము అనివార్యము. పతితుడెచ్చటను ఆదరింపబడడు. వానిమాటయెవరును వినరు. నేడు మన హిందువులదశయు యట్టిదే యగుచున్నది. మనము కేవలము నేడు మాటలసహానుభూతితో గోరక్షణవిషయమై చాటుచున్నట్టి సిద్ధాంతములు ఉచ్చకోటికి చెందియున్నప్పటికి అజ్ఞానమువలనను, ఉపేక్షాభావమువలనను వాటిని మన విరోధులయందు బాగుగా ప్రకటనచేయజాలకున్నాము. కావున మావిరోధులకు గోరక్షామహత్వమును తెలిసికొనుటకై మేము భారతదేశపు ఆర్యసాహిత్యములయొక్క అనుశీలన చేయునట్టిపరామర్శ నివ్వము. దూరదర్శులును, వివేకవంతులును, మననశీలురును అయిన అమెరికాజనులు తమ బుద్ధి వికాసమువలన గోమహత్వమును తెలిసికొని యేవిధముగా వాటిని రక్షించుచూ యితరులచే రక్షింపచేయుచున్నారో యిచ్చట సంక్షిప్తముగా చర్చించుచున్నాము. గోమాంసాహారులైన మా సోదరులు దానిపై విచారణచేయుదురుగాక యని మేము ప్రార్థించుచున్నాము.



## —◆ గోరక్షణాలయము లత్యవసరములు ◆—

ఆంధ్రదేశమునకంతయు గోరక్షణసంఘము ఒకదానిని నిర్మించి రిజష్టరు చేయింపవలెను. దీనికి శాఖలుగా జిల్లా, తాలూకా, గ్రామసంఘములు ఉండవలెను.

గ్రామములో పూర్వము ఖాళీగా వున్న భూములన్నియు సాగుచేయబడుటచేత ముఖ్యముగ పల్లపుగ్రామములలో గోభూమి లేక పశుగణము అష్టకష్టములు పడుటయు మామూలుమేతకు సయితము అవకాశము లేక వానిని యే నైజాము రాజ్యమునకో, యే యితర దూరదేశములకో తోలుటయు, అందువలన పశుసంతతి అంతకంతకు క్షీణించుటయు తటస్థించుచున్నది. కనుక ప్రతి గ్రామమునందును దేశీయులు బుద్ధిపూర్వకముగ కొంత గోభూమిని ప్రత్యేక పరుపవలెననియు, అటుల జరుగునటుల దొరతనమువారు శాసింపవలెననియు, పశుపోషణ సుకరమగునటుల అటవీపరిపాలనానిబంధనలు సవరణ చేయవలె ననియు నా యభిప్రాయము.

పశుగణములు యితర దేశముల కెగుమతి యగుటచేతను, వధించుటచేతను, ప్రజలు ఆరోగ్యహీను లగుటయే గాక బిడ్డపాలుకూడ కఱవగుట తటస్థించుచున్నది. కనుక అట్టి ఎగుమతి నిషేధించుచు శాసనము చేయవలెననియు, గోమాంస భక్షణమునకు అలవాటుపడిన దేశీయసోదరులు అందునుండి విరమింపవలెననియు నా యభిప్రాయము.

పశుసంతతి బలిష్ఠముగను, ఆరోగ్యముగను ఉండుటకు తగిన యేర్పాటులు చేయుటకును, స్వచ్ఛమైన పాలు పెరుగు నెయ్యి వెన్న మొదలగు వస్తువులు లభించునటుల గవాశ్రిమములు స్థాపించుటకును, దేశీయుల హెచ్చరించుచు వానికి కావలసిన గోభూమి, ద్రవ్యోపపత్తి మొదలగు సౌకర్యములు దొరతనము ఒసగవలెను. స్థానికసంస్థలు గోరక్షణకు డబ్బు ఖర్చుపెట్టుటకు ఆటంక ముండకూడదు. స్థానికసంస్థలు పాలు సప్లయిసంఘములు ప్రోత్సాహపరచి నెలకొల్పవలెను. గోవధను మాన్పుటకు స్థానికసంస్థలకు అధికార ముండవలయును. పశువులకు భీమాసంఘములు పెట్టవలయును.

ప్రతి హిందువు తలకొకఆవును పెంచవలెను. ఇట్లు చేసినయెడల గోవధకు ఆవులు లభింపవు. పశువులు ముసలివైనవెనుక సంతలలోనికి తీసికొనివెళ్ళి గాని, తదితరముగ గాని కటికవాండ్రు వగయిరాలకు అమ్ముటను గర్హించుచు అది మానవలసినదని ప్రోత్సహింపవలెను.

జంతుబలులనుండి విరమింపవలయును. బహిరంగస్థలములలోను, బహిరంగముగను జంతుబలుల నిషేధించునటుల శాసించవలయును.

### —♦ ముస్సోలిరాజ్యము ♦—

అమెరికా సంయుక్తరాజ్యములందు ముస్సోలి యను రాజ్యముకలదు. అందు టీచర్సుకాలేజీ అను పేరుగల ఒక కృషి విద్యాలయము గలదు. దానిప్రధానాధికారి మిస్టర్ జార్జ్ హెంచ్



గహార్సుగారు. వారు వ్యవసాయసంబంధమైనగ్రంథములు అనేకములు వ్రాసియున్నారు. అందొకగ్రంథముపేరు లాయిల్ స్టాల్ యున్ను ఫార్మ్మెకానిక్సునన్నూ అయియున్నది. ఈగ్రంథముల యొక్క 6 వ అధ్యాయమందు గోజాతిఉపయోగమును గురించియు దానిమహత్త్వమును గురించియు వారు గొప్పవర్ణనచేసియున్నారు. ఈ గ్రంథమునుండి ఒకటిరెండుఅవతరణములనిచ్చి మేము మాపాఠకులకు గోవంశపుశ్రేష్ఠత్వముయొక్క పరిచయమిచ్చుచున్నాము. పైజెప్పబడిన గ్రంథకర్త పైగ్రంథముయొక్క 90 వ పుటలో ఇట్లు వ్రాసియున్నాడు. గోవులు కేవలము పాలు పెరుగు మున్నగునవి ఇచ్చుచుండుటయేగాక భూమియొక్క ఉత్పాదికాశక్తినికూడ కలుగజేయుచున్నవి.

ఉక్తగ్రంథకారుడు మరల 91 వ పుటలో ఇట్లువ్రాయుచున్నాడు. కృషిద్వారా మానవులకు తినుటకు త్రాగుటకు యోగ్యమైన పదార్థములను ఉత్పత్తిచేయుటకు ఆవశ్యకము కలుగుచున్న పశువులన్నిటికంటె పాలిచ్చు ఆవులసహాయము మిగుల శ్రేష్ఠముగను సులభసాధ్యముగను ఉండును. ఏలనన పాలిచ్చు ఆవు అన్యపశువులకంటె తక్కువ తినును. కాని మానవునియొక్క ఖాద్యపదార్థములను వాటికంటె అధికముగా ఉత్పన్నము చేయుచున్నది. ఆగ్రంథకారుడే 118 వ పేజీలో మానవులకు తమ భరణపోషణకొరకు ఆవశ్యకములైన పోషణతత్త్వము లన్నియు ఆవుపాలయందు ఉండునని వ్రాయుచున్నాడు.

సి. డబ్లియు. బర్కటుగారు తన సాయిల్ అను

గ్రంథముయొక్క 25వ పుటలో ఇట్లు వ్రాయుచున్నారు. ఎడ తెగకుండ యిరువదిసంవత్సరములు గోధుమ నాటబడిన క్షేత్రము నిస్సారమై ఊసరక్షేత్రమయ్యెను. గోధుమపంట భూమిని మిగుల త్వరలో ఊసరక్షేత్రముచేసివేయును. అట్టి క్షేత్రముయొక్క ఉత్పాదికాశక్తియొక్క రక్షణము చేయ గలిగినచో అది కేవలము ఆవులద్వారానే చేయబడగలుగును. ఇంకొకచోట ఇట్లు వ్రాయుచున్నారు. భూమియొక్క ఉత్పాదికాశక్తిని నిలిపియుంచుటకు అన్యపశువులుకూడ సహాయ మొనర్పగలిగినమాట నిజము; కాని వీటియన్నిటికంటె భూమియొక్క ఉత్పాదికాశక్తిని నిలబెట్టుటలో గోవు మిగుల ఉపయోగకరమగుననుటలో లేశమాత్రమైన సందియము లేదు.

అమెరికావిద్వాంసులైన గ్రంథకారుల గ్రంథముల నుండి ఇవ్వబడిన అవతరణములనుబట్టి సజ్జనులును సత్యప్రియులును ఐన పాఠకులు గోవు మానవునకు ఎంతఉపయోగము చేయుచున్నదో తెలిసికొనగలరు. గోవుయొక్క ఉపయోగమునుగురించి అమెరికాయూరపువిద్వాంసులు 25-35 సంవత్సరములకు పూర్వము తెలిసికొన్న విషయములు భారతదేశ మహర్షులు అనేక వత్సరములకు పూర్వమే తెలిసికొనియుండిరి. ఈ కారణముచేతనే వారు తమ వంశజులకు గోరక్షణచేయవలసినదని ఉపదేశించియున్నారు. ఆఉపదేశము ననుసరించియే ఆధునిక హిందువులు గోరక్షణజేయుటకై పట్టుదలవహించుచున్నారు. పై ఉదాహరణములను బట్టి భారతదేశములో నివసించునట్టియు లేక కొద్దిదినములు నివసించి ఇతర ప్రాంత



ములకు పోవునట్టియు అన్నిజాతుల అన్నిధర్మముల వారికిని మానవోచిత భోజనపదార్థములు చాలినంత లభింపజేయునట్టి యభిప్రాయముతోనే ఈశ్వరుడు గోజాతిని సృజించియున్నాడని తేటతెల్లమగుచున్నది. ఇట్టిస్థితిలో నొకానొకపురుషుని చేత కల్పింపబడిన ధర్మముయొక్క మరుగున గోహత్య నొనర్చి ఈశ్వరుని ప్రసన్ననిగా చేయగోరువారు తమసదసద్వివేకభరితమైన బుద్ధిని సన్మానించి విచారించుచు గోబలి యిచ్చుటవలన ఈశ్వరుడు సంతుష్టుడు కాడనుటయేకాక ఉపయోగకరమైన ఒకప్రాణిని నష్టమొనర్చుటచేత ఆయన కుపితుడగునని వారికి వెంటనే తెలియగలదు. ఈ వస్తుస్థితిని గ్రహించి భారతీయధనికులును బుద్ధిమంతులును యథాశక్తి గోరక్షణ చేయనారంభించుచో భారతదేశపుదీనులక్షుధార్తి దూరమగుటయేకాక ఈశ్వరుడు వారియాపనులవలన ప్రసన్నుడై మేలుచేయగలడు.

కృషిచేయుటకును, భూమియొక్క ఉత్పాదికాశక్తిని వృద్ధిపొందించుటయందును గోవు అద్వితీయమైనదనియు, దాని పాలలోను, వెన్నలోను మనుష్యుని భరణపోషణ కుపయుక్తమగు పోషణపదార్థములు యిమిడివున్నవని అమెరికాయూరపు విద్వాంసులకు తెలిసినప్పటినుండి వారు గోజాతిని తగు జాగ్రత్తతో పోషణచేయనారంభించిరి. ఇప్పుడు అచ్చట గోవులు నివసించుటకుగాను రాత్రింబవళ్ళు చాలినంత నిర్మల వాయువును, ప్రకాశమును దొరకునట్టియు పండుకొనుటకు, తిరుగుటకు పరిశుభ్రమైన స్థలము కావలసినంత లభించునట్టి

యు, నిదిరించుటకు మెత్తనిగడ్డిపాన్పులు లభించునట్టియేర్పాట్లతో గోశాలలు నిర్మింపబడుచున్నవి. వైజ్ఞానికపరీక్షనుండి వాటిస్వభావమునకు అనుకూలమని నిరూపింపబడిన ఆహారపానీయములు యథాసమయమున పెట్టబడుచున్నవి. ఆయా ఋతువుల ననుసరించి అవి నిర్మలజలముతో కడుగబడుచున్నవి. చలి, యెండ, వానలనుండి యథాశక్తిని రక్షింపబడుచున్నవి. మరియు క్రిమిరోగములనుండికూడ రక్షింపబడుచున్నవి. ఈ అన్ని జాగ్రతలకంటె వాటివంశశ్రేష్ఠతను నిలబెట్టుటయందు విశేషధ్యాన ముంచబడుచున్నవి. ఎక్కువపాలను వెన్నను యిచ్చునట్టి ఆవులను నిమ్నశ్రేణిఆబోతులతో కలుపరు. ఏ ఆబోతు వాటిపోషణఖర్చు వాటివలన కలుగు వచ్చు ఆదాయమునకంటె యెంతో తక్కువగానుండును. అత్యంత శ్రద్ధతోను, ప్రేమతోను పోషించుచున్నకొలది యెక్కువ పాలను, వెన్నను చాలరోజులవరకు యిచ్చుచుండును. మానవులకు మేలుచేయునట్టి ఆవులను పైచెప్పబడ్డ ప్రకారము పోషించి తమదేశమును ధనధాన్యసంపత్తులతో నిండినదానినిగా చేసినట్టియు, భారతదేశ హిందువులయొక్క గోరక్షావిషయమును అక్షరశః సత్యముగా నిరూపించుచున్నట్టియు, అమెరికా యూరపులయొక్క విద్వాంసులకున్ను, రైతులకున్ను ధన్యవాదము లర్పించుచున్నాము.

## ——◆ పంచగవ్యముల వివిధౌషధోపయోగములు ◆——

హిందువుల వస్తుతత్వశాస్త్రము ఆధునికవైజ్ఞానికులకు కూడ ఆశ్చర్యము గొలుపక మానదు. దానియందు మానవులకు బలమును, ఆరోగ్యమునుగూర్చు వివిధపదార్థములను గురించియు జంతు, శాక, ఖనిజ, ప్రపంచములకు చెందిన వివిధఓషధులలక్షణములనుగురించియు పూర్తిగా వర్ణింపబడియున్నది. మనపూర్వులన్ని శాస్త్రములందును ప్రఖ్యాతిగడించిరి. ముఖ్యముగ వైద్యశాస్త్రమునందు వారు చేసినపరిశోధనలు వారి ధీశక్తిని చాటుచున్నవి.



గోక్షీర, గోమూత్ర, గోదధి, గోఘృత, గోమయాదుల లక్షణములను గురించియు, వాని ఉపయోగములను గూర్చియు ఇచట చర్చింతము. జబ్బుపడి స్వస్థతనొందుచున్నవారికి, బలహీనులకు గోక్షీరము చాల ఉపయోగమైనది. చనుబాలుకన్నను గోక్షీరమే చాలఉపయోగమైనది. ఈరెంటియందున్న పదార్థములు నీవిధముగా నున్నవి.

| | చనుబాలు | గోక్షీరము |
|---|---|---|
| Proteidse | 2.00 | 4.00 |
| క్రొవ్వు | 3.55 | 3.90 |
| పంచదార | 6.20 | 4.02 |
| లవణములు | 2.50 | 0.73 |
| నీరు | 85.75 | 86.20 |

తగినంత గోక్షీరమున్నచో దానినే మంచినీటివలె పుచ్చుకొనవచ్చును. నిస్సత్తువ, మరణదేవత, తాండవించుచున్న వర్తమాన హిందూదేశమున గోక్షీరమెంత యుపయోగకరమైనదో ఎక్కువగా చెప్పనవసరములేదు. గోక్షీ

రము సత్తువను, వీర్యవృద్ధిని కలుగజేయును. పెరుగు గ్రహణిని కుదుర్చును. వెన్న విరేచనబద్ధకమును మాన్పును. నేయి బలవర్ధకౌషధముగను, ఆలేపనముగను, చలువజేయుటకును, ఉపయోగించును. గోరువెచ్చని నేతిలో ముంచినగుడ్డ గాయములపై వేసినచో బాధ తగ్గును. గాయముగూడ త్వరగా మానును. శూలనొప్పి మున్నగు రోగములకు, ఖనిజములను శుభ్రపరచుటయందును గోమూత్రముపయోగపడును. ఆవుల పండ్లయొక్కయు కొమ్ములయొక్కయు పొడిని లోహములకు రాయుటవలన మృదుత్వము వచ్చును.

గోమయము పుండ్లపై కట్టిన నయమగును. గోమయమును కొన్నిజబ్బులకు లోపలికి పుచ్చుకొందురు. మన దేశమున గోడలు, నేల అలుకుటకు గోమయమునే ఎక్కువగా నుపయోగించుదురు. గోమయముతో అలికిన గృహములు చాల పరిశుభ్రముగా నుండుననియు, గోమయము క్రిమికీటకాదుల హరించుననియు లాక్‌వుడ్డు కిప్లింగ్, సర్. బి. ఫుల్లర్ మున్నగు పాశ్చాత్యులే ఒప్పుకొనినారు. ప్రొఫెసర్ సిమరెస్, ప్రొఫెసర్ కిర్గు అనువారు మూత్రముమీద పరిశోధనచేసి దానిఉపయోగములను కనిపెట్టిరి.

1 రక్తముయొక్క సమత్వమున మూత్రము కుళ్ళకుండ నుపయోగించు వస్తువుగా పనిచేయును.

2 చర్మము, కండరములు మున్నగువానికి మూత్రము వలన ఏవిధమగు హానియు కలుగదు.



3 విషసంబంధమగు పదార్థములు మూత్రమునందు లేవు.

4 ఇతరమందుల నుపయోగించుటయందు కలుగు శ్రమలో సగమైనను లేకుండ మూత్రము నుపయోగించ వచ్చును.

5 గాయములు మున్నగువాటికి ప్రథమ చికిత్సగా మూత్రము బాగుగా పనిచేయును.

6 గుండెజబ్బున్నవారికి మూత్రమును మూత్రవర్ధకముగా నుపయోగింతురు.

### గోవువలన లాభములు

గోవుచర్మమును చక్కగా పదునుచేసి దానితో సూట్‌కేసులు, చేతిపెట్టెలు (హాండ్‌బాక్సు), పాకెట్‌బుక్కులు, బూట్సులు, చెప్పులు, పట్కాలు, గుఱ్ఱపుసామానులు, యంత్రాలయములలో చక్రముల త్రిప్పుటకై అమర్చబడు పెద్దపెద్ద పట్టాలు మొదలగునవి తయారుచేయబడును. ఆవుల చర్మముపైన మృదువగు వెంట్రుక లుండును కదా! ఆ వెండ్రుకల ప్రోగుచేసి బ్రష్‌లు కట్టుదురు. ఆ బ్రష్‌ల నెక్కువగా కఱ్ఱసామానులు చేయువా రుపయోగింతురు. తోకకుచ్చునందలి వెండ్రుకలు సైతము వృథాకానేరవు. సాధారణముగా ఈ వెంట్రుకలను మోటారుసీట్లలో దూర్చి కుట్టివేసెదరు. ఆవులచెవులలో మరింత మృదువైన వెంట్రుక లుండును. వానిని జాగ్రత్తగా కత్తిరించి కుచ్చులుకుచ్చులుగా కట్టి

విక్రయింతురు. ఆ కుచ్చులతోనే గొప్పగొప్ప చిత్రలేఖన ములు, రంగులపటములు, నాటకములయం దుపయోగించు తెరలు మొదలగున వెన్నియోరంగులు పూయబడును. మనము చేత సొగసుగాధరించి మాటిమాటికి జూచుకొనుచు మరియు నట్టి చేతిగోడుగులపిడులు, చేతికఱ్ఱపిడులు, దువ్వెనలు, జడ లలో గుచ్చుకొనునట్టి పిన్నులు, బారెట్సు, గుండీలు, కత్తి పిడులు, మొదలగునవి పశువులకొమ్ములతోడను, పొగత్రాగు గొట్టములు, పొడుముడబ్బీలు, క్రొచెట్ సీడిల్సు, పలురకముల ఆటవస్తువులు మొదలగున వెన్నియో ఎముకలతోను తయారు చేయబడును. ఈ ఎముకలను పొడుముగ జేసిన మంచి ఎరు వగును. మంచిపంటలు లభించును. మెత్తనిపిండిగా జేసి శర్కర శుద్ధిజేయుటకును, నునుపెక్కుటకును, తెలుపు వచ్చుటకును, వుపయోగింపబడును. ఇంకను పశువుల త్వఙ్మాంసాస్థిస్నా య్వాదులవలననే, సర్వీసు సబ్బులు దీపపువత్తులు అంగరాగ ములులేక పరిమళద్రవ్యములు గ్లిసరైనులు ధాతుపుష్టి, రక్త వృద్ధి జేయు పలువిధఆహారపదార్థములు అనేకరకములఎరువులు లభింపగల్గుట. పెయ్యదూడలు మొదలగువాని గర్భాశయము లందు ఒకవిధమైనపదార్థము దొరకును. అది కొంచెముగ ఘనీభవించినట్లుండును. అనగా పేరుకొనియుండును. అది పులిసిపొంగి బుజబుజలాడుచుండును. ఆపదార్థమును వైద్యులు పెక్కు ఔషధముల జేయుట కుపయోగింతురు. ఇంకను దానిసహాయమున జున్నును తయారుచేయవచ్చునట. పశు వులమెదటిలో పైభాగమున ఒకవిధమైనపదార్థ ముండును.



ఆపదార్థము మిగులవిలువయైనది. దీనినే ఆంగ్లేయమున ఫినా యిలు అందురు. ఇదియే గోరోజనముకాబోలు. గోరోజనము గర్భాశయమున లభించునందురు. కాని గోరోజనము మెదడు నందే దొరకునట్టిపదార్థమని జంతుశాస్త్రవాదుల అభిప్రాయ మైనట్లు తెలియుచున్నది. మొత్తముమీద గోరోజనము ఔషధరాజములలో నుపయోగింతురనుట యెల్లరెరిగినదే! ఒక్కొక్క పశువునందు బఠానీగింజంత పరిమాణము గలదే దొరకును. ఒకపౌను గోరోజనము కావలయునన్న పదునైదు వందల పశువుల ఛేదింపవలసి యుండును.

ఆవుపాలనుండి అనేకరకముల పదార్థములు పాశ్చాత్య దేశములందు తయారుకాబడును. కేసిన్ అను ఒకవిధమైన పదార్థము తయారు కాబడును. అతిరుచికరమగు జున్ను దీని సహాయమున తయారుచేయబడునట. ఇంకను టెలిఫోను రిసీ వరులు, మేలైన దువ్వెనలు, విసనకఱ్ఱల పిడులు, సిగరెట్లు త్రాగు గొట్టములు మొదలగున వెన్నియో కేసిన్ మూల మున తయారుకాబడును. కాగితములు బాగుగా నునుపెక్కి నిగనిగలాడుచు మందముగా నుండుటకుగాను యీ కేసిన్ వుపయోగించెదరు. ఇట్టిప్రయోజనకారులగు పశువులు నెనురు వేయునాలు తగినరీతి సృజింపబడుటలో ఎంతయో రహస్యము చమత్కృతి కలదని వేరుగ జెప్పవలయునా? ఏమి ఆ సృష్టివైచిత్ర్యము! ఆవులు, ఎద్దులు, దున్నలు, బఱ్ఱెలు మున్నగు పశువులే గాక మనుబోతులు, జడలబఱ్ఱెలు, కణు జులు, లేళ్ళు, దుప్పులు, మేకలు, గొఱ్ఱెలు మొదలగునవి కూడ

నెమరు వేయుట కలదు. ఇవన్నియు మిగుల సాధువైన జంతువులు. ఈజంతువులన్నియు పుట్టినపదియవనాటినుండియే నెమరు వేయుట కలవాటుపడును. ఈ జంతువులు తిను ఘనపదార్థమంతయు అనగా గడ్డి గాదము మొదలగునవి మొట్టమొదట గర్భములో నొకానొకకోశమున జేరును. ద్రవపదార్థమంతయు వేరొక కోశములో జేరును. ఈ రెండు కోశములకు సంబంధముండును. ఆ కోశములు రెండును బాగుగా పదార్థములతో నిండినతర్వాత పశువు నెమరువేయుట కారంభించును. నెమరు వేయుటనగా పదార్థములను గొంతుకలోనికి తెచ్చుకొని బాగుగా నమలి చిలికించుటయే.

భూగోళము మొత్తముమీద 50 కోట్ల పశువులు గలవని అంచనా వేయబడినది. అమెరికాయందలి ఒక సంయుక్త రాష్ట్రమునందే 6 కోట్ల 50 లక్షలు పశువులు గలవని లెక్కింపబడెను. ఇన్ని పశువులు ప్రపంచములో మరి యేయితర రాజ్యభాగమునందుగాని దేశమునందుగాని లేవనియె చెప్పవచ్చును. అర్జెంటైనాలో పశువులతివిశేషముగ పోషింపబడుచున్నవి. ఆస్ట్రేలియాలో సైతము పశువు లతిమిక్కుటముగా పోషింపబడుచున్నవి. గ్రేటుబ్రిటనులో మేలైన పశుజాతులనేకములు గలవు. ఆదేశమునందలి వ్యవసాయమున కుపయోగింపబడకున్నను మాంసాహారసంపాదనమునకు, పరిశ్రమాభివృద్ధికి ఆధారభూతముగా నున్నవి. ఆంగ్లేయులకు గొడ్డుమాంసమనిన అపరిమితాసక్తి. కావుననే హిందూదేశములో గోవధ ముసల్మానులకంటె అతివిశేషముగా ఆంగ్లాధి



కారులకొరకు చేయబడుచున్నదని గాంధి, మాలవ్యాప్రభృతులు సెలవిచ్చియుండిరి. నెపోలియన్ ఒకానొక సందర్భమున సైనికులు గోగర్భముపైననే నడచుచుందురని చెప్పియుండెను. అనగా గోమాంసభక్షణమునకే వారు యువ్విళ్లూరుచుందురనిభావము. మాంసాహారమునకే ఆంగ్లేయులు గోవృషభముల అనేకరీతుల పోషించి క్రొవ్వెక్కునట్లు చేయుదురు. ఇటీవలవరకు వేలకొలది ఎద్దులు, దూడలు, యునైటెడ్ స్టేట్సు నుండి గ్రేట్ బ్రిటనునకు దిగుమతి చేయబడుచుండెను. ఇప్పుడావ్యాపారమంతయు తగ్గిపోయినది. ఇప్పటికిని దక్షిణఅమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండు దేశములనుంచి మాంసము నవీనపద్ధతుల ననుసరించి డబ్బాలలో భద్రము చేయబడి బ్రిటీషు దీవుల కతివిశేషముగా ఎగుమతి చేయబడును. యూరోపియనులలో మరెవ్వరును బ్రిటీషువారికంటె నెక్కువగా గొడ్డుమాంసమును తినుటలేదు. ఆ మిగిలినవా రందరకు గొఱ్ఱె, కోడి, పంది, వెన్న, జున్ను యెక్కువగా రుచించును.

గత ఐరోపామహాసంగ్రామసమయమున సైనికులకు సరఫరా చేయబడిన ఆహారపదార్థములలో చాలభాగము పశుమాంసమే యని పాఠకులు గ్రహింపవలయును. ఈ మాంసాహారము చాలవరకు అమెరికానుండియే సరఫరా చేయబడెను. మాంసము పుష్టిని గలుగజేయునను దుర్భ్రమచే అధికసంఖ్యాకులు దీనిని తినుచుందురు. పాశ్చాత్యు లీ పశుమాంసములో ననేకవంటకములు తయారుచేసెదరు.

క్రీస్తుశకారంభమునకు పూర్వమే సిరియా మున్నగు

[illegible]ు ఆర్యావర్తమునందుండు గోజాతి కాననయ్యె
నని అరిస్టా[illegible] అను మహనీయుడు వ్రాసియున్నాడు. ప్రాచీన
హైందవులకు, గ్రీకులకు, రోమనులకు, ఐగుప్తీయులకు,
[illegible]్రులకు పశువులు వెండిబంగారములకంటె విశేషప్రియ
[illegible] నుండెననుట నిజము. అవియే వారికి కల్పతరువులు,
[illegible]వులు. నిజమునకంతియే. అనాదినుండియు అన్ని దేశ
ములందును పొలముల దున్నుటకు, బరువులను లాగుటకు ఎద్దు
లను, కోడెలను వుపయోగించుచునే వచ్చిరి. కాని పాశ్చాత్య
దేశములలో ప్రస్తుతకాలమందు ఎద్దులకు బదులు గుఱ్ఱ
ములు, యంత్రము లుపయోగింపబడుచున్నవి.

హెసాయిడ్ అనునొక ప్రాచీన గ్రీకుకవీశ్వరుడు
తన గ్రంథమునందు 'బండ్లులాగుటకును పొలములు దున్నుట
కును తొమ్మిదేండ్లునిండినకోడెను కట్టుట యుక్తము. కారణ
మేమనగా వీనికావయస్సు వచ్చునప్పటికి చిన్నతనపుచేష్టలు,
పొగరుబోతుతనము తగ్గిపోవును. అపుడు చెప్పినట్లు వినును.
లేకున్న కాడిని బండిని తునుకలు తునుకలుగా విరుగగొట్టును.'
హిందువుల, హీబ్రూలగ్రంథములలో పశుపోషణావిధానమును
గూర్చి అనేక ప్రమాణములు గలవు. వీరిరువురు నూర్పిళ్లు
మొదలగు కాలములందు పశువులు ఎంతగడ్డి మేయుచున్నను
ఎంతధాన్యము తినుచున్నను వానిని హింసింపరాదు. వ్యవసాయ
దారునకు పశువులు వెండి బంగారములకంటె ప్రియతర
ములు. ఆంధ్రదేశములో కొన్ని ప్రాంతములందు పశువులకు
సొమ్ములు అని చెప్పుట కలదు. సొమ్ములనగా ఆభరణ



ములు. ఆభరణములకంటె ప్రయోజనకారులుగాకుండునా!
ఇప్పటికిగూడ ఇండియాలోవలె ఫ్రాన్సు, జర్మనీ, రష్యా,
బల్గేరియా, రోమేనియా ప్రాంతములందు పొలముపనులు
చక్కబెట్టుటకు బరువులులాగుటకు పశువులే చాలవర కుప
యోగింపబడుచున్నవి.

గంజాంజిల్లా దున్నలజాతిని, ఒంగోలుతాలూకా ఎద్దు
లను, సేలం కోయంబత్తూరు జిల్లాలఎద్దులను, ఆవులను, పిఠా
పురం తంజావూరు పశుజాతిని ఏవిధముగ శాస్త్రోక్తపద్ధతులపై
వృద్ధిజేయవీలగునో విచారింపవలయు. ఆయాజాతులకు మరితర
దేశీయజాతులకుగాని, విదేశీయజాతులకు పెండ్లిండుచేసి పెద్ద
పెద్ద దున్నలను, ఎద్దులను పెద్దపట్టుపట్టగలవిగాను, చురుకుగా
నడువగలవిగాను కనుగొనుటయు, మంచికోడెల నీనునవిగాను,
హెచ్చుగా పాలనిచ్చునవిగాను, అమితముగా కండబట్టి
బలియునవిగాను గల ఆవులను గొనుటయు వ్యవసాయశాఖలు
చేయవలసినకార్యము. గేదెదూడలందు చిన్నతనమందే సగా
నికి సగము చచ్చుట ప్రతివారికి తెలిసినసంగతియే. ఆదూడల
జబ్బులెట్టివియో విచారించుటయు, అట్టిజబ్బులకు జంకని బిడ్డ
లేయేరకపుగేదెలకు గల్గునో కనుగొనుటయు ముఖ్యము. మన
ప్రభుత్వము కోయంబత్తూరు, చింతలచెర్వులందు పరిశోధ
నాలయముల స్థాపించి కొన్నికొన్ని పరిశోధనల గావించు
చున్నది. ఈపరిశోధనాలయములనుండి కొన్నికొన్ని యావులు
అరవయావులకంటె రెండుమూడురెట్లు పాలు హెచ్చుగా
నిచ్చుచున్నవని చెన్నపట్టణమున వానిని కొన్నవారు తెల్పు

చున్నారు. రెండుపరిశోధనాలయములు మన యాంధ్ర దేశమున ఉత్తరసర్కారులకు మాత్రము అందుబాటులో లేవు. ప్రతి మూడుజిల్లాలకైన నొకటి స్థాపించు టవసరము. ఈ పరిశోధనాలయములందు పాలిచ్చు నావులను గూర్చి ప్రత్యేక శాఖ నేర్పరచి పాలిచ్చు నావులజాతులను వృద్ధి బొందించు టవసరము. ప్రభుత్వ మెన్నిపరిశోధనాలయముల నేర్పరచినను ప్రజలు హృదయపూర్వకముగా ప్రభుత్వముతో ఈ విషయమునందు సహకార మొనర్పకపోయినచో అభివృద్ధి జెందజాలము. ఇంగ్లాండునందు రాబర్టు బేకువెల్ గారు, కోల్లింగుసోదరులు, బెంజమిన్‌టామ్‌కిన్సుగారు క్రీ. శ. 1770 నుండి లాంగుహారన్సు, షార్టుహారన్సు, హెరిఫోర్ట్సు, అను జాతుల యావులను తమ తమ యెస్టేటులమీద జేసిన పరిశోధనల ద్వారా కనిపెట్టి ఇంగ్లండు అమెరికా దేశముల కెంతయో సేవ చేసిరి. ఇప్పుడు కూడ ఆక్సుఫర్డుజిల్లాయందు కెల్మ్‌స్కాట్టు అను గ్రామమునందున్న ప్రధానరైతులలో నొకడు 1873-వ సంవత్సరములో వ్యవసాయము మొదలిడి ఆక్సుఫర్డు డౌన్ అను పశుజాతిని వృద్ధిజేయ మొదలిడెను. దీనినే షార్టుహారన్సు అని కూడ అందురు. ఆయన పశుగణముద్వారా వచ్చుచున్న యెద్దులను కోడెలను ఆవులను ప్రపంచమునం దన్ని దేశములవా రిప్పుడు కొనుచున్నారు. ఆయనవ్యాపార మభివృద్ధిలో నున్నది. అటులనే మన దేశమునందును వ్యవసాయ శాఖవా రేదైన మంచిజాతియావును కనిపెట్టినట్లైన అది మంచికోడెదూడల పెట్టును. కోడెల పెంచుట సర్దాగల రైతు



వద్ద అవి బాగుగా పాలిచ్చుపెయ్యల నీనినచో పాలవ్యాపారమునందు జోక్యముగల రైతులు అట్టి యావును కొని దాని జాతిని వృద్ధిజేయుచు, శాస్త్రోక్తపద్ధతుల డిపార్టుమెంటువారి వద్దనుండి కనుగొనుచు తమతమపరిశోధనలద్వారా తేలిన పర్యవసానములను డిపార్టుమెంటునకు తెల్పుచుండుటయు నవసరము. ఇట్లనుటచే మన దేశమునం దిదివరకే కెల్మ్‌స్కాట్టు రైతువంటి రైతుమహాశయులు లేరనికాదు. వారు లేనిచో ఒంగోలుతాలూకాపశుజాతి యింతకాలము తన స్వచ్ఛంద రకమును, జాతిగుణమును కాపాడుకొనగల్గెడిదికాదు. దత్తమండలములందు ప్రయాణ మొనర్చునపుడు మాఘఫాల్గుణ మాసములందు నంద్యాలనల్లరాయివంటిబండల లాగుటలో తమతమ ఎద్దుకోడెలయొక్క బలమును ప్రదర్శింపజేసి రైతు మహాజనులమెప్పువడయవలెనని గుంపులుగుంపులుగా పోటీదారులైన రైతులు తమ యనంతమగు గాంభీర్యమగు బలిష్ఠమగు ఎద్దులను తోలుకొని వెళ్లుచుండ అనేకచోట్ల జూచు భాగ్యముగల్గెను. ఇంగ్లండు, అమెరికా దేశములం దట్టిప్రదర్శనములకు పార్లమెంటుమెంబరులు, మంత్రులు, రాజు లేక ప్రెసిడెంటు వచ్చి అధ్యక్షత వహించి బహుమానపతకముల జయమొందినయెద్దుల యజమానికిత్తురు. హెచ్చుపాలనిచ్చు నావులకు హెచ్చుబరువుల మోయుఎద్దులకు గుఱ్ఱములకు బహుమానములిచ్చెదరు ఆపశువు గుఱ్ఱములఫోటోలు పత్రికలయందు ప్రకటించుటయేగాక అట్టిజంతువుల బెంచుటయందు గల మెలకువలగూర్చి వారివారి యభిప్రాయముల శ్రద్ధతో

ప్రకటింతురు. కనుకనే ఏడుసంవత్సరములక్రితము మనచక్రవర్తి పెంచిన రెండుయావులు బహుమానము పొందుటయు అందుకాయన గర్వపడుటయు జరిగెను.

జంతువుల పెంచువారి కంతగౌరవ ముండుటచేతనే ఇదివరకు ప్రధానమంత్రియగు బాల్డ్విన్‌గారు తాను పందులను పెంచుచుంటిననియు, వానిని ప్రేమింతుననియు గర్వముగా చెప్పియున్నాడు. కాని మన దేశమున సంక్రాంతికి మహాశివరాత్రికి పశుప్రదర్శనములు దత్తమండలములందిప్పటి కద్భుతముగా జాత్యభిమానముగల గొప్పరైతుసాయముచే జరుపబడుచుండినను అందు జయమొందిన రైతులు చుట్టుపట్లనుండు రైతులందు ప్రసిద్ధిగాంచుచున్నను శాసనసభాసభ్యులుగాని గవర్నరుగాని, మంత్రిగాని అట్టిపౌరుషవంతులై తమజాతినింకను ప్రేమించుచున్నగొప్పరైతుసోదరుల గౌరవించిన పాపమున పోలేదు. ఇకనైనను పైమహాశయు లందరును పశువృద్ధి పెంపా దించగలరని నానమ్మిక.

## —♦ భూతదయ ♦—

విదేశములలో హిందూదేశమనిన గాలి, వానలు, మన్యపుజ్వరములు, క్షామములు, ప్లేగులు, మోగులు, జ్యోతిష్కులు, పెద్దపులులు, పాములు, నిండినదేశమని తలతురు. మృగప్రపంచమునకు పూలపాన్పని యెరిగినవిదేశీయు లనేకులుగలరు. మృగమర్దనము, మృగహింస జరుగుచున్న నిర్దయాప్రపంచమందు హిందూదేశమందు ఒక చల్లనియారామము.



మృగహింసపై నాగరకతా సాధనమును ఎత్తుటకు 20 వ శతాబ్దమునుండి హిందూదేశము విముఖమయి యున్నది.

మనుష్యునివలన బాధకు, హింసకు దూరమై మృగము సుఖముగా నిచ్చట జీవించుచున్నది. పనిలేని మృగహింసావారకసంఘమును జూచుచు వేలకొలదిమైళ్లు అచ్చట ప్రయాణము చేయుదుము. మనుష్యునకు మృగమునకును గలసంబంధముపై ఆధారపడి నీతిశాస్త్రమును హిందువులు ఆకృతినొందించిరి. మృగముల హక్కులను దయావంతమైన హిందూసంఘముగ్రహించినది. మృగములు ఆత్మగలిగినజీవులు కాని, అవయవములనుకదలించుయంత్రములు కావని వారుకనుగొనిరి. వానితత్వమును పరిశోధించిరి. వానిక్షేమమును ఆలోచించిరి. మనుష్యరక్షణముకన్నను మృగరక్షణమును ఎక్కువగా పాటించిరి. ప్రపంచములో మిక్కిలిగా నిర్లక్షింపబడుచున్న మృగరక్షణమున వా రింత యెక్కువ గురియుంచుట తప్పుగాదు. తప్పయినను న్యాయపక్షమున జేసినతప్పని యొప్పుకొనవలెను.

ఇందు అద్భుతమైనధర్మమునాచరించుటకు ఏరాజశాసనము అవసరముకాలేదు. ఎత్తైడు రాజశాసనముకన్న తులమెత్తు విద్య ఎక్కువబరువైనది. మనుష్యహృదయమును భుజాబలమెప్పుడును చేపట్టలేదు. హిందూదేశములో ఏనాటికిని తరుగని దయాసరస్సులు గలవు. మరుభూములనన్నిటిని అవి తడుపగలవు. చట్టములయందును, పోలీసులయందును హిందూదేశమునకు ఎప్పటికిని నమ్మకములేదు. బలమునకు క్రౌర్యమునకు ఆ దేశము ఆశింపదు. ప్రేమకు చేయిచాచును.

కోట్లకొలదిబిడ్డలకు చిన్నతనమునుండి మృగములను ప్రేమిం
చెడి విధమును ఆ దేశము బోధచేయుచున్నది.

ఈ బోధ 25 వందల సంవత్సరముల క్రిందట హిందూ
దేశములో ప్రారంభమై నేటికిని అడ్డులేకుండ సాగుచున్నది.
ఆచారము, మతము, వేదాంతము, ఇవియన్ని ఒకవైపునకు
మరలి ఏకవిధముగా చదువు చెప్పుచున్నవి. హిందువునిమన
స్సులో ఆచదువు నాటుకొనిపోయినది. గుఱుతుపడినది. ఇట్టి
గురుతు ప్రపంచములో నిక నెవ్వనిమనస్సునందును కనుగొన
లేము. పుట్టువుతోడనే హిందువు మృగప్రియుడు. పలుసంవత్స
రములఆలోచనమీదనైనను మృగహింసను మానలేదు.
అతడు హిందూసంఘమున జన్మించినప్పుడే ఆయోగ్యత అతనికి
గలిగినది. భూతదయతో నిండిన గాలి నతడు పీల్చును. మృగ
హింస ఆతనిసుకుమారభావములకు అసహ్యమైనదిగ గాన్పిం
చును.

హిందూదేశములో అంతకు పూర్వకాలముననే భూత
దయ అవతరించుటకు అనేకకారణము లున్నవి. ప్రకృతి
యీ యవతరణమునకు తోడైనది. ఇది వెచ్చనిదేశము.
ఉత్తరదిక్కునందలి శీతలదేశములలోకంటె వెచ్చనిదేశము
లలో ప్రకృతి ఎక్కువగా సౌమ్యాకారమును వహించును.
శీతలదేశములలో ప్రకృతి మానవునకు మిత్రుడుగా నుండు
టకు బదులు శత్రువుగా నుండుచున్నది. ఇల్లు విడిచి పని
చేయువారి జీవనము శీతలదేశములో కష్టమైనది. వెచ్చని
దేశములలో అది మితిలేనిసుఖము నిచ్చును.



కాంతిప్రవాహముతో వేకువవచ్చి చరప్రపంచమును
లేపును. గవాక్షములయొద్ద పక్షులు కలకలధ్వనులు చేసి నిద్ర
లేవనిసోమరుల కన్నులు తెరచును. స్నానమునకు నీరిచ్చెడి
నదులు అన్నికాలములయందును సిద్ధములుగా నున్నవి. నిండు
పగటివెల్తురులో సర్వప్రపంచముఖమును జూచుచు హిందువు
స్నానము చేయగలడు. అన్ని ఋతువులయందును చెట్లు
పండ్లు చేతబూని యిచ్చుచున్నవి. పక్షులు ఆచెట్లయందు
కదలికలేని కాపురము చేయుచున్నవి. తోటలు పలువాసనల
ఈనుచున్నవి. పువ్వులకు తక్కువలేదు. భక్తుడు పూలపూజ
చేయును. పండుగలలోను, సభలలోను, గృహస్థుడు అతిథుల
మెడలలో పూలదండలు వేయును. ఇల్లాలు పూలుముడుచు
కొని కవికంటికి జీవల్లతగా కాన్పించును. చెట్లు అలసిన బాట
సారికి నీడను అక్కరయున్న గృహస్థునికి వంటచెరుకును
ఇచ్చును.

ఆకులు సయితము దొప్పలుగా, విస్తళ్లుగా నుపయోగ
పడుచున్నవి. పక్షులు ఇచ్చట ఎన్నటికిని విసుగుజెంది విసు
గు పుట్టింపనిగాయకులు. ప్రతివనమున గోరువంకలు కాకులు
హిందూగృహములకు అడ్డులేని అతిథులు. ప్రొద్దుపొడుపున
నెమిలి కుంచెవిప్పి యాడినయాట సుందరమైనది. నిర్భయము
గా లేళ్లు అడవులలో దాట్లువేయుచున్నవి. రొట్టెలు పండ్లు
నుంకము పుచ్చుకొనుచు కోతులు ఇండ్లకప్పులమీద తిరుగు
చున్నవి. ఎద్దు పొలము దున్నుచున్నది. ఆవు పాలను ప్రీవ

హింపజేయుచున్నది. పంది పెంటను తీసివేయుచున్నది. కుక్క యింటిని కాపాడుచున్నది.

హిందువునకు ప్రకృతి యంతసుందరము, ఫలప్రదము. కోపము వచ్చినప్పుడు ప్రకృతి చేసెడి అపకారముకంటెను తక్కినసమయములందు చేసెడిఉపకారము హెచ్చుగానున్నది. వరదలు, తుపానులు, సుడిగాలులు హిందువును బొత్తిగాక్రుంగజేయవు. ప్రకృతిమొగముపై ఆతనికెల్లప్పుడును చిరునవ్వగపడును. అరుదుగా కన్బొమ్మలముడుతలు కాన్పించినను అతడు నిరుత్సాహపడడు. ప్రకృతిని తల్లినివలె హిందువును ప్రేమింప నేర్చుకొనక యెట్లుండగలడు? శీతలదేశములలో అంతయువ్యత్యస్తము. మనుష్యునికి ప్రకృతికిని తీరనివిరోధము. అతనికి ప్రకృతివలన అపాయము కష్టము తప్పనివి. మంచు వాన అతనినెప్పుడును బాధించుచుండును. వంటచెఱకుకొరకు అతడు భూగర్భమును ఛేదింపవలెను. శరీరముయొక్క ఉష్ణమును నిల్పుకొనుటకు అతడు నిరంతరము ప్రకృతితో పోరాడుచుండును. నదులు గడ్డకట్టిపోవును. చెట్లు చలికి ముడుచుకొనియుండును. పక్షులు కొన్ని చచ్చిపోవును. కొన్ని వెచ్చని దేశములకు చేరును. పువ్వులు అరుదు. అతి అలభ్యవస్తువులుగా ఎక్కువవెలకమ్ముదురు. ఆకాశము బూడిదరంగుతో నుండును. సూర్యుడు పెక్కుదినములు అగపడడు. చంద్రుడు కాంతిహీనుడు. పొలముపని బాధకరమైనది. ప్రతిఫలము స్వల్పము. మంచు సేద్యగాని యాశల నణచివేయును. యౌవనమునాటి



ప్రేమస్వప్నమువలె వేసవి కడు హ్రస్వకాలములో ముగియును.

సంవత్సరములో చాలభాగము ప్రకృతి, మనుష్యునికి పరమశత్రువై యున్నది. మనఃపరిశ్రమము అధికముగాచేయనిది అచ్చటమనుష్యుడు చరప్రపంచముయొక్క జీవైక్యమును గ్రహింపడు. ప్రకృతినారాధింపలేడు. జీవులజీవమొక్కటేయని వెచ్చని దేశముల ప్రకృతిచాటిచెప్పుచున్నది. సృష్టియంతమంచికేనని ఆమెబోధించుచున్నది. వృక్షప్రపంచము, మృగప్రపంచము తనకు దగ్గిరవని మనుష్యుడు తెలుసుకొనుచున్నాడు. నరునిశరీరమునకు, బుద్ధికిగలఅవసరములను అవి దీర్చుచున్నవి. మనుష్యునికి అవి అన్నవస్త్రములనేగాక కళను, కవితను, శాస్త్రమును ఇచ్చుచున్నవి. పక్షితోను, మృగముతోను అతడు ప్రతిదినము సంబంధముకలిగించుకొనుచున్నాడు. కనుకఅతిప్రాచీనకాలమందే మనుష్యుడు వృక్షములను, పక్షులనుమృగములను ఆరాధించుట కారంభించియుండుటవింతకాదు. పరదేశి ఒకవారముదినములు హిందూదేశములో గడపినను జాలును. అద్వైతమో, ద్వైతమో లేక రెండింటినో యవలంబింపగలడు. వెచ్చనిదేశములో స్వభావసిద్ధమైనసౌందర్యముతోనుండు సూర్యుని, చంద్రుని, పుష్పములను, పక్షులను, చూచి ఆనందించి ఆరాధింపలేనివానిబ్రతుకు రసములేనిది.

వెచ్చనిదేశములో జీవనము శ్రమసాధ్యముకాదు. ప్రకృతిచేయిముడువకదానముచేయుచున్నది. పొలము నాలుగు చాళ్లు గీసెనా కడుపునిండ అన్నము దొరకును. చెట్టుక్రింద

కూర్చున్నమనుష్యునినోట బంగారుఫలము రాలును. అన్ని ఋతువులయందును ఏవోపండ్లు మిక్కిలివిరివిగా ఫలించును. భూమిఅన్నమును పితుకునని చెప్పవచ్చును. మనుష్యుడు ఆహారముకొరకు విశ్వప్రియత్నము చేయనక్కరలేదు. సుఖముగానున్నప్పుడు మనుష్యులు శాంతితోనుందురు. మనఃపీడనకు హేతువైనవిషయము లేనప్పుడు శాంతికి, భ్రాతృత్వమునకు నరుడు ఆశించుచుండును. ఆకలి, అవసరము, ద్వేషమునకు జన్మకారణములు. వీనిచేప్రేరితులై మనుజులు మనుజులనే హింసించుతరి మృగములను ప్రేమింతురా? పూర్వకాలమున హిందూదేశములో ఐశ్వర్యముకొరత లేకయుండెను. ఈసుఖదశయందే భూతదయ తల యెత్తినది.

మనుష్యహృదయమున భూతదయ మొలచుటకు శాంతి స్వేచ్ఛ అవసరములు. బానిసలకుగాని, కలహనిమగ్నులకుగాని భూతదయను గుఱించి వినిపించినచో అది వారికి వినబడదు. యుద్ధము, రాజపీడ, సంఘబాధ నిలుచున్నచోట దయ నిలువలేదు. దయాబోధ బయలుదేరి వర్ధిల్లినకాలమున దేశములో అంతఃకలహములుగాని, పరరాజులదండయాత్రలుగాని లేవు. వలసినంతస్వాతంత్ర్యమును జను లనుభవించిరి. ఒక్కొక్కపట్టణ మొక్కొక్క రాజ్యముగా నుండెను. క్రూరశాసనములేవియు వారిని కుంగద్రొక్కలేదు. స్వేచ్ఛాచింతన నిర్నిరోధముగా సాగెను. నూతనమతములు లేచెను.

సౌఖ్యము, స్వాతంత్ర్యము, ఆనందము అనుభవించుచున్న కాలమున ప్రజలు జీవితముయొక్క ఉత్తమ ధర్మ



మును ఆలోచించుటకు అవకాశముండును. సత్యము, సర్వసమత్వము, నీతి, ఆకాలమున జనుల నావేశించినట్లు కనబడుచున్నది. అప్పటి ఋషులు నిర్వచించిన వ్యక్తిధర్మములు, నీతియెంతవరకు లేవగలవో అంతవరకును లేచినవి. వారిధర్మములలోని కెల్ల నుత్తమధర్మమును "అహింసా పరమోధర్మః" అను వాక్యమువలన తెలిసికొనవచ్చును. ప్రపంచములో ఏమహాత్ముడు బోధించిన ఏపరమధర్మముతోనైన ఈధర్మము సరితూగగలదు. జీవహింస మానుటయే ఘనధర్మమని వారు గ్రహించిరి. ఈజీవులలో వృక్షములు మృగములుకూడ ఇమిడియున్నవి. జీవిరాజ్యము సమానాధికారముగల వ్యక్తుల స్వగాజ్య మని వారు భావించిరి. దానిలో మనుష్యులు, సేవ్యులు, మృగములు బానిసలుగా వారెన్నడును దలపలేదు. మనుష్యుడు సర్వాధికారియని వారు అనుకొనలేదు. తేనెటీగగాని, పట్టుపురుగుగాని మనుష్యునికొరకు జేయబడలేదు. వానికొఱకే అవి చేయబడినవని వారిమతము. "ఆచారాంగసూక్తము" అను జైనగ్రంథములో ఈవిషయమును గుఱించి ఇట్లు చెప్పబడియున్నది:—

"తనకు భోగము గౌరవము, వైభవము కావలెనని మనుష్యుడు వృక్షములయెడపాపమొనర్చుచున్నాడు. అందుచే ఆనందమును, జ్ఞానమును గోల్పోవుచున్నాడు. మనుష్యునివలెనే వృక్షములును పుట్టి పెరుగుచున్నవి. మనుష్యులకువలెనే వృక్షములకుగూడ ప్రాణముగలదు. కొట్టినప్పుడు మనుష్యునివలెనే వృక్షము బాధనొందును. మనుష్యునివలెనే వృక్షములు

నశించును. మేము చేయుబోధయిది. ఏజీవినైనను తరుమ
గూడదు, బాధింపగూడదు, చంపగూడదు. సోదరులారా!
మీకు బాధ సంతోషకరమా, దుఃఖకరమా అని అడిగి
నప్పుడు వచ్చెడి ప్రత్యుత్తరమును వినుడు. జీవులకు బాధ
దుఃఖకరము, అసహ్యము.
జంతువులను కొందరు యజ్ఞములకు చంపుదురు. కొందరు
తోళ్లకు చంపుదురు. కొందరు మాంసమునకు చంపుదురు.
కొందరు నెత్తురునకు చంపుదురు. గుండెకు, క్రొవ్వునకు, ఈకె
లకు, తోకకు, దంతములకు, కొమ్ములకు, జంతువులను చంపు
దురు. తమకుహానిచేసినవని, హానిచేయునని కొందరు చంపు
దురు. మృగములకు హానిచేయనివాడు సుకృతి, జ్ఞాని. ఇది
తెలిసికొని జ్ఞాని యెప్పుడును మృగములను బాధపెట్టడు, పెట్ట
మనడు, పెట్టనీయడు" ప్రకృతి చెప్పక చెప్పినసందేశము మత
ముగా నీతిగా యేర్పడినవిధము చూచితిమి. మృగములయెడ
దయజూపుట మతమని నీతియని భావించినది హిందువు
లొక్కరేసుమా.

హిందూదేశములో అనేకనీతులు తలలెత్తినవి. తలలు
వంచినవి. కాని అహింసానీతిమాత్రము నిశ్చలముగా హిందు
వుని మనస్సీమలో నిల్చియున్నది. రాజ్యాలుమారినవి. రాజు
లు మారినారు. దండయాత్రలుపైబడినవి. ఘోరయుద్ధములు
రేగినవి. హిందువుకు ఈనీతినిమాత్రము మరువలేదు. ప్రపంచ
మందలి బోధకులలో గొప్పవాడు బుద్ధుడు, మృగములను
వెనుకవేసికొని బోధించెను. ఈబోధ యింతదృఢముగా ఏల



నాటుకొన్నది? ఇతరదేశములోలవలె ప్రథమబోధకులు హిందూ
దేశములో సాధారణ స్త్రీపురుషులు గారు. వారు ఋషులు,
యతులు, మహాసత్త్వులు. గొప్పశక్తి యాబోధకు వినియోగిం
పబడినది. తరుగని అసాధారణమేధ మిక్కిలిగా దీనికుప
యోగింపబడెను. కనుక ఈబోధ ఒకప్పటికి వినబడనంత
దౌర్బల్యమును బొందదు. ఈవిషయమె యిప్పుడు దయామత
మును వ్యాపింపజేయనెంచు యూరపియనులు అమెరికనులు
తెలిసికొనవలసియున్నది. ఉత్తమమేధావతులు, ఉత్తమమేధా
వంతులు ఈనీతివ్యాపనమున నడుములు కట్టుకొనవలెను. ఈ
నీతిబోధకసమితి రాజ్యాంగముగా మారి హీనముకాగూడదు.
ఈ బోధ ఐశ్వర్యవంతుల విలాసకార్యముగా పరిగణింప
గూడదు.

మృగములసంతోషములు దుఃఖములు మనుష్యులసం
తోషములుగను, దుఃఖములుగను భావించునపుడు వానిపైని
ఒకవిధమైనదయ కలుగకమానదు. దయాబోధకు పునాది
ఈభావనయే. పంచతంత్రము హిందువుల కట్టుకథలసముదా
యము. ఇది అనేకపురాతనాధునికభాషలలోనికి తర్జుమాచేయ
బడినది. పాశ్చాత్యుల ఈసపుకథలు పంచతంత్రమునుం
డియే గ్రహింపబడెను. ఈకథలకు జన్మస్థానము హిందూదేశ
మనుమాటను కొందరుసంశయింతురుగాని ఆసంశయమునిజమై
నదికాదు. ఈకథలను రచించినజాతి మృగములయలవాటులు
చర్యలు ఆసక్తితో చూచునదిగా నుండవలెను; మృగములను
చంపి తినెడు జాతులకు ఈఆసక్తి యుండనేరదు. గనుక

హిందూదేశమున దప్ప మరి యే దేశమునను ఈ గ్రంథము వ్రాయబడలేదు - అని నిశ్చయముగా చెప్పవచ్చును.

హిందువుల వేదాంతముకూడ భూతదయను పెంచినది. మృగములకు ఆత్మకలదని, మృగములు మనుష్యజన్మమునకు రాగలవని వారు నమ్మెదురు. బుద్ధుడు నరజన్మమొందుటకు పూర్వమనేకపశుజన్మములగడిచెనని విశ్వసింతురు. మృగమునకు మనుష్యునకు గల యెడమును ఈనమ్మిక కలుపుచున్నది. మృగములకు ఆత్మలేదనుపాశ్చాత్యులమతము వానికిని మనుష్యులకునుగల ఎడమును అధికము జేయుచున్నది. హిందువులభగవదవతారసిద్ధాంతము కూడ మృగములను గౌరవించుచున్నది. పురాణములప్రకారము చేప, తాబేలు, పంది మొదలగు అవతారములను భగవంతుడు దాల్చెను. ఒకప్రక్కను తాబేలు, మరియొకప్రక్కను బుద్ధుడు ఉన్న కొలకఱ్ఱి మృగములకు ఉచ్చస్థానము నిచ్చుచున్నది.

శాకాహారము, భూతదయ కలిసి సాగుచున్నవి. మృగములను దయతో జూడుమని పిల్లలకు బోధించి ఉత్తరక్షణముననే ఆపిల్లకు మాంసము భుజింప బెట్టుట హాస్యాస్పదము. అనేకశతాబ్దముల అనుభవమువలన హిందువు లీసత్యమును పూర్వకాలముననే గ్రహించిరి. దయాగుణము ప్రపంచమునందలి అన్నిసంఘములయొక్క మూలమూలలను వ్యాపించెనేని మనుష్యుడు మృగమును ప్రేమించుదశవచ్చును. సింహము పచ్చిక తిని గొఱ్ఱెపిల్లపార్శ్వమున బరుండుకాలము వచ్చును.



మృగములకు వైద్యశాల లేర్పరచిన మొదటిదేశము హిందూదేశమే. క్రీస్తు పుట్టకముందు మూడువందలయేండ్ల క్రిందటనే హిందూదేశములో పశువైద్యశాలలు అచ్చటచ్చట తలయెత్తెను. స్త్రీలు, పురుషులు రోగపీడితములగు పశువులను జూచి జాలిపడుదేశములో భూతదయ మిక్కిలి ఉన్నతదశనందియుండకమానునా? పక్షిని మృగమును పామును అదియిది యననేల? అన్నిజీవులను హిందువులు ఆదరముతో జూచుచున్నారు. నెమిలిని చంపరు. అది కుంచెవిప్పినడియూరిలో భయములేకుండనాడును. పంజరములోని చిలుకకు పాలు నీరు అన్నము మొదలగునవి బాలుడుమొదలు వృద్ధునివరకు పెట్టుదురు. వానిపాట, వానియానందము వారికి ఆనందము నిచ్చును. వానిని తుపాకితో కాల్చుటకుగాని వానిగుడ్ల నపహరించుటకుగాని వారికి చేతులురావు. చిలుకలను పంజరములో నుంచుటయే అనేకులకిష్టముండదు. ఒకబీదవాడు చిలుకను పట్టుకొని అమ్ముటకు తెచ్చెనేని భూతదయామయుడైన హిందువు వెలయిచ్చి దానిని విడిపించును. హిందువుల భూతదయయొక్క లోతు ఇట్టివనేకములు తెలుప గలవు. జీవులకు శత్రువులైన పాములుకూడ హిందువులదయకు పాత్రమగుచున్నవి. ఒకబొక్కలోగాని, రాతిక్రిందగాని అణగియున్న పామును ఊరక అనేకులు చంపరు. పాములవానిని పిలిచి పట్టింతురు. అడవిలో విడిచిపెట్టుమని వానికి చెప్పుదురు.

భూతదయ హిందూదేశములో ఎంత గాఢముగానున్నదియు, అతడు ఆవును పూజించు విధమువలన దెలిసికొన

వచ్చును. గోవును జంపినవాడు బహిష్కరింపబడును. గోవును
మాతయనిచెప్పుఆచారము గలదు. ఉపచరించు మూగజీవు
లకు హిందువులు జూపు కృతజ్ఞతను ఋజువుచేయుటకీయాచా
రము చాలును. ధర్మశాస్త్రకర్తలు గోవును అఘ్న్య అని
చెప్పిరి. చంపదగనిది అని యర్థము. నేటికిని గోవును కాపాడు
టకు పుట్టిన శూరునిగా హిందువు తనను భావించుకొనును.
శాకాహారికానిహిందువు సయితము గోమాంసము తినడు.
ఆవును చంపిన నిమిషముననే హిందువు హిందుత్వమును
గోల్పోవుచున్నాడు. పశ్చిమ దేశములలో దీర్ఘకాలము నివ
సించినను హిందువు గోమాంసభక్షణమునకు నాలుక జాప
లేడు. అరాజకునికంటెను, నాస్తికునికంటెను, దేశద్రోహి
కంటెను, గోహంత యెక్కువ గర్హ్యుడుగా ఎంచబడుచున్నాడు.
గోరక్షణముకొరకు హిందువులకును మహమ్మదీయులకును
ఎన్ని లహములు సంభవింపలేదు? గోరక్షణ హిందూ దేశము
లోని భూతదయయొక్క పటిమను జూపుచున్నది. ముసలి
యెద్దులు, ముసలిఆవులు, కోతకు బోవుటకు ముందు వీనిని
రక్షించుటకు శాలలున్నవి. భూతదయ హిందూ దేశములో
అనేక యాకారములను తాల్చినది. కొందరు చీమలబారునకు
పంచదార పోయుదురు. కొందరు చేపలకు అన్నపుముద్దలు
వేయుదురు. పురుగులు చచ్చునేమో యని నడచునప్పుడు
కొందరు శ్రద్ధతో క్రింద జూచుచుందురు. ఆరోగ్యమునకు
అవసరమైనపనియే యైనను ఈగలను, దోమలను, వేటాడి
చంపుముందురా? హిందూగృహిణిచేయి ముందుకు రాదు.



బ్రతుకు, బ్రతుకనిమ్ము అనుట హిందువులజప మని చెప్ప
వచ్చును. వీరీ జపమును జీవయాత్రలో ప్రతి నిమిషమునను
మరచిపోక పఠించుచున్నారు.

హిందూ దేశ చరిత్రయందును, పురాణములయందును,
భూతదయకు ఉదాహరణములు అధికముగా ఉన్నవి. తన
కుక్క రానిది స్వర్గమునకు పోనని యుధిష్ఠిరుడనెను. శిబిచక్ర
వర్తి పావురమును రక్షించుటకు తన మాంసమును కోసి
యిచ్చెను. 18-వ శతాబ్దములో మహారాష్ట్రరాజ్ఞి అహల్యా
బాయి తన సంస్థానమునందలి కొన్నిపొలములనుండి పక్షు
లను తోలవలదని యుత్తరువు జేసెను. 'వానిని కూడ నేను
పాలించుచున్నాను. వానికి ఆహారము, రక్షణ నేనీయవలెను-
అని ఆమె యభిప్రాయము. హిందూ దేశపు వాఙ్మయమున
మృగముల కథలు మిక్కిలి బాగుగా నున్నవి. హిందువులు
కట్టుకథలు వ్రాయుట కనుగొనిరి. వారు మృగముల తెలివి,
చాకచక్యము ఈ కథలలో వ్రాసిరి. వారికి మృగముల జీవిత
ములయెడ గల సానుభూతిని ఈ కథలు తెల్పుచున్నవి.
మృగములను మనుష్యులవలె భావించి ఈ కథలు వ్రాసిరి.
చిన్నతనమున వీనిని చదువుటవలన మృగములను గురించి
క్రూరమైన తలపులు మనస్సున కెక్కనేరవు. మృగములకు
ఆత్మ లేదు అని పాశ్చాత్యతత్వజ్ఞుల మతము. ఒకడు ఒక
కుక్కను తన్ని అది మొరగగా దానిని జూచి "దానికి బాధ
లేదు. ఎందుచేతనన ఆత్మ లేదు" అని చెప్పెనట. ఇంత
క్రౌర్యము హిందువు వహింపలేడు.

౧

అంబరీషుడు అయోధ్యరాజు. ఇతడు యజ్ఞము చేయుచుండగ రాక్షసు డొకడు వచ్చి యజ్ఞపశువు నపహరించెను. యాజకుం డతనితో "నీవు యజ్ఞపశువును సరిగా గాపాడకుంటివి. యజ్ఞముభంగమైనచో గ్రతుకర్త వినాశమొందును. నరపశువునైన దెచ్చి యాగము పూర్తిచేయుము" అని చెప్పెను. అంబరీషుడు యాగార్హమైనపశువుకై తిరిగి తిరిగి యెచ్చటను గానలేక రుచికునికడకు వచ్చి 'నాయాగపశువునెవ్వడో యపహరించెను, అన్యపశువెచ్చటను లభింపదయ్యె. నీకు లక్షగోవుల నిచ్చెదను, నీకుమారు నొక్కని యాగపశువుగ నిమ్ము' అని కోరెను. పెద్దకుమారునియందు నాకుప్రీతి. వాని నేనీయజాలనని రుచికుడు పలికెను. కడగొట్టుబాలునందు నాకుప్రేమ. వానినేనీయజాలనని వానిభార్యచెప్పినది. మధ్యవాడుశునశ్శేపుడనువాడు నేనువచ్చెదనన్నుగొనిపొమ్ము అనివచ్చెను. అంబరీషుడు రుచికునకు లక్షగోవుల నిచ్చి వీనిని వెంటబెట్టుకొని పోయెను. మార్గమందువిశ్వామిత్రుడు శునశ్శేపునిజూచి వాని కథ యారసి వానికి మంత్రోపదేశము చేసెను. శునశ్శేపుడు యజ్ఞశాలయందు యూపస్తంభమునకు గట్టబడెను. అతడు విశ్వామిత్రు డుపదేశించినమంత్రమునే పఠించుచుండెను. అపుడింద్రుడువచ్చి యంబరీషునకు యాగఫలమునొసంగి శునశ్శేపుని విడిపించెను.

"రామా"



౨

అమృతము : పృథువు చక్రవర్తియైనప్పుడు భూమి గోరూపధారిణి యయ్యెను. పృథు విందుని వత్సగజేసి యాగోవునుపిదుకగనమృతమువచ్చెను. కాని యది దూర్వాసుని శాపము వలన సముద్రములో బడిపోయె. అదిమరల క్షీరసాగరమును మథించినపిదప నందుండిపుట్టెను. దేవతలుదానవులు కలసియే సముద్రమును మథించిరిగాని మొదటదేవతలే యమృతమును గ్రహించి దానవులకందకుండగజేసిరి. అమృతమంతను దేవతల కిచ్చివేయులోపున దానవులు వీరిపై బడిలాగికొనకుండ నారాయణుడు దానవులను సమ్మోహితులనుగావింప జగన్మోహినీ రూపము దాల్చెను. అమృతముగ్రోలినవారికి మృత్యువులేదు. కావుననింద్రుడు దాని నతిజాగరూకతతో గాపాడుచుండెను.

"భాగ"

3

కాలకలి విరోచనునిపుత్రుడు, బలికంటె పెద్దవాడు. ఇతడు దేవతలకు భయపడివచ్చి కపిత్థవృక్షమై యుండెను. ఆచెట్టుకాయలు పండ్లు దుర్గంధము గొట్టుటచే బశువులకు రోగములు వచ్చుచుండెడివి. వానిని నివారణచేయుటకై నందాదులు శివపూజచేసిరి. చెట్టువృత్తాంతము చెప్పి దానిని నిర్మూలము చేయించుమని శివుడు శంఖకర్ణు డనువానిని బంపెను. నందాదులు రామకృష్ణులే యావృక్షమును నఱికివేయవలయునని వారిచేతనే కొట్టివేయించిరి.

"హరి"

౪

ద్వితుడు ఒక బ్రాహ్మణుడు. ఏకతుడు, త్రితుడు ఇతనిసోదరులు. వీరు ముగ్గురు నొకరాజుకడ గోవులను దక్షిణ బుచ్చుకొని వచ్చుచుండిరి. త్రితుని వంచించి ఏకతుడును ద్వితుడును వానిగోవుల నపహరించిరి. మార్గమున వీరిఉవురకు దోడేలుభయము కలిగెను. దానిని దప్పించుకొనుటకై ద్వితుడు వేరుమార్గమున వచ్చుచు నొక నూత బడెను. ఆనూతి యందు జలములేదు. ఇతడుసంకల్పమాత్రముననే యజ్ఞసాధనమునకు బ్రతినిధులను గల్పించుకొని యజ్ఞముచేసెను. దేవతలు యజ్ఞభాగములను బుచ్చుకొని వానిని వరము వేడుకొనుమనిరి. ఆనూతినుపస్పర్శనము చేసినవాడు సోమపానఫలము పొందునట్లితడు వరము వేడెను. "భార"

౫

పశుపతి శివుడు. దక్షునియజ్ఞమునకు దేవతలందరు వచ్చియుండిరి. యజ్ఞము ధ్వంసముచేయుటకై రుద్రుడు భూతపిశాచములను బుట్టించి దేవతలనుగూడ జెండాడుచుండెను. దేవతలందరు మేము దక్షునిగూడి పశువులైతిమి. మమ్ము రక్షింపుము రక్షింపుమని శివుని బ్రార్థించిరి. వీరిప్రార్థనలకు సంతసించి రుద్రుడు మీరుదక్షునిగూడి పశువులైతిరి. మిమ్ములను రక్షించెదను. మిమ్ములను గాపాడుటచే నేడుమొదలు నేను పశుపతియని బరగుదు ననియె.



౬

కృష్ణు డంతటివాడయినను తనతోడిగోపబాలకులతో గలసి మెలసి మసలువాడు. ఆతడును జల్దిచిక్కములు భుజముపై వేసికొని యరణ్యములకుబోయి పశువులను గాచువాడు. యమునానదీతీరమున బశువులను గాచుచుండగ రాక్షసు డొకడు లేగయైవచ్చి దూడలను జంపుచుండెను. దూడరూపమున వచ్చినరాక్షసు నెఱింగి వానిని గృష్ణుడు వధించెను. ఆవుల నింటికి మఱలించి వచ్చుచుండగ నవి కాళిందిలోని జలము త్రాగెను. ఆ నీరు అందున్న కాళియవిషముతో సంకలితమగుటచే గోవులు మృతినొందెను. కృష్ణుడు వానిని బ్రతికించి యామడువునకు సమీపముననున్న చెట్టు నెక్కి కాళియ సర్పముపై నుఱికెను. "భార"

౭

గోదావరి ఒకనది. ఇదియు శివుని జటాజూటమువలన గల్గినగంగయొక్క భాగమని చెప్పవచ్చును. తొల్లి మహాకాటకము సంభవించి తినుట కేమియు లభించక యున్నపుడు మునులందఱు గౌతమునియాశ్రమమునకు వచ్చిరి. గౌతముడు పడసిన వరముచే నతనిపొలములుమాత్రము పండుచుండెను. ఆ పంట వచ్చినవారి కెల్లఱకు గౌతముడు పెట్టుచుండెను. ఇతని సంపదకోర్వలేక కొందరు మునులు మాయగోవును సృజించి గౌతమునిచేను మేయుచుండుమని పంపిరి. గోవు చేను మేయుచుండుట గౌతమునకు దెల్పిరి. చేనుపోవుచుండుటకు విచారించి

గోవును గొట్టలేక గౌతముడు హుమ్మని జలమును గోవుపై జల్లెను. నీటిబిందువులు దానిశరీరముపై బడగనే యాగోవు చచ్చి క్రిందబడియె. అపుడు మునులు ఛీ ఛీ! యాగోవధచేసిన వానియింట భుజింపరాదనిలేచిరి. గౌతముడు వారిని బ్రార్థించి యే కార్యమువలన నీ గోహత్యాపాతకము పోవునో చెప్పుడని వారిని వేడెను. అచ్చటకు గంగనుదీసికొనివచ్చిన బాతకము పోవునని వారు తెల్పిరి. గౌతముడు శివునిగూర్చి తపస్సు చేసెను. అతడు ప్రత్యక్షమై తనజట నొకదానిని దీసి యిచ్చి యిది పిండుము. ఆ గోవు బ్రతుకును. అనిచెప్పెను. గౌతముడు దానిని బుచ్చుకొని తెచ్చి గోవుపై బిండెను. గోవులేచి స్త్రీరూపధారిణియై చనియె. ఆజలమే నదియయ్యె. గోవును బ్రతికించెనుగాన గోదావరియని దానికి బేరువచ్చెను. గౌతముడానదిని దీసికొని వచ్చుటచే గౌతమి యను పేరుకూడ వచ్చెను.

“వరా”

౮

గోవు దేవతలందఱుకొని బ్రహ్మకడ కేగినపుడు బ్రహ్మ వారికమృతము నిచ్చెను. ఆసురభిత్వసంపదచేత సురభి జన్మించెను. దానిసంతానమేగోవు. కొన్నిగోవులు హిమవత్పర్వతముమీద సంచరించుచుండెను. ఒకలేగ తల్లిపాలుద్రావియుండగ దానినోటనుండినురుగు తపసుచేసికొనుచున్న శివుని శిరస్సుపైబడెను. అతడు కన్నెత్తిచూడగనే నవి నల్లబడియె. దానగోవులుభయపడి యచ్చటనుండి పరుగెత్తుకొనివచ్చుచుండెను. దానినిబ్రహ్మచూచి శివునికడకేగి నమస్కరించి గోవులు



పవిత్రవంతములైనవనియు తా్రగినపిదపబిదికినపాలు దూడ యెంగిలితగిలినను శుచియేయనిచెప్పి శివునకొకవృషభమిచ్చెను. శివుడాతనివాక్యము లంగీకరించి తనదృష్టివలన గపిలమైనగోవు లెక్కువపవిత్రవంతములగునట్లు ప్రసాదించెను. అగ్ని దేవతలను వంచించుటకై తనను దాచుమని గోవులయొద్దకువచ్చి వేడెను. అవిదాచెను. అగ్నిఎచ్చటనుండెనో దెల్పుమని దేవతలు గోవులనడిగిరి. అసత్యమాడక యవి యగ్నిని జూపించెను. తనను తమకగ్నినిచ్చెనుగావున గోవులను దేవతలుమెచ్చుకొనిరి. తనను దాచియుండుటచే కృతజ్ఞుడైయగ్ని తనకారణమునగపిలమైన గోవులు పవిత్రములగునట్లు వరమిచ్చెను. లక్ష్మి గోవులకడ కేగి నన్నుమీయందు వసింపనిండని బ్రార్థించెను. నీవుచంచలవు. మాయందునీవుండరాదు. హుమ్మనిగోవులు తిరస్కరింపగ నామె వానినిబ్రతిమాలెను. అపుడుగోవులు కరుణించి మామూత్రపురీషములందుండుమని యామెకనుజ్ఞనిచ్చెను.

౯

నంది శిలాదుని (శాలంకాయనుని) అయోనిజ కుమారుడు. శిలాదుడుపొలముదున్నుచుండగ నితడు దొరికెను. అది వృషభరూపముననున్న ధర్ముడే యిట్లుజన్మించె. నంది శివునిగూర్చి ప్రార్థింపగ శివుడుప్రత్యక్షమై వరము వేడుకొనుమనియె. సదా శివధ్యానమే తనకుగలుగునట్లు వరముప్రసాదింపుమని నంది కోరెను. శివుడట్లనుగ్రహించి పార్వతికి కుమారుడవుగ గూడ భావింపబడుదువని చెప్పెను. శివుడొసంగినవరమువలననే నంది శివునకు వాహనమును ద్వారపాలకుడునునయ్యెను.

ఇతనిభార్య సుయశ. నంది పార్వతీపరమేశ్వరులవాకిట గావలి గాచుచుండెడువాడు. వారుక్రీడించుచుండగ రావణుడులోపలికి వెళ్లబోయెను. నందివలదనెను. ఇతనిది వానరముఖమని రావణు డాక్షేపణచేసెను. ఇట్లాక్షేపించుటచేత నందికి గోపమువచ్చి 'వానరులచేతనే నీవంశము నాశనముచేయబడు'నని రావణుని శపించెను.

నందిని వసిష్ఠునిహోమధేనువు. దక్షప్రజాపతిపుత్రి యైన సురభికిని గశ్యపునకునుబుట్టినది. దానిపాలుద్రావినవారు పదివేలయేడులు జరామరణములు లేక యుందురు. వసువు లొకసారి నందినిని దిరస్కరించిరి. "ఉ. రా"

౧౦

నృగుడు (ఒక రాజు) అనేకగోదానములు చేసి పుణ్య మును సంపాదించుకొనెను. ఇతడు దానమిచ్చిన గోవొకటి తిరిగి యితనిగోవులమందలో గలసి యితని గృహమునకు వచ్చెను. దాని నెరుంగక నృగుడు ఆ గోవునే మరియొక బ్రాహ్మణునకు దానమిచ్చెను. మొదట నా గోవును బరిగ్ర హించిన బ్రాహ్మణుడు దానికై వెతకి యా బ్రాహ్మణుని యింట జూచి "నా గోవు నీ వేల కట్టియుంచితివి? నా కిచ్చి వేయుమనియె" నృగునివలన నేనీగోవును దానము పట్టితిని. ఇది నాది. నే నివ్వనని యా బ్రాహ్మణుడు పలికెను. వా రిద్దరు తగవులాడుకొని నృగునియొద్దకు వచ్చిరి. (ఎంత కాలము వేచియున్నను నృగునిదర్శనము కాలేదు. అందు



వలన నూసరవిల్లివి కమ్మని బ్రాహ్మణులు శపించిరి.) నాకు దానమిచ్చిన గోవును దిరిగి నీ వెట్లీబ్రాహ్మణున కిచ్చితివని మొదట దానము పట్టిన బ్రాహ్మణు డడిగెను. తా నెఱుగక చేసిన దోషము సైపుమని నృగుడు వేడి యా గోవునకు బదు లుగ వేయిగోవుల నిత్తు ననియె. కాని వా రిరువురును ఆ గోవునే కోరిరి. "భార"

౧౧

భనందుడు నాభాగునికుమారుడు. ఇతనితల్లి యొక వైశ్యునిపుత్రిక యగు సుప్రభ. నాభాగుడు వైశ్యకాంతను వివాహమాడెను. కాన వైశ్యవృత్తులనే యవలంబించి యుండెను. భనందుడు తల్లికడకేగి నే నేమి పని చేయువాడ నని యడిగెను. గోవును బాలించుచుండుమని తల్లి చెప్పెను. అంత భనందుడు గోరూపధారిణియైన భూమిని శత్రురాజులు పాలించుచున్నారు. దానిని సంపాదింపవలయునని హిమా లయ పర్వతమున కేగి తపసుచేసి నీపుడను రాజర్షివలన శస్త్ర విద్య నేర్చుకొనెను. పిమ్మట దన పినతండ్రికుమారు డగు వసురాతునికడకు వచ్చి యర్ధరాజ్య మిమ్మని యడిగెను. నాభాగుడు కోమటివనితను బెండ్లియాడి కోమటియయ్యెను. కాన వానిపుత్రుడును గోమటియే యగుననియు రాజ్యమున కర్హుడు కాడనియు జెప్పి వసురాతుడు రాజ్యభాగ మొసంగక నిరాకరించెను. వసురాతునకును భనందునకును యుద్ధము జరి గెను. భనందుడు గెలిచి తండ్రికడకు వచ్చి యా రాజ్యము

పాలింపుమని కోరెను. నాభాగుడు తాను రాజ్యార్హుడు కానని
చెప్పి కుమారునే పాలింపుమనియె. భనందుడే రాజయ్యెను.
"మార్క"

౧౨

రంతిదేవుడు సంకల్పితకుమారుడు. ఇతడు యాగము చేయబోవుచుండగ గోవులువచ్చి మనుష్యభాషణములనో రాజా! నీయాగమందు మమ్ము వేల్వుము అనిప్రార్థించెను. దానికీతడు సందేహించుచుండ జ్ఞానులే యీకార్యము చేయదగినదని మమ్ము బంపిరి. దీన నీకు బుణ్యమే చేకూరునని గోవులు చెప్పినవి. రంతిదేవుడవికోరినయట్లు చేయుటకంగీకరించి వానిలో నొక్కటియైన వేల్వబడుటకు సంకోచించెనేని యాగము మానుదునని చెప్పెను. ఇతనియాగము వెల్వడిన గోవుల రక్తము నదియై ప్రవహించెను. అదియే చర్మణ్వతి అనునది. అనేకగోచయములు పోయినపిదప నొకయావు తనలేగను జూచి 'అకృపులువచ్చిరి. ఇకసంహరించెదరు.' అనివిచారించెను. గోవు భాష తెలిసినరంతిదేవుడామాటలు విని తనయాగము పరిసమాప్తినొందించెను. రంతిదేవుడు తనకుగల్గినదానిని నడిగిన వారికిలేదనక యిచ్చుచుండును. అట్లివ్వగనితనికి దినుటకు కూడు లేకుండబోయెను. నలుబదిదినము లుపవాసములుకూడ జేసెను. పిమ్మట గొంతయన్నము దొరికెను. కానియప్పుడే యొక యతిథివచ్చెను. వానికి రంతిదేవుడుసగము పెట్టెను. వానివెనుక సూర్యుడు చండాలుడు కుక్కయుగూడవచ్చెను. రంతిదేవుడు తనకులభించినదానిని బెట్టివేసెను. బ్రహ్మాదిదేవతలు నిజస్వరూ



పములుచూపి యాతనియతిథిసత్కారమునకును భూతదయకును మెచ్చుకొని వరము వేడుకొనుమనిరి. రంతిదేవుడు సదా విష్ణుభక్తికలిగియుండునట్లు కోరెను.
"భార"

౧౩

లవణుడు ఒకరాక్షసుడు, మధునికుమారుడు. వీనితల్లి కుంభీనస. వీనితండ్రికి శివుడిచ్చినశూలమును దండ్రి వీనికిచ్చెను. అదియుండుటచే లవణుడుగర్వించిదుర్మార్గుడై మునులను బాధించుచుండెడువాడు. వీనికి నూతేనుగులును రెండు వందల గుఱ్ఱములును ఆఱువందలపశువులును వేయిదుప్పులును నాహారము. వీనిదుండగములు భరింపజాలక చ్యవనాదులు శ్రీరామునియొద్దకుబోయి వానిని సంహరింపుమని కోరిరి. శత్రుఘ్నుడు తాబోయిచంపెదననియె. మధుకైటభులనుసంహరించుటకై బ్రహ్మచేసినయాయుధము శ్రీరామునికడ నుండెను. రాముడు దానిని శత్రుఘ్నున కిచ్చి దానిప్రయోగోపసంహారములు వానికెఱింగించి లవణునికడశూలములేనపుడే వానితో బోరిసంహరింపుమని చెప్పెను. శత్రుఘ్నుడు లవణునితో బోరి ఘోరయుద్ధముగావించి తుదకు వానిని జంపెను.
"ఉ. రా"

౧౪

విశ్వామిత్రుడు గాధిపుత్రుడు. గాధికుమార్తె సత్యవతి తనకొకకుమారుడును దనతల్లికొకకుమారుడును గలుగ వలయునని వేడెను. విశ్వామిత్రుడు కృశాశ్వునికడ నస్త్రవిద్య నభ్యసించెను. గాధియనంతర మీతడే రాజ్యమేలెను.

ఇతడొకనాడు వేటకేగి డస్సి వసిష్ఠునాశ్రమము చేరెను. వసిష్ఠుడు తన హోమధేనువుచే నిష్టాన్నంబులు కల్పించి విశ్వామిత్రునకును వానిపరివారమునకును బెట్టెను. ఈతని గోవు ప్రభావము చూచి విశ్వామిత్రుడు దానిని దనకిమ్మనియె. దానికై లక్షగోవులనైన వసిష్ఠున కిచ్చెదననియె. కాని వసిష్ఠుని తపఃప్రభావముచే నా ధేనువునుండి శబరాదులు పుట్టి విశ్వామిత్రుని పరివారమును మోదిరి. వారు పారిపోయిరి. అప్పటినుండియు విశ్వామిత్రునకు వసిష్ఠునిపై ద్వేషము నీర్ష్యయు బుట్టెను. "భార"

౧౫

వృషధ్రుడు మనువుపుత్రుడు. ఇతడు వేటకేగి మృగమను తలపున హోమధేనువును జంపెను. ఆధేనువును గాచుచుండిన మునికుమారుడు బాభ్రవ్యుడనువాడు వీనిపై గోపించెను. శూద్రునియట్లల కోపించెద వని వృషధ్రు డనియె. గోవును జంపుటయేగాక పైగనిట్లు దూషించుదువా? నీవు శూద్రుడవగుదు అని మునిపుత్రుడు వీనిని శపించెను. ఇతడును వానికి బ్రతిశాపమిచ్చెను. "మార్క"

౧౬

సురభి దేవతలగోవు. దేవతలందరు ఆకలిపొంది బ్రహ్మకడ కేగిరి. ఆతడు వారి కమృతమొసంగెను. ఆ సురభిత్వ సంపదలచేత సురభి పుట్టెను. దానిసంతానమే యెల్లెడల వ్యాపించెను. సురభికి మార్తాండునివలన నేకాదశరుద్రులు



జన్మించిరి. దుర్బలములైన వృషభములనుగూడ ములుకోలలతో బొడిచి జనులు భారము మోయించుచుండుట సురభి చూచి దుఃఖించి ఇంద్రునితో జెప్పుకొనియెను. అతడు వర్షములు కురిపించి గడ్డిమొలపించి వానికి బలము నిత్తుననియె.

౧౭

వేంకటేశ్వరుడు : భృగువు విష్ణుమూర్తి నవమానము చేసినను నత డూరకుండుటచే లక్ష్మికి కోపమువచ్చి కొల్లాపురము వెళ్ళిపోయెను. ఆమె వెళ్ళినపిదప విష్ణుమూర్తి శేషాద్రికి వచ్చి యొకపుట్టలో నుండె. అతడే వేంకటేశ్వరుడు. విష్ణు విట్లు వచ్చుట యెఱిగి లక్ష్మి వీనికి సహాయము చేయుటకై వచ్చెను. బ్రహ్మయు శివుడును ఆవును దూడయునై బయటకు వచ్చిరి. వీనిని మనుష్యరూపమున నున్న లక్ష్మి చోళరాజున కమ్మెను. ఆవు పాలన్నియు శేషాద్రిమీదనున్న పుట్టలో గార్చి వచ్చుచుండెను. ఆవునకు బాలు లేకుండుటచే రాజు గొల్లను గోపపడియెను. అత డా యావు పాలన్నియు బుట్టమీద గార్చుచుండుట జూచి దానిని గొడ్డలితో గొట్టబోయెను. పుట్టలో నున్న విష్ణువు చూచి తనతల యావు తలపై నడ్డుపెట్టెను. ఇతనికి దెబ్బతగిలి రక్తము కారెను. ఆవు రక్తపుమరకలతో వచ్చి రాజసభలో దొర్లెను. దానిసంజ్ఞల గుర్తించి చోళరాజు దానివెంబడిచనియెను. అది విష్ణువుండినకొండమీదకే వానిం దీసికొనిపోయెను. వేంకటేశ్వరుడతనితో గొల్లవాడు చేసినపని చెప్పి యాగొల్లను పిశాచమై యుండుమని శపించెను. వా డతనిని కరుణింపుమని కోరెను.

౧౮.

సత్యకాముడు జబాల యను వనితకుమారుడు. ఇతడు విద్య నేర్చుకొనుటకై యొక గురువునొద్దకు వెళ్ళెను. నీ గోత్ర మెయ్యది యని గురువు వాని నడిగెను. సత్యకాముడు తన తండ్రినే యెఱుగడు. కావున తన గోత్రము నెఱుగక దానిని దెలిసికొనుటకై తల్లికడకువచ్చి యామె నడుగగా తెలియదనెను. గురువు ఆతని కుపనయనము గావించి కొన్ని గోవుల వీని కప్పగించి యా గోవులను గాచుచుండుమనియెను. ఇతడు హారిద్రుమతునకు శిష్యుడయ్యెను. సత్యకాముడు గోవుల నరణ్యమునకు దోలుకొనిపోయి యవి సహస్రసంఖ్యకలవి యగువరకు నచ్చటనే యుంచెను. వానిలో నొక వృషభమందు వాయుదేవు డావేశించెను. ఆ వృషభము సత్యకామా! మేము సహస్రసంఖ్య కలవారమైతిమి. మమ్ము గురువునింటికి దీసుకుపొమ్ము. నీకు బ్రహ్మజ్ఞానము నేర్పెదము. అనియె. అతడు గోవులను మరలించుకొని వెళ్ళుచుండెను. ఇతని కావృషభము బ్రహ్మజ్ఞానమం దొక పాద మెఱింగించెను. అగ్ని యొకపాదము చెప్పెను. సూర్యు డొక పాదము బోధచేసెను. మద్గియనుపక్షి యొకపాదము చెప్పెను. ఇతడు గురువులనింటికి గోవులను దీసికొనివెళ్లగ వీనిని గురువుజూచి నీ ముఖమందు బ్రహ్మజ్ఞానకళలుగలవు. నీకు నేర్పినవారెవరు? అని అడిగెను. ఆచార్యా దేవతలు నాకునేర్పిరి. కాని బ్రహ్మజ్ఞానము గురువువలన నేర్చుకొనవలెను. గాన నీవుపదేశింపుము. అని కోరి అతనివలన సత్యకాము డుపదేశ మొందెను.



## —◆ మహమ్మదీయయుగము ◆—

ఈ యుగము ప్రారంభమైనది మొదలు పశుహింస ప్రబలినది. ప్రస్తుతము పాఠశాలలో చెప్పునట్టిచరిత్రలను వదలి మరికొన్ని విపులముగ వ్రాయబడిన చరిత్రలను పరికించినచో గోచరమగును. జనసామాన్యమును కట్టుదిట్టములలో నుంచుటకుగాని, వారిని ఎట్టిపనికైనను పురికొల్పుటకుగాని మతమునకున్నంతశక్తి మరి దేనికిని లేదు. మతమునందలిగుడ్డినమ్మకము మానవుల వాదనాశక్తిని దొంగిలించుచున్నది. వివేచనాశక్తిలేని మానవులు మతముచేతిలోని కీలుబొమ్మలు. గోసంబంధమైన హిందూమహమ్మదీయకలహములే దీనికి తార్కాణము. మతము......విపరీతపు పట్టుదలలకు కారణ మగుచున్నది. ఇట్టిచేష్టలే సామ్రాజ్యములనుసైతము తుత్తునియ లొనర్పగలవు. మహమ్మదీయులింకను గోవధను సాగింపవలెనని పట్టుబట్టుచో అది కేవలము మౌఢ్యమే. బలుల సందర్భమున తప్పక గోవధ యొనర్పవలెనని "కొరాన్‌లో" ఎక్కడను చెప్పబడియుండలేదు. గోహింసవలన హిందువులు తమపై తిరుగబడుదురనియు, దానికి ప్రతీకారముగా తాము హిందువులసొత్తపహరించుట, గృహములను కాల్చివేయుట మున్నగు క్రూరకార్యము లొనర్చుట కనువగునని మన దేశముపై మొట్టమొదట దండెత్తివచ్చిన తురుష్కులు ప్రవేశపెట్టిన మతాచారమేగాని యిది అనాదినుండియు లేదు. ప్రస్తుతము హిందూమహమ్మదీయ స్పర్థలకు ముఖ్యకారణము గోవునుగురించియే.

హిందూమహమ్మదీయ వైఖరులలో సంఘీభావము
కలిగినచో గోసంరక్షణసమస్య పరిష్కరింపబడినట్లే. గోవును
ఆదరించవలెనని యున్నను లేకపోయినను "బక్రీదు" మున్నగు
పండుగదినములలో గోవధ తప్పనిసరి యని కొరానులో
నున్నదా? లేదు. విద్యాధికు లగు రెండుమతములవారు పర
స్పర వైషమ్యములులేక బాగుగనేయున్నారు. కాని యిప్పుడు
వచ్చినచిక్కు విద్యావిహీనులతోను, జ్ఞానవిహీనులతోను.
వారి మూర్ఖపట్టుదలలవలననే అనేక అత్యాచారములు జరిగి
నవి. ఆస్తులు చాల నష్టమైనవి. దేశమునకు వచ్చినఅపఖ్యాతికి
మేర లేదు.

### —♦ కొరాను ♦—

ఇస్లాముమతప్రవక్తయగు మహమ్మద్ బలులసందర్భ
మున గోవధ యవసరమని ఎప్పుడును చెప్పియుండలేదు. అరే
బియా దేశమున జంతువులు తక్కువగానుండుటచే జంతువుల
నధికముగా బలియొనర్పవలెనని మహమ్మద్ బోధించలేదు.
తీర్థయాత్రాసమయములందు జలచరములగు చేపలు మున్నగు
వానిని తినవచ్చునుగాని భూచరములగు జంతువులను వధింప
గూడదని ఆయన నుడివెను. ఆయన యిట్లుబోధించినను ప్రతి
సంవత్సరము మక్కాయాత్రికు వెళ్ళునపుడు "మైనా" యను
కొండలోయలో అరేబియా దేశస్థు లనేకములగు ఒంటెలను,
గొఱ్ఱెలను, మేకలను బలియిచ్చెడివారు. మహమ్మద్ కూడ
అప్పుడప్పుడు మృతురా లగు తనభార్య "ఖడేజా" జ్ఞాపకా
ర్థమై గొఱ్ఱెలను, మేకలను చంపి వాని మాంసమును పేద



సాదలకు పంచిపెట్టెడివాడు. కాని అరేబియాలో ఎప్పుడైనను
గోవధ యొనర్చినట్లు కానరాదు. కొరానులో సైతము
రెండవ ప్రకరణములో గోవును గురించిన యొక కథ తప్ప
మరి యెచ్చటను గోవుపేరైనను లేదు. ఒంటెలు, మేకలు,
గోవులు వీనిలో తమ యిష్టము వచ్చినవానిని బలియొనర్ప
వచ్చును. కోట్లకొలది హిందూదేశపు మహమ్మదీయులు
ఒంటెల నెప్పుడు బలియొసంగి యుండవచ్చును. అంతమాత్ర
మున నే వారు తమ విధ్యుక్తధర్మమును నెరవేర్చలేదని ఎవ్వరును
అనలేరు. అటులనే అరేబియా, సిరియా, ఈజిప్టు, ట్రిపోలి,
టర్కీ దేశములలోనిమహమ్మదీయులు గోబలి యనిన నెరుగరు.
వీరు తమమతధర్మముల నెరవేర్పలే దని ఎవ్వరైనను పలుక
గలరా? అరేబియా దేశపుసాంప్రదాయము ననుసరింపవలెనన్న
వారు తరుచుగా మేకలను బలియొనర్తురు. బలియొనర్చుటకు
అన్నిజంతువులకన్నను గొఱ్ఱెయే శ్రేష్ఠమని మహమ్మద్ చెప్పిన
ట్లున్నది. కావున ఆయనయిష్టప్రకారమే నడువవలెనన్న
గొఱ్ఱెలనే బలియొనర్పవలెను. మన దేశమున గొఱ్ఱెలు మేకల
కన్నను ఆవుమాంసము చౌకయగుటచేతను, మహమ్మదీయులు
చాలమంది పేదవారగుటచేతను గోవులనే వారు తరచుగా బలి
యొనర్చుచున్నా రని కొందరు వాదింతురు. కాని పేదవారు
బలియొనర్పనక్కఱలేదని కొరాను స్పష్టముగా బోధించు
చున్నది. హిందూ దేశమునందు తప్ప తదితరమహమ్మదీయ
దేశములలో గోబలి లేకుండుటనుబట్టి ఈఆచారము మహమ్మ
దీయులు మన దేశమున ప్రవేశించినతరువాతనే ఆరంభమయ్యె
నని తేలుచున్నది.

"ఇస్లామ్‌గోరక్షణ" అను ఒకగ్రంథములో మహమ్మద్ తనభార్య యగు "అయేషా"తో ఇట్లనినట్లున్నది:— "ఆవు పాలు చాల ఆరోగ్యకరమైనవి. ఆవుపాలు నేయివలన చాల వ్యాధులు కుదురును. గోమాంసము రోగహేతువు" దీనినిబట్టి మహమ్మద్‌కూడ గోవుయొక్క ఉపయోగము గుర్తించెననిన మాట. భూమి గోవుయొక్క ఒకకొమ్ముమీద నిలిచియున్న దని మహమ్మదీయ శాస్త్రమునం దున్నది. చారిత్రకముగ చూచిన మహమ్మదీయ చక్రవర్తులు చాలమంది గోవులనాద రించినటుల తెలియుచున్నది.

## — మహమ్మదీయ చక్రవర్తులు —

### ( ఫాహియాన్ )

విక్రమాదిత్యుని కాలమున 406-412 లో ఫాహియాన్ అను చైనాదేశపు యాత్రికుడు మన దేశము చూడ వచ్చెను. ఈతనికాలములో పశుచికిత్సాలయములు స్థాపింప జేసెను. జీవహింస జరుగకుండ కాపాడెను. బీదలకు ఔషధ శాలల నేర్పాటుచేసెను.

### — ఘియాస్ - ఉద్దీ - దీన్ - బల్బన్ —

ఈతడు 1266-1286 వరకు రాజ్యము చేసెను. ఈతడు రాజ్యమునకు వచ్చినతరువాత రాజ్యములో పూర్వము జరుగుచుండిన అనేకదురాచారముల నణచెను. వ్యవసాయాభివృద్ధికై పాటుబడెను. గోహింసను చాలవరకు తగ్గించెను. రైతులకు చాల ఉపకారములు చేసెను.



### — ఫిరోజ్‌షాహా —

మహమ్మద్ తుఘ్లఖ్ అనంతరము ఫిరోజ్‌షాహా 1351-88 వరకు రాజ్యము చేసెను. ఈతను మంచిసమర్థుడు. రాజ్యపాలన చక్కగా నెరిగినవాడు. పాఠశాలలు, జంతు చికిత్సాలయములు ఆనకట్టలు కట్టించెను. అందువలన ఈతని ప్రభుత్వము ఇప్పటికిని జ్ఞాపక ముంచుకొనదగి యున్నది. యమునా సట్లెజ్ నదులలోనుండి వ్యవసాయమున కుపయోగమగు కాలువలు త్రవ్వించెను. బీడుభూములను తోటలుగను మాగాని భూములుగను మార్పించెను. ఈతనికాలములో గోహింస చాల తక్కువగా నుండెను.

### — బాబరు —

బాబరు ముఘల్‌వంశపు మొదటిచక్రవర్తి. ఇతను శౌర్యమును, సూక్ష్మబుద్ధియునుగలరాజు. బాబరుసింహాసనారూఢుడై రాజ్యమేలిన కొలదికాలములో గోహత్యావిషయమై హిందువులయొక్క గాఢమగుపరితాపమును గ్రహించెను. మొగలాయి ప్రభుత్వము స్థాపించి బాబరు సింహాసన మధిష్ఠించిన వెంటనే యతడు హిందువులకు ఈవిషయమునగల భావస్థిరత్వమును గుర్తించి తనకుమారునిపేర వ్రాసిన మరణశాసనము నందు హిందువుల మనోభావమును గమనించి గోవధను మాన్పింపు మని ఆదేశించెను. ఈ మరణశాసనముయొక్క అసలునకలు భోపాల్‌సంస్థానపుస్తకభాండాగారములోయున్నది. దానిలో ఈ క్రిందివిషయములు గలవు.

1. మతద్వేషములను నీదరికి రానీయకుము. దేశము
లోని సర్వమతములవాక్కులను గాపాడుచు వారి యాశీస్సుల
బొంది చిరకాలము భూపాలనము చేయుము.

2. ముఖ్యముగ గోసంహారమును బూర్తిగ రూపు
మాపుము. దానివలన నీవు భారతీయుల హృదయపీఠము
నలంకరింపగలవు. హిందూదేశీయుల కృతజ్ఞతాప్రవాహమున
నీవు జలకమాడగలవు.

3. ఇతరుల దేవాలయముల నాశనము చేయక న్యాయము
పాలించుచు రాజునకును ప్రజలకు నుండవలసిన సుహృ
ద్భావము చెడకుండునట్లొనర్చి శాంతిని నెలకొల్పుము.

4. దౌర్జన్యము, దురహంకారములచేగాక శాంతియుత
మగు పరిపాలనద్వారా మహమ్మదీయ సామ్రాజ్యలక్ష్మి చిర
కాలము వర్ధిల్లగలదు.

5. షియ్యా సున్నీలలో భేదములు పోగొట్టి ఇస్లాము
మతముయొక్క బలమును పోషించుము.

6. ప్రజలయొక్క చిత్తవృత్తులను ఋతుభేదములతో
పాటుగ గమనించి రాష్ట్రమున కల్లోలము లేకుండ గాపా
డుము.

బాబరు స్వతస్సిద్ధముగ భారతీయుడు కాడు. అత
డీ దేశమునుజయించి కొంతకాలము పరిపాలించి హిందువుల ప్రేమ
మన్ననలను సంపాదించి ముసల్మానురాజ్యమును స్థిరస్థాయిగ



నెలకొల్పెను. అన్యదేశజుడగు బాబరు గోవధయెడల హిందు
వులు బొందువిషాదమును గుర్తెరిగి గోవధను నిర్మూలము
గావించినపుడు అతనియనంతరము భరతభూమిని బాలించిన
ముసల్మానుచక్రవర్తులిచట హిందువుల సరసనుబట్టి పెరిగి
హిందువులతో బాటు భరతమాతరక్తమును బంచుకొని పుట్టి
యుండుటచే వారు హిందువుల మతాచారములపట్ల నెక్కువ
యాదరణమును జూపియుండిరని భావించవలెను. బాబరు
1526 నుంచి 1530 వరకు రాజ్యము పరిపాలించెను.

## —◆ హుమాయూన్ ◆—

ఇతను 1530 నుంచి 1556 వరకు రాజ్యము పరిపాలిం
చెను. చరిత్రలవలన స్పష్టముగా తెలియకున్నను తన కుమా
రున కిట్టిహితమొసగిన బాబరు తానుమాత్ర మీపద్ధతి నవలం
బించియే యుండుననితోచును. సుపుత్రుడగు హుమాయూన్
కూడ తండ్రియాదేశమును పాలించియే యుండవచ్చును.
తనతండ్రిమరణశాసనములోని యితర విషయములను సక్ర
మముగ జరిపించినయతడు ఈ విషయమునుగూడ జరిపించి
యుండడనుటకు, అందులో హిందువులకు గొప్ప స్నేహితుడగు
నతడు, జరిపించి యుండడనుటకు నవకాశము లేదు. హిందూ
పురుషులేగాక ఘోషాస్త్రీలుగూడ నాతనియెడల విశ్వాసము
గలిగియుండిరి. ఇందుకు తార్కాణముగ చిత్తూరుకోటను
బహదూర్ షాహా ముట్టడించినపుడు ఉదయపురరాణీ హుమా
యూన్ సహాయము నపేక్షించి వాని కొకకంఠహారము కాను
కగా పంపి "నీ సోదరికి తోడ్పడు" మని రాయబారముపంపి

నపుడు హుమాయూను అందుల కెంతయు సంతసించి వెంటనే యుద్ధసన్నద్ధుడై ఆమెకు దోడ్పడెను. ముస్లిమ్ప్రభువుల యెడ హిందువులకు గల యమిత గౌరవమున కింతకన్న వేరు తార్కాణ మవసరము లేదు. తన యౌదార్యముచే హిందూ స్త్రీ పురుషుల యవ్యాజానురాగమునకు పాత్రు డయ్యెను. ఈయన కాలములో గోవధను చాలవరకు మాన్పించెను. గోసంబంధమైన నీతులను తన మతములవారి కెరింగించెను.

—• అక్బరుచక్రవర్తి •—

ఇతను 1556-1605 వరకు రాజ్యము చేసెను. అక్బరు తన రాజ్యములో ప్రజల నందరిని పక్షపాతము లేక పాలించుచుండెను. హిందువులను గౌరవించుచు వారి పుస్తకముల యందు విశ్వాసము గలిగి యుండెను. తన రాజ్యమున పశు మాంసమును దినగూడదని ఆజ్ఞాపించెను. సహగమనము కూడ దనెను. వ్యవసాయము, పశుపోషణలో చాల శ్రద్ధవహించెను. ఫసలీ అనునది ఈయన కాలములోనే పుట్టినది. అక్బరుచక్రవర్తి గోవధను పూర్తిగ నాశనము జేసియు, హిందువులతో సంబంధ బాంధవ్యములు గావించియు, రాజ్యపరిపాలనలో హిందువులను సైన్యాధిపతులుగను మంత్రులుగను నియమించియు, హిందువులయెడ సానుభూతిగలిగియుండినట్లు "యేని అక్బరీ" మున్నగు గ్రంధములలో గానవగును. అక్బరు పాదుషాయనంతరము జహంగీర్ కాలమున గూడ అక్బరుజన్మ దినోత్సవమును దర్బారుఉత్సవమును సక్రమముగ జరుపుచుం



డిరి. ఆ రెండుదినములందును జీవహింస యణుమాత్రమైనను జేయరు. వేట కూడ గట్టిపెట్టెడివారు.

—• నాజరుద్దీన్‌కుస్రూ •—

ఈతనిపరిపాలనలో హిందువులు సుల్తానుప్రాపకమును బడసిరి. ఇతని రాజ్యములో గోవధ పూర్తిగా రూపుమాసెను. కొంతకాలమునకు జిజారీపన్ను మరల ప్రయోగింపబడెను. కొంతకాలమునకు అక్బరుచక్రవర్తి గోవులను సంహరించగూడ దని తీవ్ర మగు శాసనము గావించి దీనికి ప్రత్యామ్నాయముగ విధింపబడినపన్నును రద్దుచేసెను.

—• గోహత్యపై సుంకము •—

గోహత్యను పూర్తిగా మాన్పుటకు కసాయివాండ్రపై గోవున కొక్కటికి 12 జేటలు పన్ను మహమ్మదీయప్రభువులు విధించిరి. ఫిరోజ్‌షా చక్రవర్తి రాజ్య మేలుచుండగ కటికవాండ్రిందరు నీపన్ను దీసివేయుడని గోలచేయగా రద్దుపరచెను. ఫిరోజిషా తొగ్లకుగారి పరిపాలనకు పూర్వము రెండు వందల సంవత్సరములనుండి ఈపన్ను అమలులో నుండెను. గోవధ తగదని శాసించుటకు బదులు ఈపన్ను విధించిరి. దీనినే జిజారీపన్ను అందురు. మహమ్మద్ షా తుగ్లక్ కాలమున రాజమందిరమునందలివంటశాలలో గోమాంసము వండుటగాని రాజు దానిని భుజించుటగాని మృగ్యముగ నుండెను. గ్రంధకర్తలు పెక్కండ్రు మహమ్మదీయ చక్రవర్తుల సువారములను బూర్తిగ వర్ణించియుండిరి. గోమాంసమును వాటియందు

పచన మొనర్చినట్లెన్నడును ఎచ్చటను వ్రాయలేదు. రెండవ గయాజుద్దీన్ తుగ్లక్ కాలమున గుజరాతురాష్ట్రమున కధిపతిగ నియమింపబడి పరిపాలనము గావించుచుండిన ఫర్ హాత్ ఉల్ ముల్కు హిందువులయభిప్రాయమును మన్నించి గోవధ కంగీకరింపలేదు.

—♦ అక్బరుకాలమునాటిపంట ♦—

కలకత్తాప్రాంతములయం దెక్కువ ప్రచారములోనున్న మరియొక కారణముకూడ కలదు. ప్రతిదినము వందలకొలది గోవులను కలకత్తాకు గొనిపోయి "పుకా" యను కృత్రిమమార్గమునగూడ ఆరేడుమాసములవరకు వానినుండి విపులముగా పాలుపితుకుదురు. ఈరీతిగా రెండు, మూడు ఈతలు గడచినతరువాత గోవులు అస్థిపంజరములగును. పాడివడియుగానె వానిని కటికవానికి విక్రయింతురు. గోవృషభములసంఖ్య క్షీణించుటచే భూమికి ఎరువు వలయునంత దొరకుటలేదు. అందువలన ధాన్యోత్పత్తి తక్కువగుచున్నది. అక్బర్ చక్రవర్తికాలమున 5 మణుగులగోధుమలు పండునట్టిభూమియందు ప్రస్తుతము 3 మణుగులు పండుట దుస్తరముగానున్నది. 40 సంవత్సరములకు పూర్వము రూపాయకు 20 శేర్లు దొరకునట్టి బియ్యము ప్రస్తుతము 5 శేర్లయినను దొరుకుట కష్టముగానున్నది. ఇటులనే శెనగలు గోధుమలు పూర్వము రూపాయకు 40 శేర్లవంతున అమ్ముచుండెడివారు. ఇప్పుడవి క్రమముగా నాలుగు, ఆరు శేర్లవరకు విక్రయించబడుచున్నది. నెయ్యిధర రూపాయకు శేరున్నరవంతున నుండెను. ప్రస్తుతము రెండున్నరరూపాయలకు ఒక్కశేరైనను దొరుకుట దుర్లభముగానున్నది. ధరలీవిధముననుండిన కడుపునిండ ఆహారమెట్లు లభించును? వారు దుర్బలులై నిరుత్సాహులై యుండుట ఆశ్చర్యము కాదు.



—♦ మోటురాతియుగము ♦—

ఇప్పటికి ఇరువది ముప్పదివేల సంవత్సరములక్రిందట పూర్వకాలమున ఈపేరు తగియున్నది. అపుడు యీ దేశమంతయు కారడవులతోను, భయంకరమృగములతోను నిండియుండెడిది. మనుష్యులుకూడ మృగతుల్యులై ఎచ్చటనో కొన్నిప్రదేశములందు మాత్రము నివసించుచుండెడివారు. అడవులలోనున్న కందమూలములు వారికి ఆహారము. ఎంతో కష్టపడి వారు వేటాడుచుండెడివారు. వారి ఆయుధములు రాళ్ళతో తయారుచేసిన గొడ్డళ్ళు, బాకులు, కత్తులు, ఈటెలు మున్నగునవి. నిప్పుచేయుట వారికి తెలియని కారణమున వేటాడి తెచ్చిన జంతువుల పచ్చిమాంసమునే తినుచుండెడివారు. ఇండ్లు కట్టుకొనుట తెలియకపోవుటచే ఏచెట్లక్రిందనో, ఏ పొదలమధ్యనో నివసించుచుండెడివారు. వారి వస్త్రములు చెట్లఆకులు, మృగములచర్మములు నై యుండెడివి. చనిపోయినవారిని కాల్చివేయుటగాని, పూడ్చివేయుటగాని వారి ఆచారముకాదు. వానిని బయళ్ళలో పక్షుల కాహార మగునటుల పారవైచెదరు. వింధ్యపర్వత ప్రాంతములందు నివసించు అడవిజాతివారు, ఓఢ్రదేశములోని జువాంగులు, చోటనాగపూరు, సంతల్ పరగణాలలోనికోలులు, సంతలులు, ఉత్తర

సర్కారులలోను, మధ్యపరగణాలలోను నివాసము చేయు ఖాండ్లు, నీలగిరిలోని తోడాలు మున్నగువారిని ఈ రాతి యుగపు జనుల సంతతివా రని చెప్పవచ్చును.

—• నునుపురాతియుగము •—

క్రీ. పూ. 20000 సం॥ నుండి క్రీ. పూ. 30000 సం॥ వరకు ఈయుగము జరిగెను. వేటకన్న వ్యవసాయమే వీరికి ప్రధానజీవన మయ్యెను. వరి కాయధాన్యములు మున్నగునవి పండించుకొనసాగిరి. నిప్పుచేయుట తెలిసినందున వీరు ధాన్యాదులను వంటచేసికొని తినుచుండెడివారు. కుక్క, మేక, గొర్రె, ఆవు, ఎద్దు మున్నగు జంతువులను మచ్చికచేసికొని పశువుల మందలను సమకూర్చుటలో వీరు సమర్థులైరి. పాలు, పెరుగు, వెన్న వీరికి సమృద్ధిగా నుండెడిది.

—• ద్రావిడులు •—

క్రీ. పూ. 30000 సం॥ నాటికి మన దేశమంతయు వీరిచే నిండియుండెను. వీరు వ్యవసాయముచేసి పెక్కు ధాన్యములు పండించుటయేగాక విదేశములతో పెక్కు వ్యాపారములు చేసి యెక్కువ లాభమును పొందియుండిరి. నదీతీరములందు నివసించుచు వ్యవసాయము చేయుచుండెడివారు కొందరు. మఱి కొందరు మెట్టప్రదేశములందు నివసించుచు మెట్టధాన్యము పండించు చుండెడివారు. అడవుల సమీపమున కాపురము చేయుచు పశువులనే ఆధారముచేసికొని యుండెడివారు మరి కొందరు. పర్వత ప్రాంతములందు నివసించుచు వేటనే జీవనో



ప్రాయముగా కలిగినవారు కొందరు యుండెడివారు. వారు గ్రామశక్తులకు బలులుగా జంతువులను నిచ్చుచుండెడివారు. ఆ కృష్ణుడుకూడ ద్రావిడులలోని గొల్లవారిచే పూజింపబడిన దైవ మని కొందరు తలంతురు.

—• బౌద్ధయుగము •—

క్రీ. పూ. 500 వ సం॥ ప్రాంతమందలి స్థితిగతులు.

భారతయుద్ధము జరిగిన తరువాత అయిదారువందల సంవత్సరముల నాటికి అనగా రమారమి క్రీ. పూ. 500వ సం॥ ప్రాంతమున ఉత్తరహిందూస్థానమునందు పదునారు స్వతంత్ర రాష్ట్రము లున్నట్లు తెలియుచున్నది. కురుపాంచాలములు వీనిలో చేరియున్నను క్రీ. పూ. 600 సం॥ నాటికి వీనిప్రాముఖ్యత తగ్గిపోయెను. వీనిస్థానమున కోసల, కాంచి, కౌశాంబి, అవంతి, మగధ మొదలగు రాజ్యములు మిగుల ప్రఖ్యాతి గాంచి యుండెను. బుద్ధుడు తనమతమును బోధించుటకు ఆరంభించినపుడు మగధరాజ్యము గొప్పదశలో నుండెను. ఆరాజ్యమును బింబిసారుడనురాజు పాలించుచుండెను. ఆతడు బుద్ధుని రప్పించి అందరికి మతబోధ చేయించెను.

పామరము లేకుండుట, అన్నిజంతువులయెడ కరుణ గలిగియుండుట, సకలజంతువులను తనవలెనే యెంచి జీవహింస చేయకుండుట మొదలగునవి ఈమతముయొక్క ముఖ్యోద్దేశ్యమైయున్నది.

"అహింసా పరమోధర్మః" అను మహావాక్యమే ముఖ్య సిద్ధాంతముగా గల బౌద్ధ జైనమతములు గుర్తించినట్లు మానవ పశుజీవితముల పవిత్రతను మరి యే యితర మతమును గుర్తించలేదు. యజ్ఞములు, బలులు, మున్నగు కర్మకాండ లేమియు ఈ మతములందు లేవు. పశుబలికన్నను ఆత్మబలియే సర్వోత్కృష్టమైనదని బుద్ధుడు చాటెను. బలియన్న ఆంతరంగికమైనదే గాని బహిరంగమైనది కాదు. "జాతకమాల"యం దొక కథ యున్నది- బోధిసత్త్వుడను రాకొమారుడు గలడు. అతనిపురోహితుడు దేశమునందు వర్షము బాగుగా కురియుటకై యజ్ఞ మొనరింపుమని అతనిని ప్రోత్సహించెను. అప్పుడు బుద్ధుడా పురోహితుని ఈ రెండు ప్రశ్న లడిగెను.

యజ్ఞమొనరింపబడు జీవములు స్వర్గమునకు పోవుచో పశువధ యొనర్పకుండ బ్రాహ్మణులు తమ్ము తామే వధించుకొనరాదా? అప్సరసలచే వడ్డింపబడు అమృతాన్నమును భక్షించు దేవతలు ఈ పశుబలులకై యాసింతురా? ఈ ప్రశ్నలకు ప్రత్యుత్తర మొసగలేక ఆ విప్రుడు యజ్ఞము చేయించుట మానెనట. బౌద్ధమత గ్రంథములం దిట్టి కథలనేకములు గలవు.

బుద్ధునికాలములో భూతదయ పశుసంరక్షణ విజృంభించినది. బుద్ధునిసందేశము నలుగడల వ్యాపించెను. ఆ దినములలో బుద్ధుని ప్రాబల్యముచేత కొందరు రాజులు కూడ పశురక్షణవిషయమై శ్రద్ధ తీసికొనిరని తెలియుచున్నది.



చరిత్రను క్రమపద్ధతిని పరిశీలించినచో అశోకుని దినములలో గూడ పశురక్షణ బాగుగా సాగిన దని విశద మగుచున్నది. అశోకునికాలమునాటికి ప్రజలు వ్యక్తిగతముగ పశువులను పెంచి సేద్యము చేయుచుండెడివారు రాజు తన ప్రజలకు తగినరక్షణ మొసగుట తనవిధి యని గుర్తించెను. అందుచేత ప్రజలు సుఖజీవనము సాగించిరి. ఇది కారణముగ ప్రజలు తమపశుసంపదను కడుశ్రద్ధతో అడవిప్రదేశములలో ఫుల్లరకు దీసికొని మేపుచుండెడివారు. మనుష్య వైద్య చికిత్సాలయములతో పాటు పశుచికిత్సాలయములను స్థాపించి పశువర్ధనమునకు మూలకారకు డాయెను. అశోకచక్రవర్తి యూరపుఖండములో గూడ పశువైద్యశాలల నేర్పరచెనట.

గ్రామమునకు దగినటుల గోవులు తిరుగుటకు తగినభూమి నేర్పరచెను. దున్నకుండినభూములలో పశువులమేతకుగాను బీళ్ళను యేర్పాటుచేసెను. పశుజాతులకు వేరువేరు నామములు బెట్టి పైకి దీసికొనివచ్చెను. అరణ్యమునందు మేయు పశువులకు దొంగలు, మృగములు సర్పములు మొదలగువానినుండి బాధ లేకుండగ వేటకుక్కలసహాయము గల వేటకాండ్రతో నరణ్యమును శోధింపుచు ఋతువుల ననుసరించి యరణ్యమును భాగించి పశువులకు మేపించుచుండుట, మజ్జిగను కుక్కలకు పందులకు బోయించుచుండుట, చోరులచే నపహారింపబడిన పశువును బట్టి తీసికొనివచ్చినవారిని సత్కరించుట, వ్యాధి పశువులకు చికిత్సలు చేయించుట, మొదలగు కార్యక్రమములు ఆకాలములో జరుగుచుండెడివి.

గుప్త మహారాజుల నాటి కీ రాజకీయతంత్రిత విస్తరించినది. ప్రభుత్వమే స్వయముగ ప్రజల కావశ్యకము లగు విషయములను దెలిసికొని చేయూత నొసగుచుండెడిది. ఆదినములలో పశువులకొరకు కొన్నిభూములను సేద్యము చేయకుండ పచ్చికబయళ్ళనుగా వదలిపెట్టెడివారు. రాజు తనపశుసిబ్బందికై వేరువేరు పచ్చికబీళ్లను ఏర్పాటు గావించెడివాడు. ఏనుగుల కొరకబీడు, గుఱ్ఱముల కొరకబీడు, ఎద్దుల కొరకబీడు, లొట్టిపిట్టల కొరకబీడు. ఈవిధముగ జంతుజాతిని ప్రత్యేకస్థలములందు నియమించి మంచిపోషణ జరుగునట్లు అజమాయిషీని తీసికొనెడివారు. తన దేవిడీయందు పశుహింస జరుగుటకు వీలులేదని యశోకుడాజ్ఞాపించెను. బౌద్ధమతమును స్వీకరించినపిదప రాజులు చాలామంది పశుసంరక్షణ జరుపుచుండెడివా రని తెలియుచున్నది. ఈరీతిగా హిందూయుగములో చాలవరకు పశురక్షణ జరుగు చుండెడిది.

మిహిరగులుడను రాజుమాత్రము ఏనుగులను కొండలపై నెక్కించి యచటనుండి దొర్లింపించెడివాడు. ఆయేనుగులగతి యేమి? విగతజీవములై క్రిందపడుటే! ఎంత ఘోరము? అశోకకాలములో పశువధ చేయరాదనియు ప్రతిపక్షమునందు మొదటి 8, 14, 15 వ దినములందునను, పండుగలందును, పుణ్యతిథులందును, ఉపవాసదినములందును, ఎద్దులు, గొఱ్ఱెలు మున్నగువానిని బుడ్డకొట్టరాదని ఆజ్ఞాపించెడివాడు. అశోకుని మరణమునకు, హర్షవర్ధనునిపరిపాలనకు మధ్యనున్న కాలమున ఈయుద్యమమువిషయమున తగినంత శ్రద్ధ కన్పట్టలేదు.



కాశ్మీరదేశమున ఆరవశతాబ్దమున గోపాదిత్యుడును, తొమ్మిదవ శతాబ్దమున అనంతవర్మయు, గుజరాతుదేశమున పండ్రెండవ శతాబ్దమున కుమారపాలుడును, ఈపశురక్షణవిషయమై చాల శ్రద్ధ తీసికొనిరి. ఛత్రపతిశివాజీకాలమున ఈయుద్యమము మంచియున్నతస్థితియందున్నట్లు "శివదిగ్విజయ" మను గ్రంథము తెలుపుచున్నది.

## — బౌద్ధకాలపశువర్ధనము —

(క్రీ. పూ. 500 మొదలు క్రీ. శ. 500 వరకు.)

ఈ కాలమున పశువు లత్యధికముగ వృద్ధినొందినవి. బౌద్ధమత ప్రచారమువలన పశుమేధము లడుగంటినవి. జైనమతాతిశయమువలనను, అశోకాది సామ్రాట్టులయొక్క ప్రేరణమువలనను, జీవదయాళుత్వ మభివృద్ధినొంది మానవవైద్యశాలలతోపాటు పశువైద్యశాలలును బయలుదేరి పశువర్ధనమునకు గారణమైనవి. అశోకచక్రవర్తి యూరపుఖండములో నుండి పశువైద్యశాలల నేర్పరచియుండెనట. అతడు స్వదేశమున నెంత అభివృద్ధిచేసియుండునో మన మిపు డేమి చెప్పగలము? గ్రామనిర్మాణము గోవృద్ధి కనుకూలముగా నుండవలె నను శేష మానాడు గలదు.

(1) గ్రామమునకు దగినటుల గోవులు సంచరించుటకును, బ్రాహ్మణుడు గడ్డి, పువ్వులు, సమిధలు, తెచ్చుకొనుటకును రాజు తగినభూమి నేర్పరుపవలెను. గ్రామమునకు, పొలమునకు నడుమను నూరుధనస్సులు (400 మూరలు) ప్రమా

ణముగల మందబయ లుండవలెను. ముండ్లు రాళ్లుగల ప్రదేశమైనచో నంతకు రెండురెట్లు ప్రమాణముగల మంద లుండవలెను.

(2) దున్నకుండగ నుండిన భూములలో పశువుల మేతకుగాను బీడులను విడువవలెను. గోజాతి విశేషముగా నుండుటచేతను, వేర్వేరుగురుతుల బెట్టుకొని నాటివారు వ్యవహరించుచుండిరి. కొన్నిట నిట శ్రీయుత పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తెలుపుచున్నారు.

(3) ఔక్షవము - ఎద్దులగుంపు

గవ్యా - ఆవులగుంపు

వాత్సకము - లేగలగుంపు

ఒక్కొక్కదానినే గుర్తుపట్టవలసిన యెడల

మహోక్షము - పెద్దఎద్దు

జాతోక్షము - బలిసిన యెద్దు

తర్ణకము - అప్పుడు పుట్టిన లేగ

శకృత్కరి - ఏడాదివయస్సు దాటనిదూడ

దమ్యము - దున్నెడియీడుగలగిత్త

ఆర్షభ్యము - ఆబోతగుటకు తగిన యెద్దు

ఇత్వరము - ఆబోతు

నస్యోతము - ముక్కున తాడుగుచ్చిన యెద్దు

ప్రష్ఠవాట్ - దున్నుట, మోయుట, నేర్చుకొనుచుండిన యెద్దు

శాకటము - బండియెద్దు



ప్రాసంగ్యము - దున్నెడియెద్దు

(4) అశ్వము - చురుకుగ నడచు ఎద్దు

అశ్వతరము - వేసడమువలె పరుగెత్తుయెద్దు.

(5) ఇట్టివిభాగములే యావులకును గలవు.

నైచికి - మంచియావు, వశ - గొడ్డావు

అవతోక - దైవవశమున ఈచుకొనిపోయినయావు

వేహత్ - ఆబోతెద్దెక్కుటచే ఈచుకొనిపోయినయావు

సంధిని - ఎదబోవుయావు

ఉపసర్య - పొర్లదగియున్నయావు

ప్రష్ఠౌహి - లేజూడియావు

పరేష్టుక - పెక్కీతలీనినయావు

ద్రోణదుఘ - నాలుగుసేర్లనిచ్చునావు.

కౌటిల్యునివ్యావహారిక ద్రోణము 187 పలములయెత్తు.

సమాంసమీనా - ప్రతివత్సరమునను ఈను ఆవు.

ఇటులనే యేండ్లననుసరించి "ద్వివర్ష, త్రివర్ష"యను పేరుల పెట్టుచుండిరి.

విస్తారము పాడియుండుటచేతను, పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నేయి మొదలగువానియం దుండు వేర్వేరుభేదములకు వేర్వేరు పేరుల బెట్టుచుండిరి. మేకలను గొఱ్ఱెలను రోమముల కొఱకును, పాలకొఱకునుగూడ బెంచుచుండిరి. మేకబొచ్చుతో నేసినబట్ట కొక పేరును, గొఱ్ఱెబొచ్చుతో నేసినబట్ట కింకొక పేరును బెట్టుచుండిరి. చెవులపిల్లిబొచ్చుతో నేసినబట్ట కలదని యమరుడు వైశ్యవర్గులో వ్రాసియున్నాడు. (ఇది నేటివ్యవ

సాయ శాస్త్రజ్ఞు లెరుగరు. దానికి "శశోర్ణ"మని పేరు. కడచిన మైరోపా మహాసంగ్రామమునందు భారతీయు లాహారము కొరకు తమదేశమునంగల గొఱ్ఱెలను, మేకలను, నామమాత్ర శేషముగ వధించుటచేతను "ఊలు"బట్ట లా దేశమునం దరుదైనవట. ధీశాలురగు జర్మనీదేశీయు లిపుడు కుందేళ్ళ బొచ్చుతో నేసిన బట్టలు, ఊర్ణవస్త్రములకు మారుగా వాడవచ్చుననియు కుందేళ్ళు చిరకాలములో బెరుగుననియు గనిపెట్టి యటు చేయుచుండి రని వార్తాపత్రికలలో జదివియున్నాము. శశోర్ణము బౌద్ధకాలముననే భారతీయులచే కనిపెట్టబడినదని గ్రంధములు చెప్పుట యాశ్చర్యకరమైనది.

ఆంగ్లకళాశాలలలో రక్తప్రసారమును, హృదయకోశ పరిశీలనమును విద్యార్థులకు జూపుటకుగాను శారీరశాస్త్ర (ఫిజియాలజి) పండితులు దానిని తెప్పించుచుందురు. చెవులపిల్లి మాంసాహారులకు భోజ్యముకూడ అగుచున్నది. కాన వర్తక వాణిజ్య, శారీరశాస్త్రములద్వారా మిక్కిలి యుపయోగించు "శశవర్ధనము" భవిష్యత్కాలమున నవసరముగు నేమో? గేదెపాల నుపయోగించుచున్నటుల సామవేదము నందేగలదు. కాని యజుర్వేదమునందు "దున్నపోతు" మృగముగా వర్ణింపబడుటచే మహిషముచే దున్నుటగాని బరువును మోయించుటగాని బండినిలాగించుటగాని శ్రుతికాలమున లేదని తలంచవలెను.

బౌద్ధకాలగ్రంధములలో మహిషవాహన మచటనచట వర్ణింపబడుటచే నప్పటినుండియే మహిషము వ్యవసాయాంగ



జంతువుగా మారియుండును. ఈకాలమున నింతగ పాడిపంట లభివృద్ధినొందినను, దేశీయులకు తృప్తి కలుగక మహాకవులు తమగ్రంధములయందు పాలసముద్రమును, పెరుగుసముద్రమును, నేతిసముద్రమును, చెఱుకుసముద్రమును గల్పించిరి. మధువుల దృప్తినొందించుటకు కాబోలు కల్లుసముద్రమును గూడ కల్పించిరి. నేటికాలమునందు భరతఖండమునందేగాక ప్రపంచమంతటను ఇక్షు, దధి, క్షీర, సర్పి సముద్రములకంటె సురాసముద్రమే హెచ్చుగ నుప్పొంగుచున్నది. పాడి యైశ్వర్యమునకు నెలవగునుగాన క్షీరమునుండియే యైశ్వర్యాధిదేవతయగు లక్ష్మి యుద్భవించెనని పండితులు కవులు కల్పించియుందురు. కర్షకులయింట పాడియుండుననియు, వారి యింటనే లక్ష్మియుండుననియుదలచికాబోలు "హాలచక్రవర్తి" గాథాసప్తశతియను ప్రాకృతకావ్యమునందు కర్షకతనూజ నిటుల వర్ణించియున్నాడు. పథికులు వ్యవసాయకునింట పిండి బొమ్మవలె తెల్లగనుండిన వానికూతుఁజూచి పాలసముద్రము నుండి పుట్టినలక్ష్మియే మో యని రెప్ప వేయక చూచుచున్నారు. నాటిమహారాజులు విశేషగోబృందము కలవారై యుండిరి. దానిని దిలీపునిగాథలో కాళిదా సిటుల వర్ణించియున్నాడు.

'ఓ దిలీపా! యీయావొక్కదానిచేతనే గురువున కపరాధము జేసితినని తలపకుము. వసిష్ఠునికోపము పోగొట్టుటకు నీకడ కుండంతపొదుగుగల కోట్లకొలదియావులు లేవుకనుకనా?' గోవత్సములు లవధ్యములని చాణక్యుడు తన యర్థశాస్త్రమునం దిటుల వ్రాసియున్నాడు.

లేగదూడలు, వృషభములు, గోవులు నవధ్యములు.
వీనిని వధించువాని కైబదిపణములు దండము. నాటి మహారా
జులు విశేషగోబృందముకలవారై తమగోవులపై గోధ్యక్షుడను
నుద్యోగినిగూడ నుంచి గోబృందాభివృద్ధికి తోడ్పడుచుండిరి.
గోవులు, మహిషములు, మేకలు, గాడిదలు, ఒంటెలు, గుఱ్ఱ
ములు, వేసడములు, మొదలైనవానియొక్క యోగక్షేమాభి
వృద్ధి జూచుటకు నాటిప్రభువులు తమ ప్రభుత్వమునందు వజ్రి
శాఖ యను నొకశాఖ నుంచిరి.

1. (అ) గోధ్యక్షుడు గోవులను జీతగాండ్రిచే సంర
క్షింపజేయుట.

(క) సంవత్సరమున కిరువదియొక్కమణుగు నేయి,
కొంత మితిగల తోకవెండ్రుకలు, మృతగోవులనుండి కొంత
చర్మము, నిచ్చుపద్ధతిని సమానసంఖ్యగల లేగలు, లేజూడి
యావులు, ముదరచూడియావులునూ చొప్పున గొల్లవాండ్రి
సంరక్షింప నెంచుట.

(చ) సమాన సంఖ్య గలిగి రోగము, అంగహీనము,
దొంగచేపు, కష్టమువిూద చేపు, చచ్చినలేగలు గల యావు
లను గొల్లవాండ్రికిచ్చి క్షీరాదులలో నర్ధభాగమొందుట.

(ట) శత్రుభయముచేతను, వనజంతుభయముచేతను,
ఇతరులు గోధ్యక్షునకు సమర్పించిన గోవులను జాగ్రత్తపరచి
వారిచ్చినదానిలో పదియవభాగమును వారికిచ్చుట.

(త) వృషభజాతులలో నేయేవృషభము ఎందెందు కుప
యోగించునో ఆయాజాతుల నందందు సిద్ధపరిపించుట.



(ప) రోగమువలనను, వన్యజంతువులవలనను, సర్పా
దులవలనను, దావాగ్ని మొదలగు నితరప్రమాదముల వలనను
గోజాతిని రక్షించుచుండుట.

(య) చోరులచే నపహరింపబడిన గోవృషభముల బట్టి
తీసికొనివచ్చిన వారిని బహూకరించుట.

(శ) బాలవృద్ధవ్యాధిత పశువులకు గోపాలురచే చికిత్సల
జేయించుట - మొదలగుపనులను గోధ్యక్షుడు చేయింపవలెను.

గోపాలుడు గడ్డిని వేయువాడు, పాలు పితుకువాడు,
పాలు, పెరుగు, నేయి మొదలగు వానిని జేయువాడు,
(మృగాదిభయములనుండి రక్షించుటకు చచ్చినవానిచర్మ
దుల జాగ్రత్త పరచుటకు) బోయవాడు నను నైదుగురు
నూరేసిగోవులకు జీతగాం డ్రుండవలెను. అరణ్యమునందు
మేయు పశువులకు దొంగలు, మృగములు, సర్పములు మొద
లగువానినుండి బాధ లేకుండగ వేటకుక్కలసహాయముగల
బోయవాండ్రచే నరణ్యమును శోధింపుచు ఋతువుల ననుస
రించి యరణ్యమును భాగించి పశువులను మేపుచుండవలెను.

మజ్జిగను కుక్కలకును, పందులకును, బోయించుచు
కొంతభాగమును భోజనముకొఱకు కంచుపాత్రిలో నుంచు
కొనవలెను.

రుచికొఱకు జున్నును తెలికపిండిలో గలిపి యుపయో
గించుకొనవలెను. (జున్నును తెలికపిండితో గలిపి నిలువ
యుంచుకొనిన బాగుండునేమో! మనకు గొత్త.) కాని జున్ను
పాలతో పరిశుభ్రమగు తెల్లగుడ్డను తడిపి యూరవేసి జాగ్రత్త

పరచి యవసరమయినపుడు మంచిపాలలో నా గుడ్డను నాన నిచ్చి యా పాలను గాచినచో జున్ను కలుగును. వర్షాశరత్ హేమంతఋతువులలో రెండుపూటలును, శిశిరవసంత గ్రీష్మ ఋతువులలో నొకపూట మాత్రము పాలు బిదుకవలెను. శిశిరర్తుత్రియములో రెండవపూట పాలు బితికిన వానిబొటన వ్రేలు దెగగొట్టుటయే దండము. (ఇది నాటి సంరక్షక శాసనముయొక్క ప్రాముఖ్యమని సూచించుచున్నది.)

## —♦ పశుజాతికిడు మేత ♦—

ప్రతి పశువునకును యథేచ్ఛగ గడ్డిని నీటిని నిచ్చు చుండుటయేగాక యీ క్రిందివిధమగు నాహారము (దానా)ను గూడ నీయవలెను. ముక్కు కుట్టియు, చురుకుగా నడచు నట్టియు, బరువులను మోయునట్టి యెద్దులకు 40 తులముల గోధుమలు, 80 తులములు గడ్డి, 1 తులము తెలికపిండి, 10 కుంచముల పొట్టు, 5 తులములయుప్పు, ముక్కుపైన బూయుట కరసోలెడు నూనె, శేరు పానీయ ద్రవ్యము, 1 తులము మాంసము, 4 శేరులయవలు, లేక మినపపిండి, 4 శేరులపాలు లేక 2 శేరుల కల్లు, 1 శేరు నూనె, 4 తులములకారము, 4 తులముల అల్లపురసము ప్రతిది నము బెట్టుచుండవలెను. దున్నపోతులకు, ఒంటెలకు పైదానికి రెట్టింపును, వేసడములకు గోవులకు గాడిదలకు మొదటి దానిలో నొకవంతు తక్కువగాను ఆహారమిచ్చుచు నుండ వలెను. పనిచేయుఎద్దులకు దానిపనిని బట్టియు, నాహారము నిచ్చుచుండవలెను. ఒకద్రోణమునిడి షుమారు యేడుశేర్లు



గల పాలనుండి యొకప్రస్థము (5 తులములమెత్తు) నేయి వచ్చును. గేదెపాలనుండి సగము హెచ్చుగను నేయివచ్చును. అయినను భూసారము, తృణోదకసారములనుబట్టి పాలు నేయి వృద్ధిక్షయము లగుచుండుట ననుభవముచే దెలిసికొన వలెను. ఇంకను విశేషము నెరుగగోరువారు కౌటిల్యప్రకర ణము చదువగోరెదను. నాటిపాడియొక్క విశేషము లిపుడు మనకు దెలియవుగాని పాలు, పెరుగు, నేయి, మనుష్యులేకాక కుక్కలు పందులు గాడిదెలకుగూడ తగినంతగా యుండెడిదని మాత్ర మర్థశాస్త్రమును బట్టి తెలిసికొనగలము. ఈవిష యము భారతినుంచి తీసికొనబడెను.

## —♦ చంద్రగుప్తుడు ♦—

మగధరాజ్యసింహాసనమునుఎక్కినవారిలో ఇంతటిగొప్ప వాడును, బలపరాక్రమములు కలవాడును ఎవడునులేడు. మగధ దేశమున చంద్రగుప్తునియొద్ద రాయబారిగ నుండిన మెగ స్తనిసును, మరికొందరు గ్రీకులును మగధదేశముయొక్క ఆకాలపుస్థితి, గొప్పతనము, నాగరికత మున్నగు వాటిని గురించి గ్రంథములు వ్రాసియున్నారు. ఆకాలమున చంద్ర గుప్తునిదగ్గర అనేకవేల ఏనుగులు, గుఱ్ఱములు, ఎద్దులు, సకల విధములగు జంతువుల శాలలతో సహా ఉండెడివి. క్రీ. పూ. 316 సంవత్సరములకు చంద్రగుప్తుని కాలములో ఈకాలపునాటి పశుపక్షిఆలయములు ఊహించబడెను. ఇందు లకై విస్తీర్ణమైనప్రదేశములలో జీవహింస చేయనిపక్షులు, జింకలు, చేపలు మున్నగునవి పోషింపబడుటకై ఏర్పాట్లు చేయ

బడియుండెను. బౌద్ధమతములలో ప్రాణసంరక్షణ మహా పవిత్రవంతముగా నెంచబడియుండెను. ప్రతిజంతువునకు నీయవలసిన ఆహారనిర్ణయముగల శాసనము లుండెను. జంతువునకు యేవయస్సులో నెంతఆహారము నీయవలసినది ఆరోగ్యములోను, జాడ్యములోను నెంత ఈయవలసినదియు నిర్ణయింపబడియుండెను.

### —♦ అశోకవర్ధనుడు ♦—

హిందూమతమున ఒకశాఖయై సామాన్యముగా నుండిన బౌద్ధమతమును గొప్పమతముగా అభివృద్ధిచేసి లోకమంతటను వ్యాపింపజేసినది ఈమహనీయుడే. లోకప్రఖ్యాతిజెందిన ఇండియాచక్రవర్తులలో అశోకమహారాజే మొట్టమొదటివాడు. బౌద్ధనీతులను ఆయాదేశభాషలలో రాతిస్తంభములపైన చెక్కించి ఆస్తంభములను నానాప్రదేశములలో నాటించెను. వీటినే అశోకునిశిలాశాసనము లందురు. సత్ప్రవర్తన, పశువైద్యము, భూతదయ నీతులలో ముఖ్యమైనవి. జీవహింస మానుటయే ఈమతములోని ముఖ్యధర్మము. ఈయనకాలములో పశువులను కాలనిర్ణయ ప్రకారము మేపుటలో జాగ్రత్తగలిగి యుండిరి. గుఱ్ఱములు, ఏనుగులు, చేపలు, ఆటపక్షులు, ప్రతిజీవజంతువునకు పశువైద్యు డుండెను. షికారి, అధికారి, అటవీశాఖాధికారి, అశ్వదళాధికారి మున్నగు ప్రతియొక్కరు ఈరాజుకాలములో గొప్పపదవిని బొందియుండిరి. ఈతనికాలములో ఎడ్లకు బుడ్డకొట్టుట మాన్పించెనట.



### —♦ కనిష్కుడు ♦—

క్రీ. శ 120 వ సం॥ ప్రాంతమున కుషానులకు కనిష్కుడు రాజయ్యెను. ఇతను భరతఖండమును పాలించినరాజులందరిలోకూడ ప్రఖ్యాతి జెందినవాడు. అశోకుని తరువాత ఇంతటి గొప్పచక్రవర్తి మరియొకడు లేడనికూడ చెప్పవచ్చును. ఇతడుకూడ ఎన్నియో స్థూపములను, బౌద్ధమతములను కట్టించెను. ఇతనిస్థానమునందు బౌద్ధమతవిద్వాంసులెందరో యుండిరి. వారందరిలో ప్రసిద్ధిగాంచినవాడు అశ్వఘోషుడు. ఇదియునుగాక వైద్యశాస్త్రములలో గొప్పగ్రంథము వ్రాసిన చరకుడుకూడ ఈతనిఆస్థానమందుండినవాడే. ఈతని కాలములోకూడ పశుపోషణ, పశుచికిత్సలు చాలవ్యాప్తిలో నుండెను.

### —♦ కృష్ణదేవరాయలు ♦—

బళ్లారిజిల్లాలో తుంగభద్రానదీతీరమున హంపియను నొకగ్రామము కలదు. 1509-1530 సం॥ వరకు కృష్ణదేవరాయలు విజయనగరమును పాలించుచుండెను. విజయనగర చక్రవర్తులలో ఇతడు మిగుల యుత్తముడు. అనేకరాజ్యములు జయించెను. ఇతడు అనేకగ్రంథములు స్వయముగా వ్రాసెను. ఆంధ్రభోజు డను ప్రసిద్ధి గాంచిన కృష్ణదేవరాయలఆస్థానమందుండిన అల్లసానిపెద్దన్న మనుచరిత్రమును, నందితిమ్మన పారిజాతాపహరణమును, తెనాలిరామకృష్ణుడు పాండురంగవిజయమును వ్రాసినటుల చరిత్రలవలన తెలియుచున్నది. ఈవిజయ

నగరమును నేను ప్రత్యక్షముగా చూచితిని- బలమైనదుర్గములు, నగరములు, మిద్దెలు, మేడలు, అంగళ్లవరుసలు, గుఱ్ఱపు తబేలాలు, ఆలోచనామందిరములు, ఇంక ఎన్నియో చిత్రవిచిత్రములు గలవు. ఈయనకాలములో ప్రతిదినము 4 వేల ఎద్దులు ప్రత్యేకముగ పోషింపబడుచుండెడివి. పెద్దపెద్ద రాతి తొట్టెలలో పాలుపోసి లేగలకు, ఏనుగుగున్నలకు, గుఱ్ఱపు పిల్లలకు త్రాగించెడివారట.

## —♦ సారాంశము ♦—

"అహింసా పరమోధర్మః"అను మహావాక్యమే ముఖ్య సిద్ధాంతముగా గల బౌద్ధ జైన మతములు గుర్తించినట్లు మానవపశుజీవితముల పవిత్రతను మరి యేయితరమతమును గుర్తించలేదు. యజ్ఞములు, బలులు మున్నగు కర్మకాండలేమియు ఈ మతములందులేవు. పశుబలికన్నను ఆత్మబలియే సర్వోత్కృష్టమైనదని బుద్ధుడుచాటెను. బలియన్న ఆంతరంగికమైనదేగాని బహిరంగమైనదికాదు. "జాతకమాల" యందొక కథయున్నది. బోధిసత్త్వుడనునొకరాకొమారుడుగలడు. ఆతని పురోహితుడు దేశమునందు వర్షము బాగుగా కురియుటకై యజ్ఞమొనరింపుమని అతనిని ప్రోత్సహించెను. అప్పుడు బుద్ధుడా పురోహితుని ఈ రెండు ప్రశ్న లడిగెను.

1 యజ్ఞమొనరింపబడుజీవములు స్వర్గమునకు పోవుచో పశువధ యొనర్పకుండ బ్రాహ్మణులు తమ్ము తామే వధించుకొనరాదా?



2 అప్సరసలచే వడ్డింపబడు అమృతాన్నమును భక్షించు దేవతలు ఈ పశుబలులకై యాశింతురా?

ఈ ప్రశ్నలకు ప్రత్యుత్తర మొసగలేక ఆవిప్రుడు యజ్ఞముచేయించుట మానెనట! బౌద్ధమతగ్రంథములందిట్టి కథ లనేకము లున్నవి. బుద్ధునికాలమునందును, బౌద్ధచక్రవర్తులకాలమునందును పశువైద్యశాల లనేకములు నిర్మింపబడియుండెనని తెలియుచున్నది.

## —♦ శిఖ్కులవైఖరి ♦—

గోసంరక్షణవిషయమై హిందువులకున్న యభిప్రాయమునే శిఖ్కులవైఖరికూడ బలపరచుచున్నది. గోవుయొక్క పవిత్రతను గురించి శిఖ్కుమతగ్రంథమగు Granth Sahib నందు యేమియు చెప్పబడి యుండలేదు. వీరి గోవునందు గల పూజాభావము హిందువులనుండి వచ్చినదే. గోవిషయమైన వీరి యభిప్రాయములు Granth Sahib నందున్న కొన్ని కథలను బట్టియు శిఖ్కుసాంప్రదాయములను బట్టియు తెలిసికొనవచ్చును. గోపవిత్రతయందు హిందువులకంటె శిఖ్కులకు అధికమగు మూఢవిశ్వాసము గలదు. గోవధకు విధింపబడవలసిన శిక్ష మరణదండనకన్న యే మాత్రము తక్కువ ఉండకూడదని వారి నిశ్చితాభిప్రాయము. మహమ్మదీయులకు శిఖ్కులకు వచ్చు ఘోరకలహములకు గల కారణము శిఖ్కులకు గల యీ పట్టుదలయే. ఈ పట్టుదలవలననే వీరు మహమ్మదీయులతో పోరాడి అల్పసంఖ్యాకు లగుటచే ఓడి

పోయి తమ సామ్రాజ్యమును కోల్పోవవలసినవారైరి.

పశుసంరక్షణవిషయమున హిందూమతమున కత్యంత సన్నిహిత సంబంధము గల పార్శీమతమువారి మత గ్రంథమగు జెండుఅవేస్టలో బోధింపబడిన కర్మకాండలు చాలవరకు వైదికకర్మకాండలను పోలియున్నవి. పార్శీమత ప్రవక్తయగుజరాతుస్త్రుడు పశువధ మహాపాతకమని బోధించెను. పార్శీమతస్థులుగోవునకన్నను వృషభమే ఎక్కువ పవిత్రమైనదిగా మెంచుదురు. మానవసృష్టికి మూలము పురుషుడని క్రైస్తవ మతస్థులు తలచునట్లు, పశుసృష్టికి వృషభమే మొదటిదని పార్శీవారినమ్మకము. వృషభ వీర్యమువలన దంపతులును, వానివలన 280 విధములైన తదితరజంతువులును పుట్టినట్లు వారిశాస్త్రమునందున్నది. హిందువులకు గోమూత్ర మెంతపరిశుద్ధమైనదో, పార్శీలకు వృషభమూత్రము అంతకన్న ఎక్కువ పవిత్రమైనది. దేహసంబంధమైన యేవిధమగు అంతశ్శుద్ధిగాని, బాహ్యశుద్ధిగాని, వృషభ మూత్రమువలన చేయవచ్చును. మానవశవమునుగాని, జంతుశవమును గాని, తాకినవారు వృషభమూత్రముచే పారిశుద్ధ్యము నొందుదురు.

ప్రసవించినస్త్రీలు ఈరీతిగా చేయుదురు. ప్రసవించిన స్త్రీ మొట్టమొదట బూడిదతో కలిపిన వృషభమూత్రమును 3,6,9 చుక్కలు త్రాగవలెను. తరువాత ఆమె గుఱ్ఱములగాని, ఆవులగాని, మేకలపాలున్ను, పిండియున్ను, నీరుకలుపని ద్రాక్షారసమును మూడుదినములవరకు తీసికొనవలెను. మూడు దినములపర్యంతము ఆమె తనబట్టలను,నవరంధ్రములను, దేహ



మును, నీటితోను వృషభమూత్రముతోను కడుగుకొనవలెను. ప్రాణములేనిశిశువు పుట్టిన స్త్రీలకై యీపద్ధతి మొదట నేర్పరుపబడినను నేడు ప్రసవించిన ప్రతిపార్శీయువతియు ఈ క్రమ ప్రకారము దేహపారిశుద్ధ్యము నొందుట యాచారమైపోయినదని కాప్రొటెక్షన్ అను గ్రంథము తెలుపుచున్నది.

జీవకారుణ్యము మానవుని సహజలక్షణము. కాని బాహ్యపరిస్థితుల వలననే దానిని వెలిబుచ్చుట కవకాశము కలుగుచున్నది. ఒక జీవమును హింసించునపుడు ఆ దృశ్యమును చూచినతోడనే మన దేహము గగుర్పొడుచును. ఒక విధమగు విచారము కలుగును. ఇది యంతయు సహజము. కాని కొందరు కఠిన హృదయులకు ఎంత దైన్యదృశ్యమును చూచినను జాలికలుగదు. మనము కాఫీత్రాగుట ఎంత సులభమో, ఒక తలారికి మానవ శిరములు నరుకుట కూడ అంతే సులభము. ఎల్లపుడు నదే యలవాటగుటచేత వీరి హృదయములు శిలలగును. వీరి కారుణ్యరస మెండిపోవును. కాని వీరిని తమ వృత్తులనుండి మాన్పి ఇతర వృత్తులందు ప్రవేశపెట్టినపుడు వీరి హృదయములందు కరుణరస మెప్పుడైనను పుట్టక మానదు.

## ఆంగ్లేయవైఖరి

ఎన్ని పడరానిపాట్లు పడుచున్నను, తమ బాధలను చెప్పుకొనుటకు పశువులకు నోరు లేదు. అట్టిమూగజంతువులనే సదా ప్రేమించవలెను. ఈ విషయమున బౌద్ధ జైన

మతాదర్శము లనుస్మరణీయములు. కృషికులు పశువులను బాధపెట్టుట తప్పనిసరియైనను, ఆ బాధలు సాధ్యమైనంత తక్కువగ నుండవలెను. ఇంగ్లండు మున్నగు దేశములలో పశువుల నెగుమతిజేయు సందర్భములలో వానిని పెట్టు బాధ లపరిమితములు. శక్తిలేక కదలని జంతువుల చెవులలో నూనెను పోయుట, వానిచెవులలో గడ్డి కుక్కి నిప్పు అంటించుట, వానితోకలు విరుగదీయుట, మున్నగు అనేక ఘోర కృత్యములు చేయుదురట.

పశువధవలన ప్రత్యక్షముగా గాకపోయినను పరోక్షముగా వచ్చు నష్టము లనేకములు. కటికవృత్తి ఎక్కువగాయున్న చోటులనే నేరము లెక్కువగా జరుగుచుండుట అందరికి తెలిసిన విషయమే. లండనునకు తూర్పు భాగములలో వందలకొలది కటికదుకాణములు కలవు. ఆ పశువధ చేయునపుడు వాని వేడిరక్తమునకై అనేకమంది బాలురు చెంబులు పుచ్చుకొని వెళ్లుదురు. అచటివారీ విధమున చిన్నతనమునుండి క్రూరదృశ్యములను చూచుట కలవాటుపడినందున వారిలో చాలమంది కఠినాత్ములు, క్రూరాత్ములుగా తయారగుచున్నారు. అచట జరుగునేరములకు క్రూరకృత్యములకు హద్దు లేదట. సంయుక్తరాష్ట్రములలో జరుగుచున్న హత్యానేరములు చాలవరకు కటికవృత్తియందున్న వారిచేతనే చేయబడుచున్నవి.

టాలుస్టాయికవివరునిచే వ్రాయబడిన ఈ భయానక దృశ్యవర్ణన ప్రతివారును చదువదగినదే. "అది జూన్ మాసము.



ఆరోజు ట్రినిటీపండుగకు ముందు శుక్రవారము. కటికదుకాణములబజారంతయు జనసమూహముతో క్రిక్కిరిసియుండెను. ఎద్దులు, ఆవులు, ఆవుదూడలు బండ్లకు కట్టివేయబడియుండెను. గుఱ్ఱపుబండ్లనుండి అనేక ఆవుదూడలు దుకాణముల లోనికి దింపబడుచుండెను. కొన్నిబండ్లు దుకాణములనుండి పశుశవములను మోసికొని పోవుచుండెను.

నేను నిలబడియున్న ద్వారమున కెదురుగా దుకాణములలోనికి ఇద్దరు మనుష్యులు ఒక బలిసినయెద్దును బలవంతముగా లాగుకొనిపోయిరి. లోపలికి వెళ్ళినతోడనే ఒక కటికవాడు తన బలముకొలది ఆ యెద్దుఅఱ్ఱుపై ఒక్కదెబ్బవైచెను. వెంటనే అది భూమిపై బడి తన నాలుగుకాళ్ళతోను, వెనుక భాగముతోను విలవిలకొట్టుకొనసాగెను. తక్షణమే మరియొక కటికవాడు దానికొమ్ములు పట్టుకొని తలను బొక్కబోర్లగా త్రిప్పెను. ఇంతలో ఇంకొకడు తన కత్తితో దానిగొంతుకను పరపరకోసెను. రక్తసిక్తములగు బట్టలు ధరించిన ఒక కుర్రవాడు ఆయెద్దుకుత్తుకనుండి ప్రవహించుచున్న రక్తము నొక పళ్ళెములోనికి పట్టెను. ఆపళ్లెము నిండుటతోడనే దానిని ఆబాలుడు అల్బూమినిమ్ ఫ్యాక్టరీకి మోసికొని పోయెను. ఇటులనే మరొకపళ్లెమునిండెను. కాని ఇంకను ఆ యెద్దుపొట్ట, వెనుకకాళ్లు, కొట్టుకొనుచునేయుండెను. రక్తము ప్రవహించుట ఆగినతోడనే కటికవాడొకడు దానితల పైకెత్తి చర్మము నొలిచెను. తెలుపునరములతో నున్న ఆ ఎరుపుదేహము చూచుటకు వికృతముగా నుండెను. ఇంకను ఆయెద్దు కొట్టు

కొనుచునేయుండెను. ఇంకొక కటికవాడు దానికాళ్లను పగుల దీసి, నరికివైచెను. పొట్ట ఇంకను పైకి క్రిందికి కదలుచునే యుండెను. తరువాత ఆశవము నావలికి లాగి పైకి వ్రేలాడ గట్టిరి. అంతటితో శవమునందలికదలిక ఆగిపోయెను. ఈరీతిగా ఒకదానితరువాత నొకటిగా అచ్చట పశువుల నన్నిటిని వధించిరి. ఒక్కొక్కప్పుడు కత్తివ్రేటుతప్పుటయు, పశువులు తప్పించుకొని పారిపోవుటయు, వానిని మరలలోపలికి తీసికొని వచ్చుట కనేక అవస్థలు పడుటయు జరుగును. రక్తపువాసన చూచి చాలపశువులు లోపలికిపోవ నిరాకరించినవి. కాని వానితోకలు విరిచి, అనేకఅవస్థలుపెట్టి లోపలికిలాగుకొని పోయిరి. ఈరీతిగా పశువులను చంపుటచూచి భరింపలేము. చంపుట మాన్పలేకపోయినను, అవస్థలేకుండచంపుటకైనను యేర్పాట్లు చేయవలెను."

38

పశువైద్య గ్రంథమాల 18 వ పుష్పము

# విషతంత్రము

గ్రంథకర్త:

"అభినవ సహదేవ" ఆయుర్వేద పశువైద్యాచార్య, వైద్యకళా విభూషణ, పశువైద్యగ్రంథమాల, ఆయుర్వేద పశుచికిత్సాలయ సంస్థాపకులు, ఆంధ్ర జాతీయ పశువైద్య విద్యాపీఠ ప్రెసిడెంటు, ఆంధ్ర జాతీయ పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ నగు,

డాక్టర్ యేజెళ్ల శ్రీరాములు చౌదరి,

A. V. L. M. & S., A. M. B. & B.S.

అంగలూరు, కృష్ణాజిల్లా.

1937

సర్వస్వామ్యసంకలితము]

[వెల రు 0-8-0.

బెజవాడ:
ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడియె.



# విజ్ఞప్తి

నేను సుమారు పదిసంవత్సరములక్రిందట ఆయుర్వేద పశుచికిత్సాలయమును, ఆయుర్వేద పశువైద్యగ్రంథమాలను స్థాపించి అనుభవపూర్వకముగా నపుడపుడు పశువైద్య గ్రంథముల బ్రకటించుచు వార్తాపత్రికలలో వ్యాసములువ్రాయుచు నా శక్తికొలది పశుసేవ చేయుచున్న సంగతి తామెల్లరకును దెలిసియే యున్నది. నేను వ్రాసిన గ్రంథములనుబట్టియు, నాయొద్ద తరిబియతయిన వైద్యులద్వారాను, కరపత్రముల మూలకముగను ఆంధ్రదేశమందంతటను ఆయుర్వేద పశువైద్యమును వ్యాపింపజేసితిని.

మరియొక ముఖ్యవిషయ మేమన నే నిపు డొక ఆంధ్రజాతీయ పశువైద్య కళాశాలను స్థాపించి గవర్నమెంటువారిచే రిజిష్టరు చేయించి యనేకమంది పశువైద్యులను తరిబియతు చేయుచున్నాడను. ఈకళాశాల ప్రభుత్వమువారివలన ద్వరలో రికగ్నైజు కానున్నది.

ప్రస్తుత కాలపరిస్థితులనుబట్టి రైతులకును విద్యార్థులకును తదితరులకును అర్థమగునటుల సులభశైలియందు ఇరువది పశువైద్య గ్రంథములను మాపశువైద్య గ్రంథమాలతరఫున

బ్రకటించితిని. మా యాయుర్వేద పశువైద్య గ్రంథమాల యందు వెల్వడిన గ్రంథ రాజములం దిదియు నొక్కటి. ఇయ్యది పశుధనాభిమానులగు హైందవులకెల్లరకును హస్తభూషణమని చెప్పనగును.

మా యీగ్రంథములపై గవర్నమెంటు వెటరినరీ, అగ్రికల్చరల్, రెవిన్యూ, ఎడ్యుకేషనల్ డిపార్టుమెంటుల యందలి ప్రముఖులగు నుద్యోగులును, తదితర డిపార్టుమెంటుల వారును జమీందారులును భూస్వాములును మున్నగు వారు పెక్కురు పెక్కు సదభిప్రాయములను నొసంగియున్నారు.

మా యీ గ్రంథముల నాంధ్రలోక మాదరించి ప్రతి పాఠశాలయందును, ప్రతిపుస్తకభాండాగారమందును, కో-ఆపరేటివు సొసైటీలయందును ఉంచి మాపశువైద్య గ్రంథమాల నభివృద్ధికి దెత్తురని విశ్వసించుచున్నారము.

ఇట్లు,

గ్రంథకర్త.

# విషతంత్రము

## విషోత్పత్తి

పాలసముద్రమున దేవదానవులు మధించుసమయమున అమృతము బుట్టుటకు ముందుగా తీక్షణ తేజస్సు గలవాడును, భయంకరాకృతి గలవాడును, పసుపురంగువెండ్రుకలు గలవాడును, నాలుగుకోరలు గలవాడును, అగ్నిసదృశమగు చూపులుగలవాడును నగు నొక విషపురుషు డుద్భవించెను. చతుర్ముఖు డాతనిని జూచి హుంకార మొనరించెను. అప్పుడతడు భీకరాకారమువదలి కొన్నిస్థావరజంగమములందు తనస్వరూపమును బ్రవేశపెట్టినందున స్థావరజంగమవిషము లేర్పడెను. అందు స్థావరవిషము అమోఘమై జగతియందు ప్రఖ్యాతి గాంచెను.

## విషలక్షణము

పశువు లోపలికి నుపయోగింపబడినపుడుగాని, లేక శరీరపు పైభాగమున రాచినపుడుగాని ప్రాణముపోవునంతటి ఆయాసమును కలిగించు వస్తువులెల్లను విషము లనబడును.

## విషముయొక్క సామాన్యగుణములు

చమురులేని విషము:-ఇది వాతమును గలిగించును.

ఘాటుగల విషము:- ఇది రక్తమును ప్రకోపింపజేసి హృదయమును సరియైన స్థితిలోనుంచక సంధిబంధముల బిగువు తప్పించును.

స్వల్పాకారముగల విషము:- స్వల్పకాలములోనే ప్రవేశించి ఆకృతి వికృతముజేయును.

తక్షణమే ప్రవేశించువిషము:- ప్రవేశించిన వెంటనే జీవములదీయును.

దేహమంతటను వ్యాపించువిషము:-శరీరమంతయు త్వరలో వ్యాపించును.

వ్యాప్తిజెందు విషము:- ధాతువును నశింపజేయును.

బరువులేని విషము:-స్థానచలనము నొనర్చును.

భారములేని విషము:-చికిత్సాసాధ్యముగావించును.

జీర్ణముకాని విషము:-ఇది దేనిని జీర్ణముకానీయదు.

వేడిమిగలవిషము:-వెంటనే వేడిని పెంపొందించును.

## స్థావరవిషము

వేళ్లు, పత్రములు, పుష్పములు, పట్ట, పాలు, చేవ, బంక, ధాతువులు, దుంపలు నను వాటియందు స్థావరవిషములుండును.

తెల్లగన్నేరు, గురివింద, నలుపురంగుగల అతిమధురము, మ్రింగ, విజయ, విద్యుచ్ఛిఖ, గర్గర, సుగంధ యీ చెట్లవేళ్లు విషమును గలిగియుండును.

విషపత్రి, లంబ, వరదారకము, కరంభము, మహాకరంభము, లేతజొన్న ఈ చెట్ల ఆకులు విషములు గలిగియుండును.

కుముద్వతి, వేణుక, కరంభము, మహాకరంభము, కర్కోటకము, రేణుకము, ఖద్యోతకము, చర్మరి, ఇభగంధ,



సర్పఘాతి, నందనము, సారపాకము ఈ చెట్ల ఫలములలో విషముండును.

వేత్రము, కాదంబము, వల్లీజము, కరంభము, మహాకరంభము, ఈ చెట్లపుష్పములలో విషముండును.

అంత్రపాచకము, కర్తరీయకము, సైరేయకము, మ్రింగ చెట్టు, కరంభము, నందనము, పరాటకముఅను చెట్లయొక్క బెరడు, చేవ, బంకయను వానిలో విషముండును.

కుముదఘ్ని, జెముడు, జాలక్షీరియను చెట్ల పాలయందు విషముండును.

శంఖపాషాణము, తాళకములందు విషముండును.

కాలకూటము, వత్సనాభము, సర్షపము, కర్దమకము, వైరాటము, ముంతకము, శృంగీవిషము, మూలకము, కర్కటము, హాలాహలము, ప్రపుండరీకము, పాలకము, మహావిషము—ఈదుంపలు విషమును గలిగియుండును.

## పై విషములు చేయు వికారములు

చెట్లవేళ్ల విషములు తినిన పశువులు మెలికలు తిరిగి చొంగపడుచుండును. మందమతిగా నుండును.

చెట్లఆకుల విషములు తినినవి నోరు చేదుగనుండి తిక్కపుట్టును. బుసయెక్కువగును. చొంగపడును.

చెట్ల ఫలములు తినినవి మేతతగ్గించి మందమతిగా నుండును. మలమును బంధించును.

చెట్ల పుష్పములు తినినవి కడుపుబ్బును. మందమతిగా నుండును.

చెట్ల బెరడు, బంక, చేవ తినినవి నోటివెంట నురుగు, దుర్వాసన యుండును.

చెట్లపాల విషములు తగిలిన నోరు పొక్కును. పారుచుండును. నాలుక పొక్కును.

ధాతు విషములు తగిలిన దవుడలు నొక్కుకొనిపోవును. నోరుపొక్కును. బాధగానుండును.

దుంపల విషములు చాల ప్రమాదములు. ఆరంభములో గాని కొంతకాలమునకు గాని బాధగలిగించును.

## శత్రువులుచేయు విషప్రయోగములు

తటాకములలో సరస్సులలో విషముకలిపిన జలమెట్లుండును?

విషముకలిపిన నీరు జిగటలుసాగును. ఘాటైనవాసన గలిగియుండును. నురుగుచారలు గలిగియుండును. ఈలక్షణము లుండుటవలన జలచరములు చనిపోవును. పక్షులు మదమును బొందినవై నీటియొడ్డున సంచరించుచుండును. ఈ నీటియందు స్నానముచేసిన మనుష్యులు పశువులు మందమతి జ్వరము, శరీరతాపము, వాపులు మొదలగులక్షణము లుండును.

స్థలములందు విషములు ప్రయోగించిన నెట్లుండును.

భూమిగాని, కూర్చుండుటకు తగురాతి కట్టడముగాని, నీటి రేవుగాని, విషముచే దూషింపబడినపుడు వానిని ముట్టు



కొనిన ఆవులు, గుఱ్ఱములు, ఎద్దులు, ఏనుగులు, లొట్టిపిట్టలు గాడిదలు, మనుజులు గూడా చాల బాధనొందుదురు. వీరి శరీరమం దేభాగములందు విషయుతపదార్థములు తగులునో యాభాగముల వాపు జనించును. మంటగానుండును. అచ్చటగల వెండ్రుకలు ఊడిపోవును.

## ఆహారపదార్థములు

గడ్డీ ఆహారపదార్థములూ విషముచే చెరుపబడినచో దానిని సేవించు జంతువులకు అంగశైథిల్యము, మూర్ఛ, వాంతులు గలుగును. మలము పలుచగ నగును. చనిపోవును.

## పొగ, గాలి

పొగ, గాలి విషయుతములైనచో పక్షులు శ్రమనొందినవై భూమియందుపడును. దగ్గు, పీనస, శిరోబాధకలుగును. భయంకరమైన నేత్రవ్యాధులు కలుగును.

## ఆహారములలో విషముకలుపుట

ఆహారమునందు విషమున్న దానిని భక్షించిన ఈగలు, కాకులు మున్నగునవి వెంటనే మడియును. దానిని అగ్నియందువైచిన చిటచిటయను ధ్వనులెగయును. నెమలికంఠము నందలి రంగువంటి రంగుగల పొగ లెగయును. ఈపొగను భరించుట చాలకష్టము. మంటలు కలిసియుండక విడివిడిగ నుండును. ఈయగ్నినుండి వెలువడుగంధముపొగ చాలసేపటి వరకుండును.

విషముగలిగిన ఆహారమునుండి వెడలు ఆవిరితగులుటచే హృదయమునందు బాధకలుగును. కన్నులుతిరుగును. కాళ్ళకు అంటిన మంటలుపుట్టును.

ప్రమాదముచేగాని, యజ్ఞానముచేగాని విషాహారమును సేవించిన నాలుక బండబారును. రుచిని గ్రహించుశక్తి నశించును. మండుచున్నట్లుగ నుండును. నోటినుండి చొంగ పడును.

విషముజీర్ణమైనపుడును అతిసారము, మంటలు, కడుపులో గడబిడ, శరీరకాంతితగ్గుట గలుగును. సారాయి, కల్లు మున్నగు ద్రవపదార్థములయందు విషమును కలిపినయెడల గీతలు నురుగులు బుడగలు గలుగుచుండును.

దాణాదినుసులు, పచ్చిగడ్డిజాతులలో విషమును గలిపిన చిటచిటలాడుచు రుచి నశించును. దుర్గంధము కలిగియుండును. పచ్చికాయలకు విషముతగిలిన వెంటనే పండును. పండిన వానికి తగిలిన వెంటనే కుళ్లిపోవును.

దంతములయందు విషమున్నయెడల మొనలు విరిగిపోవును. నాలుక పండ్లు చిగుళ్లు వాచును. పువ్వులకు విషము తగిలిన వానిసువాసన తగ్గును. రంగుమారును. వాడిపోవును. వానిని వాసనజూచిన శిరోబాధ గలిగి నేత్రములందు నీరు జేరును.

అంజనమునందు విషమున్నచో కన్నీటియందు జిగురు గలుగును. అంధత్వముగలుగును.

పట్టెళ్ళయందు, గంటలయందు, గొలుసులయందు విషముకలిపిన నవి మామూలుగ ప్రకాశింపవు. ధరించిన నాయా శరీరభాగముల హింసించును. ఒడలుమండును. పుండగును.



### విషవంతములగు ఆకులు తినునపుడు కలుగు ప్రమాదములు

మేతదొరకని కాలములందు పశువులు పొదల మీద నుండు విషవంతములగు ఆకులు తినుటవలనను, విషపుపుట్టలు పట్టియుండెడు చొప్ప రెల్లు మొదలగు గడ్డిదినుసులు తినుటవలనను ఆకస్మికముగా మేతతో ఉమ్మెత్తాకులు జిల్లేడాకులు పొగాకు లేతజొన్న మొదలగు విషవస్తువులు తినుటవలనను పశువుల కపాయములు తటస్థించుచున్నవి.

### విషవస్తువులు ఆకులలోను తవుడులోను కలిపి పెట్టుట

ఇంకను పశువులకు మాలమాదిగెలు దుర్బుద్ధిచేతనో, తోళ్లకొరకో విషముపెట్టి చంపుదురు. చచ్చిన పశువులను గ్రామమాదిగలకిచ్చు నాచారమునుబట్టి తోళ్లు గిరాకిగా నుండు కాలములందు గ్రామమాదిగెలు పశువులకు విషములు పెట్టి చంపుదురు.

విషవస్తువులు తెచ్చి పిండితోగాని తవుడుతోగాని పిసికి ముద్ద చేసి అరటియాకులలోగాని యితర ఆకులలోగాని మడచి పెట్టుదురు. లేదా పశువులముందర పడవైతురు. అంతట పశువుతినును.

### గడ్డిజాతులలో కలిపి పెట్టుట

కొన్నిసమయములందు పశువులుతినుగడ్డిలో కలుపుదురు. కొందరు పశువులుమేయుబీడుభూములలో పాషాణపొడి జల్లుదురు.

### గాయములు, ఆసనములలో పెట్టుట

మరికొందరు చర్మమును చీల్చి ఆగాయమునందు విషమును పూయుదురు. లేదా ఆసనమునందుగాని, యోనియందుగాని విషపదార్థ మెక్కింతురు.

### మశూచి పడిన తలను కుళ్లించుట

మశూచిపడి చనిపోయిన పశువుయొక్క తలను భూమిలో పాతిపెట్టి అదికుళ్లిన తరువాత దానిలో ఒక యింజెక్షన్ సూదినిదించి కుళ్లునీరు సూదికిపట్టించిన తరువాత ఆసూదితో ఇతరజంతువులను కొంచెము రక్తము కారునట్లు చేయుదురు. వెంటనే ఆవిష మెక్కి పశువు చనిపోవును.

### జిల్లేడుపాలను పేగులలోనికి ఎక్కించుట

జిల్లేడుపాలను ఒక చిప్పలోనికి నొడిచి మూరెడు పొడుగును ఒక అంగుళము వెడల్పును గల కఱ్ఱపుల్లకొనకు, ఆగుడ్డనుచుట్టి మూత్రము విడుచు పేగులలోనికి గుచ్చిలోపల ఆగుడ్డనుంచి పుల్లను నెమ్మదిగాబయటకు లాగుదురు. ఈమందు బహువేడియగు వస్తువగుటవలన వెంటనే పేగులు వాచి బాధపడి చచ్చిపోవును.

### అంటువ్యాధుల మలము లుపయోగించుట

పెద్దరోగము దొమ్మమొదలగు వ్యాధులు సంభవించిన పశువులపేడను తీసి దాచియుంచెదరు. తోళ్లు గిరాకిగా నుండునపుడు మాత్రము ఆపేడ పచ్చికమీద జల్లుదురు. ఆపచ్చిక పశువులు తిని పలువిధసంకటముల పాలగుచున్నవి.



### గన్నేరుగింజల, చెక్కల నుపయోగించుట

కొందరు మాదిగవాండ్రు పచ్చగన్నేరుగింజలనుదారమునకు దండవలె గుచ్చి పశువులముందర విసరుదురు. లేదా ఎండుగడ్డితో గన్నేరు చెక్కకలిపి పెట్టెదరు.

### గురుగింజలను పెట్టుట

మరికొందరు గురిగింజలను పొడిజేసి నీటిలోకలిపి ముద్దజేసి ఒక అంగుళము పొడవుగల కఱ్ఱచివర వాడిగా చెక్కి ఆముద్దను కఱ్ఱకు అంటించి జంతువు శరీరములోనికి జొనుపుదురు. పొడి ఎచ్చట ప్రవేశించునో ఆభాగను విశేషముగా వాచి రెండు మూడుదినములలో పశువులు చనిపోవును.

### విషము నోటిగుండ పెట్టినతరువాత కనబడు లక్షణములు

పశువునోటినుండి విషము లోనికిచ్చిన యెడల దంతములు, చిగుళ్లు, నోరు, నాలుక పూచి బాధగలుగును. చొంగ యధికముగా కార్చును. వాంతిచేయుటకు ప్రయత్నించును. కడుపునొప్పి కలుగును. తరచుగాలేచుచు పండుకొనుచుండును. కడుపుబ్బును. పిమ్మట దుర్గంధములతో గూడ విరేచనములగుచుండును. ఆవిరేచనములలో రక్తజీరకూడ నుండవచ్చును.

### ఆసనములో పెట్టినతరువాత కనబడు లక్షణములు

ఆసనములో పెట్టినయెడల ఆసనము ఎఱ్ఱబడి చాల బాధపడును. కడపటియవస్థలో దైన్యముతో చూచుచు కంటిపాపలు పెద్దవై చాల ఆయాసముకలిగి పక్షవాతముచే నిలువక క్రిందబడి చనిపోవును.

## చికిత్స

10, 20 కోడిగుడ్లను ఒక సేరున్నర చిక్కనిజావలోగాని, పాలలోగాని కలిపి 3, 4 గంటల కొకసారి త్రాగించవలెను. లేక వెలగబంకనీరుగాని, అన్నభేదినీరుగాని త్రాగించవలెను. లేక పచ్చి అవిసెనూనె గాని, సున్నపునీరుగాని, ఘాటుసారాయి గాని త్రాగించవలెను. లేక సారాయి 10 తు॥ సొంటి 2 తు॥ నల్లమిరియాలపొడి 1 తు॥ జావ అర్ధసేరు కలిపి త్రాగించవలెను.

## పథ్యము

నీటిని యేమాత్రము త్రాగనీయరాదు. సీమఅవిసెగింజల జావగాని, బియ్యపుజావగాని, ఎక్కువగా త్రాగించవలెను. ఉడకబెట్టిన తపుడు, చిట్టు పథ్యముగా పెట్టవలెను.

## ఉంగిడి

లేతజొన్న, లేత ఆముదపు ఆకులు తిను పశువులు సాధారణముగా విషమెక్కి చచ్చుట మనకందరకు తెలియును. ఒక పొలములోని లేతజొన్నను మేసిన పశువులు విషమెక్కి చావగా మరియొక పొలములో నట్టిరీతి లేతజొన్ననే మేసిన పశువులారోగ్యవంతములై యుండుటనుగూడ మన మెరుగుదుము. 1903 వ సంవత్సరములో క్వీన్స్‌లాండు దేశమునందు లేతజొన్నను మేయుటవలన అనేక పశువులు మరణించెను. అందువలన ఆద్వీపవాసులు శోధనలను బెక్కింటిని జేసి వాని పర్యవసానములను తెలియపరచిరి. సారవంతములైన భూములలో పెరిగిన జొన్నలయందు ఘోరవిషములైన ప్రిస్సిక్ ఆసిడ్



(Prussic Acid) మున్నగు పదార్థములుండును. భూమియందలి సారము తగ్గినకొలది నందుండు జొన్నలో విషము లంతగా నుండవు. కాబట్టి నిస్సారములగు పొలములందలి లేతజొన్నను పశువులకు మేపినప్పుడు నష్టము కలుగకున్నను భూమిలోని సారము హెచ్చినకొలది అందలి లేతజొన్నను మేసిన పశువులకు విషచిహ్నము లెక్కువగా కానవచ్చుట యీ దేశమువారి శోధనలవలన గానవచ్చినది. నైట్రొజను విస్తారముగాగల భూములలో మాత్రమే యిట్టివిషము లేతజొన్న యందు కానబడును. ఇందుకొరకై బ్రిన్నిక్ (Brennic) అనుదొర ఒక పొలములోని కొంతభాగములో ఎరువునుదేనిని వేయకుండగనే జొన్నలను జల్లి మరికొంత భాగమునకు నైట్రొజను ఎరువు విస్తారముగావేసి జొన్నలను విత్తెను. నైట్రొజను వేయబడిన భాగమందలి లేతజొన్నలో విషములు విస్తారముగా గానవచ్చెను. నైట్రొజను ఎంతఎక్కువగా వేయబడినదో అంతవరకే సరిగా నందలి లేతజొన్నలో యీవిషములు హెచ్చెను. ఎన్ని పర్యాయములు యిట్లు శోధించిచూచినను ఈరీతిగనే ఫలితము తేలెను. కాబట్టి భూమిలోని నైట్రొజను ననుసరించి లేతజొన్నయందు విషముండునని నిర్ధారణ యగుచున్నది.

ఏపుగా నెదుగు మొక్కలలో నీవిషము తక్కువగా నుండును. ఎండాకాలపు మొక్కలలోను, పీలగా నెదుగు మొక్కలలోను ఈ విషము విస్తారముగా నుండును. విస్తారము నైట్రొజనుగల భూములలో బెరుగు మొక్కలు ఒకవీసెడెత్తు బెరిగనేని ఎట్టి పసరమైనను చనిపోవును. కాబట్టి లేత మొక్క-

లును, పీలమొక్కలును అంతగా నారోగ్యకరములైనవికావు. లేతగా కోసినను ఎండుచొప్పయగునేని దీనియందీ విషముండదు. నైట్రోజెను విస్తారముగాగల భూములలోని జొన్నను కంకివేయువరకు పశువులకు మేపరాదు, మొక్క మొలచిన మూడువారములు మొదలుకొని ఏడువారములవరకు నందు విశేషముగా విషముండును. అటుతరువాత నీ విషమందలి నైట్రోజెను విరిగిపోయిహానిజేయని యితరపదార్థముల క్రిందకు మారిపోవును. మొక్క పూతబట్టిన తరువాత నందలి విషము నామమాత్రావశిష్టమై యుండును. కాని కొన్నిచోట్ల కొద్దికాలమునకు పూతకువచ్చు మొక్క మరికొన్నిచోట్ల నేపుగా పెరిగి చాలకాలమునకుగాని పూతకురాకుండుటచే పైన చెప్పిన మూడు, ఏడువారములు నను గడువు సర్వత్రసమముగా వర్తించదు. కాబట్టి యేది ఎట్లున్నను పూతపూయక ముందు పచ్చిజొన్నను పశువులకు మేతగా పెట్టరాదు. మాక్సవెల్ (Maksevel) అను ఒక దొరగారు లేతజొన్నను ఎండుగడ్డిని కలిపి పశువులకు మేతగా వేయవచ్చుననియు, అందు ఎండుగడ్డి పాలుహెచ్చుగా నున్నయెడల లోపలికిపోవు లేతజొన్నయందలి విషము చాలతక్కువగుటచేత అంతగా హాని కలిగించదనియు తెలియజేసెను. ఏది యెట్లున్నను పూతపూయని పచ్చిజొన్నను పశువులకు వేయకుండుటయే మంచిది. పెరుగుచున్న జొన్న మొదలగు పైరులను పశువులు చొరబడి మేయకుండ కాపుదలచేసికొనవలెను. కోసినవెంటనే పచ్చిజొన్న మొక్కజొన్న వీనిని పశువులకు వేయరాదు. రెండు



మూడుదినములు వీనిని ఎండబెట్టి తరువాతనే పశువులకు వేయవలెను. పూతపూయకమునుపు పచ్చిచొప్పను పశువులకు వేయుటయే తప్పు. తేమనేలను ఏపుగా నెదిగిన దానిని వేయవచ్చును. విశేషముగా ఈ మేతను ఇతర ఆహారములతో యిచ్చుట మంచిది.

## లేతజొన్న తిన్న పశువులక్షణములు

పశువు అడుగువేయలేదు. తడబడుచుండును. స్పృహ తప్పును. నాలుక జారవిడుచును. నోటివెంట చొంగపడుచుండును. నాలుక బిరగలాగుచుండును. వ్యాధిముదిరిన కొలది పొట్ట భేరీవలె పొంగును. గురకపుట్టును. దవుడలు బిగిసికొనిపోవును. ఊపిరియాడక వెంటనేమృతినొందును.

## చికిత్స

ఆరంభములోనే చికిత్స చేయవలయునుగాని తరువాత నేమియు లాభములేదు.

1 పులుకలిలో ఉప్పు చేరెడు, నల్లేరుముద్ద చిన్ననారింజ కాయంత కలిపి పెట్టవలెను.

2 కొమ్ములకు నూనెవత్తులుచుట్టి కాల్చి జామువరకు యుంచిన తగ్గును.

3 కుంకుడుకాయలగంధము కంటిలో కలికము వేయుము.

4 నిమ్మపండ్లరసము, నల్లేరురసముకలిపి మూడు గొట్టములు పెట్టిన తగ్గును.

5 చిర్రిచెట్టుదంచి రసముతీసి పులికలితో మూడుగొట్టములు పెట్టవలెను.

6 దోసకాయలు పదిపెట్టుము.

7 దీపపుకొడిచే జిల్లేడుఆకులు పొట్లములుగాకట్టి చమురును కాచి మాడున పెట్టవలెను.

8 పులికలిలో దుష్టుపువెల్లునూరి సారముతీసి ముక్కురంధ్రములలో పోసి కన్నులకు ఇంగువ కలికెము వేయవలెను.

9 చింతపండుపులుసు మూడు గొట్టములు పెట్టవలెను.

10 నల్లేరుకొనలు దవుడలకు పెట్టి కొరికించిన తిక్కపోవును.

11 అమ్మోనియంక్లోరీడ్ అను మందు 2½ తులములు తీసికొని చన్నీటిలో కలిపి త్రాగించవలెను.

12 గోగువరుగు పెట్టుము. అప్పుడప్పుడు స్మెల్లింగుసాల్టు ముక్కులకు చూపించుము.

### పశువుల కుపయోగించు పనిముట్లు

పలుపులు, నీరుపెట్టుతొట్టెలు, మందులనిచ్చు గొట్టములు, పాత్రలు ఎప్పటికప్పుడే పరిశుభ్రము చేయవలెను. శత్రువులెవరైన యున్నపుడు విషమందులు కలుపుదురేమో తనిఖీ చేయుచుండవలెను.

పశువులశాలలు, పాకలుగూడ పరిశుభ్రముగానుండవలెను. చెత్త వగైరాలున్నచో విషపురుగులు చేరును. క్రిమికీటాదులు జనించిపలువిధరోగములు కలిగించును. గడ్డివాములు



పుట్టలు, విషముగలతీగెలు, లేక జొన్నవగైరా లుండుచోట్ల పశువులను కట్టరాదు.

మంచిపశువులకు ఓర్పులేనివారు నోటిలోదబ్బనము, ఇనుపసూదులు మున్నగునవి వేయుదురు. ఇట్లు వేయుటవలన పశువు ప్రేగులలోగాని, తదితర అవయవములలోగాని నిలువయుండి పశువును బాధించుచు కొన్నాళ్లకు ఆవస్తువుత్రిప్పపట్టి శరీరభాగములను చెరచును. ఆకలితగ్గును. మందముతో నుండును. ప్రేగులలో చిక్కుకొనియున్నయెడల తూట్లుపడును. కడుపునొప్పి, నోటివెంటచొంగ, ముక్కులనెంట చీమిడి మున్నగునవి పడుచు క్రమేపి పశువుమరణించును. కండరములలో చిక్కుకొనియున్నయెడల ఆభాగమంతయు చెడి కణుతులులేచును. ఆకంతులు పక్వమునకురాక శరీరమంతయు పుట్టి కొన్నాళ్లకు ఆ విషమంతయు జీర్ణమై చనిపోవును.

### చికిత్స

ఇటువంటి వస్తువులు మ్రింగిన పశువులచరిత్ర తెలిసికొనుట చాలకష్టము. అనేకమంది పశువైద్యులను తీసికొని వచ్చి చూపించుదురు. అందఱిలో కొందరు పేగులలో చిక్కుకొనినప్పుడు కడుపునొప్పి యందురు. ఇంక అనేకవిధములుగా రోగనిర్ణయములు చేయుదురుగాని అసలు వ్యాధికనుగొనరు. పశువు మరణించినతరువాత మాదిగవాండ్రు కోయునప్పుడు ఆవస్తువులు బయటపడును. ఈరీతిగా అనుభవముమీద కొన్ని కేసులు ప్రత్యక్షముగా చూచితిమి.

ఇటువంటి ప్రమాదములు జరిగినపుడు వెంటనేమూడు

నాలుగుసార్లు సబ్బునీటితో ఎనిమా చేయవలెను. తరువాత వెన్నను తినిపించవలెను. కంతులుపుట్టినయెడల శస్త్రవైద్యములోనున్న ప్రతికారము శస్త్రచికిత్సలు చేయవలెను.

జంగమ విషములు

పిచ్చికుక్కలు మొదలగునవి చతుష్పాదజంతువులు, సర్పములు, వృశ్చికములు, శతపదాములు, లూతలు, మూషికములు, మండూకములు అనునవి.

విషమాశ్రయించి యుండుస్థానములు

దృష్టి, నిట్టూర్పు, కోరలు, గోళ్లు, మలము, మూత్రము, శుక్రధాతువు, చొంగ, తోక, ఆర్తవరక్తము, ముఖముతో కరచుట, అపానవాతము, గుదమునందలి యెముక, చేదు, తోకయందలి ముల్లు మృతకళేబరము అనువాని యందు విషముండును.

దేవతా సర్పములకు దృష్టియందును, నిట్టూర్పునందును విషముండును. నేలమీదనుండుసర్పములకు కోరలయందువిషముండును.

పిల్లి, కుక్క, కోతి, మొసలి, కప్ప, మత్స్యము, ఉడుము, నత్తపురుగులు, కీచురాయి, బల్లిమొదలగు చతుష్పాద జంతువులకు పురుగులకు కోరలయందును, గోళ్లయందును విషముండును.

చిపిటము, పిచ్చిటము, కషాయవాసికము, సర్షపవాసికము, తోటకము, వర్చఃకీటము, కౌండిల్యకమను పురుగులకు మలమూత్రములందు విషముండును. ఎలుకలకు శుక్రమునందు విషముండును.

సాలెపురుగులకు, చొంగ, మూత్రము, రెట్ట, కాటు, గోళ్లు, శుక్రము, ఆర్తవము - వీనియందు విషముండును.

తేలు, విశ్వంభరము, రాజీవమను చేప, ఉచ్చిటింగము, సముద్రపు వృశ్చికము అనువానికి తోకయందుండును.

చిత్రశిరము, శరావకుర్దితము, శతదారుకము, అరిమేదకము, శారికాముఖమను కీటములకు కాటు అపానవాతము, మూత్రము, రెట్ట యనువానియందు విషముండును.

ఈగలు కందిరీగలు జలగలు కాటునందు విషముగలిగియుండును.

విషముచే చచ్చినజంతువులయొక్క ఎముకలు, పాము శరీరమునందలి శల్యములు, వరటి యనుచేపఎముక యనునవి అస్థివిషములు.

శకుని, ఎర్రచారలుగల చేప (రక్తరాజీవము), వరకి యను చేపలకు చేదుకట్లయందు విషముండును. సూక్ష్మతుండము, ఉచ్చిటింగము, వరటి, కాళ్లజెర్రి (శతపది), శూకవలభిక, శృంగి, భ్రమరము (తుమ్మెద)లకును తోకయందు, ముల్లునందు విషముండును.

చచ్చినపురుగులు, పాములు శవవిషములని గ్రహించవలెను.

## కీటకములు

పాములయొక్క శుక్రము మలము మూత్రము శవము కుళ్ళిపోయిన గుడ్లు మొదలగువానినుండి వాత పిత్తశ్లేష్మ ప్రకృతులుగల వివిధములగు కీటకములు జనించును.

## కందిరీగలు

నాలుగుజాతులు గలవు. ఇవన్నియు తీవ్రముగా బాధను గలిగించును. ఇవి కరచినచో వాపులు పుట్టును. కాటు నల్లబడును. నొప్పులు మంటలు కలుగును.

## ఉడుములు

ఇవి అయిదురకములు. ఇవి కరచినపుడు భయంకరమైన కంతులు పుట్టును. ఉడుమునందు కృష్ణసర్పమువలన కలిగినట్టి నాలుగు కాళ్లు గలిగినట్టి జంతువునకు గౌధేరకమని పేరు. ఈజాతిఉడుము కరచిన పశువు బ్రతుకదు.

## కాళ్లజెర్రులు

ఎనిమిదిజాతులు గలవు. ఇవి కరచిన వాపు మంటలు కలుగును. కొన్ని కరచిన గడ్డలు లేచును.

## కప్పలు

ఎనిమిదిజాతులు గలవు వీటిలో కొన్ని కరచినచోట దురద కలుగును. నోటివెంట నురుగువచ్చును. ఇంక కొన్ని రకములు కరచిన మంటలు గలుగును. మూర్ఛవచ్చును.



## శూకవృంతాదులు

కరచిన దురద, దద్దురులు పుట్టును. కాటునందు తోకముల్లు కనబడును.

## కండూమకములు

కరచిన శరీరరంగు మారును. జ్వరము పారుడు కలుగును.

## చీమలు

ఆరుజాతులు, చలిచీమలు కరచిన కాటునందు తీపి, అగ్ని తగిలినట్లు మంట, వాపు కలుగును.

## తేనెటీగలు

ఆరుజాతులు, ఇవి కరచిన మంటలు వాపులు గలుగును.

## దోమలు

అయిదువిధములు:—ఇవి కరచిన ఎక్కువ దురద కలుగును. కొన్ని కరచిన ఆస్థలమందు గోకినయెడల పుండ్లు పడును. మంటగా నుండును.

## వృశ్చికములు

మూడువిధములు: ఆవుపేడ కుళ్ళుటవలన బుట్టినవి మందవిషములు; కర్రలు ఇటుకలు మున్నగువాని యందుండునవి మధ్యమవిషములు. కుళ్లిపోయినపాములనుండి పుట్టినవి, ఇంక ఇతర విషములనుండి పుట్టినవి తీక్ష్ణవిషములు.

మందముగల వృశ్చికములు 12, మధ్యమవిషముగలవి 3. ఉత్తమవిషముగలవి 15. మొత్తము 30 జాతులు.

## అల్పవిషములు గలవి

నలుపుగను, ఎరుపుగను చిత్రవర్ణముగను, పచ్చగను, ఆవుపంచితమురంగుగను, పరుషముగను, నెమిలిపురిరంగుగను, తెలుపుగను, ఎఱుపుగను, రోమములు గలిగియు గరిక రంగుగను, కొంచెము ఎరుపుగ నుండునవి అల్పవిషములుగలిగి యుండును.

ఇవి కరచినచో మంటలు చెమటలు కలుగును.

## మధ్యవీర్యముగల వృశ్చికములు

ఎరుపుగను, పచ్చగను, శరీరరంగుగలిగి యుదరమునందు కపిలరంగుగలిగినట్టియు, అంతట పొగచూరురంగు కలిగినట్టియు, మూడుకణుపులు కలిగినట్టియు వృశ్చికములు మధ్యవీర్యముగలవి. ఇవి వాతపిత్తశ్లేష్మ ప్రకృతులుగల పాముల యొక్క మలమూత్రముల వల్లను కుళ్ళిపోయిన గుడ్ల నుండియు పుట్టును. ఇవి యేజాతిపామునకు సంబంధించిపుట్టునో యాప్రకృతికిచేరి యాదోషము నేప్రకోపింపజేయును. నాలుక వాచుట మ్రింగుడుబడకపోవుట భయంకరమగు మూర్ఛ కలుగును.

## ప్రాణములను హరించునవి

తెలుపుగను చిత్రవర్ణముగను శ్యామలముగను ఎరుపుగను తెలుపు ఎరుపురంగుగను ఉదరమునందు ఎరుపు నీలము



రంగులుగను నీలము తెలుపుగలసిన రంగుగను ఎరుపు చిత్రవర్ణములు గలిసిన రంగుగను నుండెడి వృశ్చికములును ఒంటి కణుపుగలిగినట్టి వృశ్చికములును కణుపులే లేనట్టివినగు వృశ్చికములు ప్రాణములను దీయును.

ఇవి తీక్ష్ణమైన విషము గలిగియుండును. ఇవి కుళ్లిన సర్పములనుండి పుట్టును. విషముచే మరణించినవానిశరీరము నుండియు పుట్టును. ఇవి కరచిన పామువలన గలిగెడివిషవేగములుగలుగును. పొక్కులుబుట్టును. శరీరము త్రిప్పును. దేహమునందు మంటలు జ్వరము స్రోతస్సులనుండి నల్లనిరక్తము కారును. కనుక నివి కరచినచో మనుజుడు చనిపోవును.

## వృశ్చికముల చరిత్ర

ఇవి యుష్ణ ప్రదేశములలో మాత్రము గానవగును. తేళ్లు, సాలెపురుగులు, తవిటిపురుగులు నొకేజాతిలోనివి. వానియన్నిటిలో తల మెదురొమ్ము భాగములు కలసియుండును. తవిటిపురుగులలో యీకడుపుభాగముకూడ కనపడదు. ఇవి యండాకృతిగానో గుండ్రముగానో యుండును. ఈజాతులలో స్పర్శవలన తెలిసికొనగలిగిన పురుగులకు మీసములుండవు. వీనికి రెండుజంటలదవుడలుండును. ఒకజత పటకారుమాదిరి స్పర్శ డెక్కలుండును. వానినన్నిటిలో 8 కాళ్లుండు . ఇవి కప్పలవలె రూపపరిణామమును బొందవు. అయిన పెద్దవియగులోపల పలుమారు పైతోలుకప్పును విడచును. వీనికి సూక్ష్మమైన నేత్రములు పెక్కులుండును.

కాని పురుగులలో మాదిరిగా పెక్కు కన్నులు కలసిన కన్నులుండవు.

వివిధ దేశములలో నీ తేళ్లు అనేకరకములున్నవి. వీనియన్నిటిలో శిరస్సు, హృదయభాగము, గర్భభాగముకన్న చిన్నది. గర్భభాగము రెండుగా విభజింపబడి యుండును. ముందరిభాగము వెడల్పుగను ఏడుఖండములుగాను యుండును. దీనివెనుక తోకవలెనుండు భాగము సన్నగను బాగుగకదలగలిగిన అయిదు పూసలుగ నుండును. దీనిచివర వంకరగాను వాడిగాను నుండు కొండెపూస యుండును.

మూడు మొదలు ఆరుజంటల కాళ్లు, తల ఎదురొమ్ము భాగములమీద నుండును. తేళ్లు నలుపుగానైనను, ఒకమాదిరి పసుపు మెరుపు మిశ్రితరంగుగానైనను నుండును. ఆఫ్రికా హిందూదేశములలో నున్న పెద్దజాతి నల్లతేళ్ళు తొమ్మిది అంగుళములవరకు యుండును. వానినే మండ్రగబ్బలందురు. ఇవన్నియు నిశాచారులే. పగలు రాళ్ళక్రిందను, నేలలోని రంధ్రములలోను, గోడలోని పగుళ్ళలోను దాగుకొనును. ఇవి తినుపురుగులను కొండెతో కుట్టి చంపితినును. ఇవి పురుగులను మ్రింగవు. వానిదవుడలతో పురుగులలోని సారమును మాత్రము పీల్చును. ఉష్ణప్రదేశములలోనున్న జెర్రిలకాటులు యీ పెద్ద నల్లతేళ్ల కాటులు పాముకాటులంత యుపద్రవ కరము లైనవి.

## నివసించు ప్రదేశములు

కొండప్రదేశములలో నివసించు తేళ్లు యేదో చిన్న



రాయిక్రింద, గుండ్రనిలోతైన రంధ్రమును నేర్పరచుకొని యందు నివసించును. వేడిగానున్న రాయికి నంటుకొనియే పరుండును. చలిగానున్న రంధ్రమునడుగునకు పోయి యందుండును. వాని డెక్కలు రక్షణార్థమును నోటికి ఆహారము నందిచ్చుటకు యేర్పడి యున్నవి. వీనికి స్పర్శజ్ఞాన మెక్కువ. ఈ జంతువులు నడచునపుడు యీ డెక్కలను బాగుగాముందునకును, కొంచెము విడిగాను పెట్టుకొని ముందునకు వెనుకకు నాడించుకొనుచు నడచుచుండును. వీనికి చాల కన్నులున్నను యివన్నియు ప్రక్కచూపునకే యుపయోగము గాన దీనికి ముందేమున్నదియు గానరాదు. కాన దానిడెక్కల స్పర్శజ్ఞానమే దానికి నడచునపుడు నాధారము. దానితోకను ముందుకు బాగుగావంచి కుట్టుటకు తయారుగా నేర్పరచుకొని యుండును. ఇవి విశ్రమించునపుడీ తోక యొక్కప్రక్కకు వంగియుండును.

## కీటకములను పట్టుకొనుట

ఆహారకీటకములను పట్టుకొనబోవునపుడది బహునెమ్మదిగా దగ్గరకువచ్చి తటాలున డెక్కలతో పట్టుకొనును. ఆ పురుగు కదలకుండా యుండిన దానిని నోటివద్దకు తెచ్చుకొని నెమ్మదిగా దానిరసమును పీల్చుకొనును. అట్లుగాక యా పురుగు పెనగులాడ మొదలిడిన తోకను ముందునకు వంచి గురిజూచి కొట్టుచున్నదా యనునటుల నాపురుగును నొకటి రెండు మారులు కుట్టును. ఈ కుట్టుయొక్క ఫలము పురుగులనుబట్టి మారును. సాలెపురుగులైన తక్షణమే మరణించును. ఇతరపురుగులు కొలదికాలములో మరణించును. జెర్రిని కుట్టిన

నది కొన్ని దినములవరకు బ్రతుకును. చిమ్మటలు, పేడపురుగులు తక్షణమే చనిపోవునుగాని వాటిపిల్లలు మాత్రము ఏహానియు పొందవు. కొంతమంది మనుష్యులుకూడ యీ తేళ్ళ కాటులవలన చనిపోవుచున్నారు. ఆ వ్యక్తిలోని నెత్తురు చాలజబ్బుస్థితిలో నున్నపుడె యిటుల తటస్థించును.

## తేళ్ల ప్రేమవ్యవహారములు

వేసవిదినములలో మొగతేలు సాయంకాలపుషికారునకు బయలుదేరును. ఎక్కడనో దానికన్న పెద్దదిగానుండు స్త్రీతేలునుకలిసికొనును. ఈరెండు నెదురుగా కాళ్లను పొడవు జేసికొని నిలుచుండును. దేహముయొక్క ముందరిభాగమును నేలమీద నానుకొని వెనుకభాగమును పైకెత్తును. అప్పుడవి తలలమీద నిలుచున్నట్లుండును. వానితోకలు కలియును. ప్రేమచిహ్నముగ నాతోకలను రాచుకొని రెంటిచివరలను పెనవేసికొనును. ఈచేష్టలు తేళ్లసమాజములో కుశలప్రశ్న చేయుటనే. యౌవనులలో వివాహప్రయత్నమున్న యీమన్నన యింకను లాలనగానుండును. స్త్రీతేలుయనుకూలముగా నున్న మొగది దానిరెండుడెక్కలతో పట్టుకొనును. తరువాత వెనుకకు అడుగులిడుచు దాని తనవెంట లాగుకొనిపోవును. ఈవిధముగా కొన్నిగంటలవరకు షికారు జేయవచ్చును. ఏరాయికిందనో తగిన సందు దొరికిన దాని కాళ్లతో గీకి పెద్దదిగా చేయును. ఈగీకినమన్నును తోకతో పైకి త్రోసివేయును. ఇటుల చేయుచున్నను స్త్రీని పట్టు మాత్రము వదలదు. తరువాత నాసందులోనికి స్త్రీని గూడ



వెంటలాగికొని ప్రవేశించును. స్త్రీకి ననుకూలముగా నున్న సరియే, లేకున్న యవిరెండు బయటికివచ్చి యింకొకనివేశమును వెదకికొనును. ఒకప్పుడిటుల సంచరించు నపుడు మరియొక పెద్ద మొగతేలు వెంటబడవచ్చును. ఇటుల జరిగిన నీరెండు మొగవియు పోట్లాడక చెరియొకవైపు కాలును బట్టుకొని లాగుకొనును. ఇటుల గావించుటలో నోడిన మొగతేలు ఆడదానిని వదలి మరియొకదానిని వెదకికొనుటకై వెడలిపోవును. ఇటుల నింకొకటి రంగములోనికి ప్రవేశించక సజావుగా జరిగిన నెక్కడనో చాల రాత్రియైన తరువాత నివాసమును గుదుర్చుకొనును.

మరుసటి ప్రాతఃకాలమున పైరాయిని తొలగించి జూచిన స్త్రీతేలుమాత్రమే గాననగును. మొగదానియొక్క శరీరభాగములు గూడ గాననగును. రాతికింద రాత్రికాలమున నేమి జరిగినదో తెలియదుగాని బహుశా యంతవరకు నిదానముగ నున్న స్త్రీతేలు స్వరాజ్యమవలంబించి మొగదానిని ఫలహారము గావించును. రెండు డెక్క కాళ్లవలన బంధింపబడిన స్త్రీతేలెటుల మొగదానిని వధింపగలదో తెలియరాదు గాని యెప్పుడు నిటుల జరుగుట కష్టము. భార్యస్థానే శత్రువువలె పరిణమించినప్పటికి తల్లిరూపమున మాత్రము మార్గదర్శియనవచ్చును.

## గుడ్లుపెట్టు విధానము

ఈవిషాదవివాహమైనతరువాత సుమారు పదునాలుగు నెలలకాఆడుతేలు గుడ్లుపెట్టును. ఇవి తయారైన పిల్లలను

కనుననునదియు గర్భచ్ఛేదమువలన పిల్లలు బయటకు వచ్చు నను ప్రతీతులు యబద్ధములు. ఈగుడ్లు సన్నని పొరలవలె లోనిజీవులను కప్పును. గుడ్లనన్నిటిని పెట్టినతరువాత ప్రతి గుడ్డుపైనున్న పొరను తన పటకారులవంటి డెక్కలతో తీయ మొదలిడును. అన్నిటిని తీసిన తరువాత నాపొరలనన్నిటిని మ్రింగివేయును. ఈస్థితిలో పిల్లలు సుమారు 1/3 అంగుళము పొడవుండును. తెలుపుగానుండును. తమంతట తాము నడువ లేవు. ఎటులనో చాలకష్టముమీద తల్లివీపుమీఁదికి ప్రాకి యాహారమేమియు లేకుండ నొకవారమురోజు లటులనేయుం డును. వారమగునప్పటికీపిల్లలు తమపై పొర వదలును. ఇప్పుడు పిల్లలు 2/3 అంగుళము పొడవుండును. చురుకుగానుండును. తల్లిని వదలి పరుగిడగలవు. అటులచేసిన తల్లి వానినిపట్టుకొని తనపై నెక్కించుకొనును. ఇంకొకవారములో నవి తమ ఆహార మును తాము సంపాదించుకొనగలవు. ఇప్పుడు తల్లి వాని జోక్యము నేమియు బుచ్చుకొనదు. ఈసంసారమంతయు చెదరి పోయి ప్రతివ్యక్తి దానియిష్టమువచ్చినట్లు సంచరించు చుండును.

## సాలెపురుగులు

పూర్వకాలమునందు విశ్వామిత్రుడను రాజు వసిష్ఠ మహామునియాశ్రమమునకు వెళ్ళి అచ్చటగల హోమ ధేనువును తనకై కోరగా మునీంద్రుడు యిచ్చుటకిష్టపడనందున బలాత్కారముగ రాబట్టచూడ ఆ మునిపుంగవునికి బిట్టలుక గలిగి తీక్ష్ణముగాజూడ అతనినొసలునుండి చెమటచుక్కలుజారి



గోవునకై కోసియుంచిన తృణమునందుపడి అందుండి భయం కరములై నానావిధాకారములుగల గొప్పవిషము గలిగినట్టి పురుగులు పుట్టి యారాజపుంగవుని సైన్యమును బాధింప జొచ్చెను.

మహర్షియొక్క చెమటచుక్కలు లూనములగుతృణ ములందుబడి యివి జన్మించినవి. అందువలననే వీటికి లూతలని పేరుగలిగినది. ఇవి పదియారు జాతులు. అందు 8 కృచ్ఛ్రసాధ్య ములు, 8 అసాధ్యములు. కృచ్ఛ్రజాతులు కరచిన తలభారము, కరచినచోటదురద, బాధ, చోంగపడుచుండును. అసాధ్యలూతలు కరచినచోకాటునందు వాపు, రక్తమెక్కువగా కారుట, పారుడు మున్నగునవి కలుగును. పెద్దపెద్దకురుపులు పొడలు పుట్టును.

సాలెపురుగుల విషము చాల తీవ్రమైనది. సామాన్యులు దానిని తెలిసికొనలేరు. వృక్షము నెప్పటికప్పుడు పుట్టు చున్న మొలకలవలె నుండగా గుర్తుపట్టుటకెట్లు కష్టమగునో అటులనే సాలెపురుగుల విషముగూడ శరీరమునందు జేరినంత మాత్రమున గుర్తుపట్టుట కష్టము.

## సాలెపురుగులను తినుట

మనము మన యిండ్లయందును, రెల్లుదుబ్బులందును, జనుపగడ్డి వాములందును సాలెపురుగులను లూతలను చూచు చుందుము. వీటినిగురించియే ఇదివరకు చెప్పబడి యున్నది. సాలీడుశరీరమందు గ్రంధులనబడు సంచులుండును. కొన్ని భూములలో కన్నములుచేసికొని వానిపై కప్పులనుదారముతో

నమర్చును. లోపలిభాగమున పగలంతయు నుండి రాత్రిలయం దాహారముకొరకై వెలుపలికి బయలుదేరును. మరికొన్ని చెట్లకొమ్మలకు ఛత్రమువంటిగూటిని నిర్మించి మధ్యను తన పిల్లలను రక్షించుకొనుచుండును. ఇంకకొన్ని నీటియడుగుననే యుండి యచ్చటనే గూండ్లుకట్టుకొని తమ పిల్లలను పెంచుకొనుచుండును. పశువులు రెల్లుదుబ్బులను తినునపుడుగాని, జనుపకట్టలు, జొన్న, వరిగడ్డి, బీటిమేత, తదితరదాణాదినుసులు, తినునపుడు వానితోపాటు ఈసాలీళ్ళను వాటిగూళ్ళను తినిన యెడల ఒకవిధమైనవ్యాధి కలుగును. కొన్ని ప్రమాదము కలిగించును.

## లక్షణములు

ఆరంభములో పశువు నల్లకప్పువేయును. కడుపుబ్బును. నోటినుండి చొంగపడుచుండును. మలబద్ధక ముండును. వెన్ను విరచుచుండును. ఈవ్యాధి సంవత్సరము లేక ఆరుమాసముల వరకుండును. కొన్ని వెంటనేతగ్గును. కరచినచోట మంటలు పుట్టును.

## చికిత్సలు

ముందు విరేచనములకు మందీయవలెను.

తరువాత దిరిసెనాకు పసరు—-అర్ధసేరు

పసుపు — ½ తులం

కలిపి త్రాగించవలెను.



లేక

సొంటి — 1 తులం

పిప్పళ్లు — 1 తు

మిరియాలు 1 తు

మజ్జిగ — 1 సేరు

కలిపిత్రాగించవలెను.

ఎక్కువ తీవ్రలక్షణము లున్నచో

సొంటిగంధముగాని మిరియాలగంధముగాని కండ్లలో కలికెము వేయవలెను.

## పిచ్చికుక్కలు, నక్కలు కరచుట

ఈరోగము పిచ్చి ప్రతిజంతువునకు రావచ్చును. ఇది నిజముగా జంతువులకు కలిగెడివ్యాధియై యున్నది. ఇది మనుష్యులకుగూడ అకస్మాత్తుగా కలుగుచున్నది. ఈవెఱ్ఱికి కారణభూతమైన దేదియో ఇంకను కనుగొనబడలేదు. ఈవ్యాధిగల జంతువుదేహమందు విషమను పదార్థము నరములుగల భాగమందుండును. అనగా మెదడు, నరములు- వీనియందును, ఉమ్మినికూర్చునట్టి గవదలవంటి కొన్నిభాగములందును యుండును. గవదలనుండి విషము ఉమ్మిమూలముగ వెలుపలికి వచ్చును. కాన వెఱ్ఱిపట్టినజంతువులు కఱచుటవలన ఆవ్యాధి తదితరపశువులకు మనుష్యులకు సోకుచున్నది. అయినను వెఱ్ఱిపట్టినజంతువుయొక్క విషము కాటు యేర్పడిన చర్మమునకు తగిలిననేగాని అది సోకుదును కలుగజేయ నేరదు. అట్టికాటు సామాన్యముగా ఆవెఱ్ఱిజంతువుయొక్క పండ్లచే

నేర్పడును. కాని మంగలికత్తి గాయములను, దోమకాట్లు మున్నగు చిన్నగాయములను ఆపశువు నాకినయెడల ఈవ్యాధి కలుగవచ్చును. ఈవ్యాధి తగిలిన పశువునకు మూడు లేక అయిదుదినములవరకు రోగచిహ్నము లగుపడవు. ఇదియును గాక తనంతట తాను వ్యాధికలిగినజంతువులకు సాధారణముగా వ్యాధి ప్రారంభించినది మొదలు కొన్నిదినములలోనే మరణము కలుగజేయును. విషము వెన్నెముకకు మెదడునకు చేరువరకు ఈవ్యాధి బయల్పడదు. ఈతావున చేరుటకై ఆవిషము నరములగుండా వ్యాపించును. కాబట్టి కాటుమెదడునకు ఎంతసమీపమునందుండునో అంత త్వరగా విషము మెదడునకెక్కి అంత త్వరితముగా రోగలక్షణములు కన్పించును. ఈవ్యాధి కొన్నిటికి ఆరుమాసములవరకుండును. పిచ్చికుక్కవలె నక్కవలె అరచును. పిల్లులు తోడేళ్లుకరచిన మిగుల అపాయకరము.

## లక్షణములు

జంతువు మొదట వ్యాకులతతోనుండి మూతివిరచుచుండును. మనుష్యులయొద్దకుగాని, తదితర పశువుల యొద్దకుగాని చేరుటకిష్టముండదు. గృహోపకరణములక్రిందగాని, నిశ్శబ్దమైనస్థలమునందుగాని దాగియుండును. రోగము ముదిరిన కొలది కోపోద్రేకముకలిగి చిరాకుగానుండును. కంటికి కనబడినదానినెల్ల కఱవబోవును. ఈగలను పట్టుకొనుటకు ప్రయత్నించుచు దానివలె అరచుచు తిరుగులాడు చుండును. ఒక విధమైన చొంగ నోటినుండి కాఱుచుండును. ఆచొంగ



జిగటగాను,నురుగునురుగుగానుఉండును. చొంగపశువులపెదవులనుండి తీగవలె వ్రేలాడుచుండును. కండ్లు ఎఱ్ఱగానుండును. ఇట్టిస్థితిలో ఆజంతువు నోరు కొంచెము తెరచుకొని సరిగా ముందునకు పరుగెత్తుచు మార్గమున దానికి కనపడు ప్రతివానిని పొడుచుచు కఱచుచు పోవుచుండును. ఆకలిమందగించును. దానికి దొరుకునట్టియేవస్తువునైన తినబోవును. అది అరచునపుడు దానిఅరపు ఒకవిధమైనలోహపుధ్వనిగల కూతగా మారిపోవునట్లు కనుగొనవచ్చును. ఇట్టిమరణము సంభవించును. పక్షపాతముకలుగును. ఆహారము తినదు. క్రిందిదవుడలు సన్నముగానుండును. మ్రింగునపుడు విశేషముగాకష్టపడునట్లు విశదమగును. చిట్టచివరకు కాళ్లుచచ్చుపడి విరేచనములై శుష్కించి చనిపోవును. కొంతకాలము కదలకుండ పడియుండిన తరువాత కొన్నిపశువులకు మరణము సంభవించును.

## చచ్చినతరువాత కనపడు లక్షణములు

ఈవ్యాధిగల పశువుకడుపు కోసి చూచినయెడల మట్టి రాళ్లు పుల్లలు గడ్డి చింపిరిగుడ్డలు మున్నగు వస్తువులతో నిండియుండును. క్రిందిదవుడ వ్రేలాడవేయును. చిక్కని ద్రవము కాఱుచుండును.

## చికిత్స

1 గానుగవేరు లేక పట్టరసము అర్ధసేరువంతున వారము దినములు ప్రతిదినము ఉదయమున త్రాగించిన వెర్రికుక్క, నక్కల విషములు హరించును.

2 తుమ్మచెక్కపొడి సారాయిలో కలిపి గాయమునకు పట్టించిన తగ్గును.

3 ఉమ్మెత్తవేళ్లరసము అర్ధసేరు తీసికొని సేరుమజ్జిగలో కలిపి ఈయవలెను. కోడిపెంట కరచినగాయమునకు పట్టించవలెను.

4 మగపశువునకు పిచ్చియెత్తిన ఆడుపశువుమూత్రమును, ఆడపశువునకు పిచ్చియెత్తినయెడల మగపశువుమూత్రమును పూటకు అర్ధసేరు త్రాగించవలెను.

5 ఈ వ్యాధిగల పశువుగాయముమీద గరిటెతో గాని ఇనుపకడ్డీతో గాని కాల్చవలెను.

## హెచ్చరిక

ఇటువంటిజంతువును సాధ్యమైనంతవరకు చంపరాదు. దానిని జాగ్రత్తగా గొలుసుతో కట్టివేసి పరీక్షించుచుండవలెను. ఆకాలము ముగియునప్పటికి అది యింకను బ్రతికి బాగుగనుండి చెడులక్షణములు ఏమియు కనబడకయున్నయెడల దానికి వెఱ్ఱిపట్టలేదని గ్రహించవలెను. వెఱ్ఱికుక్కలు, నక్కలు కరచిన కాటునుండి రక్తము నలుపుగా కారును. ఆచోటున స్పర్శజ్ఞానము తగ్గును. ఒకానొకప్పుడు యీవిషము ఒకటి రెండు సంవత్సరములు శరీరమున దాగియుండి తరువాత బయలువెడలును.

## సర్పములు

కోరలను విషమును గలిగి తమకాటులచే పశుమనుష్యా



దుల కపకారమొనరించుసర్పములు 80 అని తెలిసికొనవలెను. ఇవి అయిదువిధములుగా విభజించబడెను.

దర్వీకరములు— త్రాచుపాములు
మండలులు — పొడపాములు
రాజీవంతములు— కట్లపాములు
నిర్విషములు— విషములేనివి
వైకరంజములు— సంకరజాతులు

## విభజింపబడిన సర్పజాతులు

| | |
|---|---|
| త్రాచుపాములు— | 26 |
| పొడపాములు— | 22 |
| కట్లపాములు— | 10 |
| విషములేనివి— | 12 |
| సంకరజాతులు— | 3 |
| సంకరజాతులవలన పుట్టినవి— | 7 |

ఈరీతిగా మొత్తముమీద 80 జాతిసర్పములు గలవని తెలిసికొనవలెను.

## రంధ్రములలో దాగియుండునవి

ఈపాములు భూభాగమునందుండురంధ్రములలో గాని, తదితరప్రాంతములందుగాని నివసించుచుండును. అప్పుడప్పుడు వానికి అవుసరము వచ్చినపుడుమాత్రము భూమిపై తిరుగుచుండును. వీటిశరీరము మిగుల దృఢముగాను వలయాకారము

గాను ఉండును. తోక పొట్టిగానుండును. నోరు చిన్నదిగా నుండును. దంతములుకూడ మిగులచిన్నవిగా నుండును. వాటికి చిన్నచిన్న పక్షులు పురుగులు మొదలగునవి ఆహారను.

భూమిమీద సంచరించునవి

ఇవి భూమిమీదనే సంచరించుచు అప్పుడప్పుడు గుబురు లతలలోనికి, ముండ్లపొదలలోనికి, బోవుచుండును. నీటిలోనికి గూడ బోవుచుండును. శరీరము కొంచెము వంకరగా నుండును. అటునిటు వంగు శక్తి బాగుగానుండును. వాటి యాహారము వెన్నెముకలుగల జంతువులు చాలా భాగపు రకములు ఈ జాతిలోనివే.

చెట్లమీద సంచరించునవి

ఇవి పొదలమీదను, చెట్లమీదను కాపురముండును. శరీరము నునుపుగాను సన్నముగాను నుండును. వీటిలో కాంతిగల రకములనేకములు గలవు. ఆరకములలో ఆకుపచ్చనిది ముఖ్యమైనది. ఇందు కొన్ని మాత్రము గుడ్లను తినును.

నీటిలో నివసించునవి

ఇవి మంచినీటిలో నివసించును. తోక కోసుగా నుండును. చక్కగా ఈదగలవు. వీనిలో కొన్నిజాతులు సముద్రముల లోనికిపోవును. ఇవి చేపలు కప్పలు పీతలు మున్నగువాటిని తినును. ఇవి విషవంతములైనవి కావు.



సముద్రములలో నుండునవి

ఇవి సముద్రములలో నివసించును. అప్పుడప్పుడు ఒడ్డునకు వచ్చుచుండును. చేపలను తినును. ఇవియును విషములు గలవియే. ఇవికూడ పిల్లలను పెట్టును.

కొండలమీద నుండునవి

కొన్ని పాములు కొండలమీదనుండును. ఇవి చాల పెద్దవిగా నుండును. వీటికి తగినంతవిశ్రాంతి, ఆహారముండుట చేత చాల బలము గలిగియుండును. ఇవి నూరుసంవత్సరములవరకు బ్రతుకును.

అల్పవిషములు గల పామసర్పములు

రోగము కలిగినట్టియు, భయపడునట్టియు, సర్పములకు విషము స్వల్పముగ నుండును. అవిధముగనే వృద్ధాప్యము గలిగినట్టియు, చిన్నవియగుపాములకు గూడ స్వల్పవిషముండును. విషహరములగుఔషధములుకల ప్రదేశములయందు విషము బాగుగా వ్యాపింపజాలదు. జలములోను సంచరించు సర్పములకు, కుబుసము విడుచు సర్పములకు, చిక్కిన సర్పములకు దప్పిగొన్నసర్పములకు విషము తక్కువగా నుండును.

అరిష్టము

ఏసర్పము కరచినను కాళ్ళయందైనచో మొట్టమొదట గుడ్డపీలికలచేగాని, తోలువారులచేగాని, చెట్టుపట్టలచేగాని, మరి యేయితరమృదువైన వస్తువులచేగాని కరచినచోటునకు

నాలుగు అంగుళములపైన కట్టుకట్టవలెను. ఇట్లు కట్టుటచే విషము శరీరమునందు వ్యాపింపక నిలచిపోవును. ఈ కట్టునకు అరిష్టమందురు. కట్టు కట్టుటకు వీలులేనిస్థలములైనచో విషమును వెలుపలికి పీల్చుట, కరచినచోటు కోయుట, కాల్చుట యనునవి అన్ని విషములందును ముఖ్యములైనవి.

### సర్పములవిషము

మనుజులకు శరీరమంతటను శుక్లము వ్యాపించియున్న రీతిగ సర్పమునకు శరీరమునందంతటను విషము వ్యాపించి యుండును. కోపము కలిగినపుడు విషము బయల్వెడలును. సర్పముయొక్క కోరలు చేపలను బట్టుగాలములవలె వంకరగా నుండును. విషము శరీరమునుండి బయలుదేరి వానియందు చిక్కుకొనును. కనుక సర్పములు కాటు వేసినతరువాత వెల్లికిలబడినగాని (పడగవరకు) విషమునువదలజాలవు. విషమంతయు గూడ మిక్కిలి ఉష్ణముగ తీక్ష్ణముగనుండును.

### మంత్రములు

సర్ప విషహరములగు మంత్రములను తెలిసినవాడు మంత్రముల జదువుచు త్రాడు మున్నగువానిచే కట్టుకట్టిన అవి ప్రభావములచే విషములను హరించును.

దేవతలచేతను, బ్రహ్మర్షుల చేతను చెప్పబడిన సత్య తపోమయములైన మంత్రములు వ్యర్థముగాక అతిభయంకరమైన విషములనుగూడ బోగొట్టును. తేజస్వంతములై, సత్య తపోయుక్తములైన మంత్రరాజములచే విషము నివారింపబడునట్లుగ ఔషధములచేత నివారింపబడదు.



విషమును పోగొట్టుటకు కలికెము (అంజనము) చూర్ణములు పీల్పించుట (నస్యకర్మ) చేయించవలెను. పూయుటకు వాడెడుపట్లు, గంధము మొదలగునవి చాల చల్లగనుండునవి వాడవలయును.

### కాటులోని భేదములు

పాదములతో దన్నినగాని, స్వభావదార్ష్ట్యముచే గాని, ఆహారము కోరికాని, మహాక్రోధముగల యాసర్పములు జీవుల గరచుచుండును. ఈసర్పదంశము (పాముకాటు) నాలుగు విధములుగా విభజింపబడెను.

### స్పరితము

కాటుఒకటిగాని, నాలుగైదుగాని గలిగియుండి కోరలు దిగినచుట్టు మరిచిగుళ్ళఆకారమువలె పొట్టిగనుండి కొంచెము వాపుగల యంకురములు బుట్టినయెడల స్పరితమందురు.

### రదితము

కరచినచోట కొంచెము రక్తముగ వచ్చును. పసుపు తెలుపు నీలము ఎరుపురంగుగల గీతలు చర్మమునందు గలిగినది రదితమనబడును.

### నిర్విషము

మూడుకోరలు దిగి వాపులేకుండును. ఇందువిషముండదు

### సర్పాంగాభిహతము

భయమెక్కువగుటచే కరచినవానికి వాతము ప్రకోపించును.

## మహాసర్పములు

ఇవి నేలమీద సంచరించుచుండును. సర్పముల కన్నిటికి ఇవి అధిపతులు. వీనియాకారము అగ్నివలె ప్రకాశించుచుండును. ఇవి ఎల్లప్పుడును విషమును వర్షింపుచు లోకములతపింప జేయుచుండును. అన్ని సముద్రములయందును, పర్వతములయందును కన్పట్టుచున్నవి. ఈ సర్పములు కోపగించిన ఈ ప్రపంచమును కేవలము దృష్టి. నిట్టూర్పులతో దహింపగలిగియుండును.

## త్రాచుపాములు (దర్వీకరములు)

చక్రము, నాగలి, ఛత్రము, చౌకము, అంకుశముల చిహ్నముగలిగి. పడగలతో నొప్పారుచు శీఘ్రమగు గమనము గలవాటిని త్రాచుపాములందురు.

గోధుమత్రాచు, నల్లత్రాచు, కందిపొడలత్రాచు; నాగజెర్రిత్రాచు, ఆరికెవన్నెత్రాచు; మొగలిపూవుత్రాచు; తెల్లత్రాచు; కోడిత్రాచు; నీరుత్రాచు; సెనగపువ్వుత్రాచు; చింతపువ్వవన్నెత్రాచు; గిరినాగు మున్నగు రకములు గలవు.

## వారములను బట్టి విషములుండును

గోధుమత్రాచునకు శనివారమునాడును; నల్లత్రాచునకు మంగళవారమునాడును; ఆరికెవన్నెత్రాచునకు కందిపొడలత్రాచునకు బుధవారమునాడును; నాగజెర్రిత్రాచునకు సెనగపువ్వుత్రాచునకు సోమవారమునాడును; మొగలిపువ్వుత్రాచునకు, తెల్లత్రాచునకు గురువారమునాడును; కోడి



త్రాచునకు, నీరుత్రాచునకు, గిరినాగునకుశుక్రవారమునాడు; చింతపువ్వవన్నెత్రాచునకు భానువారమునాడును; విషోద్రేకముండునని తెలిసికొనవలెను.

## పొడపాములు (మండలీసర్పములు)

అనేకరకములగుపొడలు- పెద్దశరీరము గలిగియుండును. నెమ్మదిగా తిరుగుచుండును. ఇవి సూర్యునివలె ప్రకాశించుచుండును.

కలంకారీపెంజర - ఇది మూరెడుపొడవుండును. కలంకారీరంగువంటి మచ్చలుండును. ఇది కరచిన శరీరమున మంటలుండును. దినములో చనిపోవును.

పొట్లపెంజర:—దీనితల తోక సన్నముగానుండును. శరీరము లావుగానుండును. పొట్లకాయరంగుగలిగి పొట్లకాయవలె పొడవుగానుండును. గురక పుట్టును. శరీరము వాచును; నాలుగుదినములలో మరణించవచ్చును. తివాసిపొడపెంజర; పిచ్చుకపొడపెంజర; అగ్నిపొడ పెంజర; పొడపెంజర; సున్నపుపొడపెంజర; తేనెపొడపెంజర; కుల్లుపొడపెంజర; పాదిరీపొడపెంజర; గవ్వపొడపెంజర; గరికపొడపెంజర; మోదుగపొడపెంజర; పసుపుపొడపెంజర; దొండపండుపొడపెంజర; అనురకములు గలవు.

## కట్లపాములు (రాజీవంతములు)

ధగధగలాడుచు వివిధవర్ణములు కలిగి నిడుపుగ, అడ్డ

ముగ వ్యాపించిన గీతలతో చిత్రింపబడినట్లు ప్రకాశించు వాటిని రాజీవంతము లందురు.

వీటిలో నాలుగు తెగలు గలవు.

### క్షుద్రజాతిసర్పములు

ఇవి తొమ్మిదిరకములు. పెద్దకట్లపాము; నాగులకట్లపాము; నూనెకట్లపాము; బత్తెకట్లపాము; కట్లపాము; తాడిగిరి; చెల్లెగురుపాము; గొడ్డలిమొగపుపాము; గోడపాకుడుపాము; అనురకములు.

### మహాసర్పములు

కొండచిలువ; సముద్రపుపాము; దాసరిపాము.

### నిర్విషసర్పములు

కొండచిలువ; క్షీరకము; జ్యోతీరథము; పుష్పాహికము; వానపాము; పుష్పశకలము; అందాహి; పసిగిరిపాము; గలగోలి; నూకపత్రము; జాలకము; కలశిబలాహకము; గజభక్షము; అను నామములుగల పాములు విషరహితములై యుండును.

### కుంభీనసర్పములు

త్రిశూలిసర్పము; కుంభీనసర్పము; రెక్కలపాము, లోహితాక్షసర్పము; శోణముఖసర్పము; ఘంటాపుచ్ఛము; ఛత్రపతిసర్పము.

### బ్రాహ్మణజాతిసర్పములు

ముత్తియములను వెండిని బోలిన తెలుపుకాంతి గలిగి



నట్టియు; ఎఱుపు పసుపురంగు కలిగినట్టియు; బంగారువన్నె కలిగినట్టియు; సాంబ్రాణి దిరిసెన పద్మము మొదలగుపువ్వుల సువాసనగల సర్పములను బ్రాహ్మణజాతిసర్పము లందురు. ఇవి పర్వతజలధారలదగ్గరను; తటాకములదగ్గరను; నూతులదగ్గరను; మెట్లభావులదగ్గరను యుండును. పుష్పములను గాలిని భక్షించును.

### క్షత్రియజాతిసర్పములు

ఇవి వజ్రములవలె నిగ నిగ లాడుచుండును. వీనికి కోపము ఎక్కువగా నుండును. దీని శరీరమునందు సూర్యుడు చంద్రుడు గొడుగులను శంఖచక్రములరంగువలె జాజి సంపంగి పొన్న పుష్పముల వాసన గలిగియుండును. నేరేడు ఖర్జూర ఫలముల రంగువలె నుండును. ఇవి పరిశుభ్రమైన స్థలము లందును; మనుష్యులుండుస్థలములందును నివసించును. మూషికములను తినును.

### వైశ్యజాతిసర్పములు

ఇవి నలుపుగను; కెంపు గోమేధికకాంతి గలవిగను; పావురపురంగుగను; గులాబిపుష్పవాసనగలిగియు నుండును. ఇవి కాటియందును; బూడిదకుప్పలందును; ఊకకుప్పలందును; నదీతీరములందును; పశుశాలలందును నివసించును. మండూకములను దినును.

### శూద్రసర్పములు

ఇవి దున్నపోతు; పెద్దపులి యనువాని చర్మములను బోలిన వర్ణము; పౌరుషము కలిగి చిత్రవర్ణములు కలిగి

యున్న సర్పములకు శూద్రసర్పములందురు. ఇవి మనుష్య సంచారము లేక పాడుపడినస్థలములందును; నిర్జనస్థలము లందును; కట్టెలగుట్టలయందును నుండును. ఇవి అన్నిటిని దినును.

## ముంగిసలు

ఇవి సాధారణముగా పాములతో బోట్లాడదలచి నప్పుడు ప్రథమమున తాము కుక్కపాలచెట్టున్నచోటును చూచివచ్చి తదుపరి సర్పముపైకి కలహించుటకై బోయి సర్పమును తిన్నగా నా చెట్టుదగ్గరకు రానిచ్చి కలియబడి అవి కాటువేసినపుడెల్ల కుక్కపాలాకు కొరికి నమలితినుచు విషము పోగొట్టుకొనుచు పామును చీల్చివేయును. ఇది మహాజాగ్రత్త గలజంతువు.

## సర్పములకు ఆయువు

5 సంవత్సరములు, 20, 50, 55, 100, 500, 1000 సంవత్సరములు కాలపరిమితి యుండును.

## కోరలు వచ్చుట

పాములకు సంవత్సరమున కొకసారి కోర లూడిపోయి మరల నూతనముగా వచ్చుచుండును.

## గర్భిణీసర్పము

గర్భముతోనున్న సర్పము కరచినయెడల సర్పదష్టుని నోటనుంచి రక్తము ప్రవహించును. సహించలేని మంటలు శరీరమంతటను గలుగును. ముఖము తెల్లబడును.



## ఆడసర్పము

స్త్రీసర్పము కరచిన నోస లుబ్బును. క్రిందిచూపుగలిగి యుండును. పాదములు భూమిమీద నిలుపుట కష్టము.

## పురుషసర్పము

పురుషసర్పము కరచిన క్రింద చూడలేకుండును. కుడి కాలు క్రింద బెట్టుట కశక్తుడై యుండును.

## ప్రసవించినపాము

ఇది కరచినయెడల లింగమునుండి రక్తము ప్రవహించును.

## కాటుభేదములు

వెలికిల బడినచో మిక్కిలి బలముగా కరచినదనియు, ఒక్కకోర మాత్రమే దిగబడినయెడల ఆక్రాంతమై కరచిన దనియు, ఒక్కకోరమాత్రమే కొంచెము దిగబడినయెడల భీతిల్లి కరచినదనియు, రెండుకోరలు లోతుగా దిగబడినయెడల క్షుద్బాధ మిక్కుటముగా నుండి కరచిన దనియు, మూడు కోరలుగ దిగబడినచో మహానాగము కాటువేసినదనియు, మిక్కిలి లోతుగా గాయము బడునటుల గరచినయెడల ఇది వరకు పగబట్టి కరచినదనియు గ్రహింపుము.

## వివిధజాతులసర్పములు

## ఆఫ్రికావిషసర్పము

ఇది దక్షిణాఫ్రికాయందున్నది. ఇది మిగులభయంకర ముగానుండును. చర్మము గట్టిగను, తోక పొట్టిగనుండును.

కోపమువచ్చినపు డెంతమాత్రము యిదితగ్గదు. ఆ దేశస్థులు మిగుల భయపడుచుందురు.

### ఈజిప్టు విషసర్పము

ఇది ఈజిప్టు దేశములో నెక్కువగా నుండును. రెండడుగుల పొడవుండును. ఎరుపు పసుపు రంగుగల మచ్చలుండును. ఎడారులలో నెక్కువగా నివసించును. ఈజిప్టు దేశపురాణి అయిన 'క్లియోపాత్ర' అను నామె ఈ పాముచేత కరపించుకొని ఆత్మహత్యచేసికొనెనని చెప్పుదురు.

### ఇంగ్లండు విషసర్పము

ఇంగ్లండులోనుండుపాములలో నిది యొకటియే విషసర్పము. ఇది 16, 20 అంగుళములవరకు పొడువుగలిగి యుండును. కాని యిది మిగుల పిరికిజంతువు. ఇది కప్పలను చిట్టెలుకలను పురుగులను చంపి తినును.

### ఆస్ట్రేలియా విషసర్పము

ఇది యొక్క పెద్దసర్పము. దీనినే అపొలో అను సూర్యాధిదేవత చంపెనని గ్రీకులు చెప్పెడివారు. ఈరీతిగనే యమునానదియందలి కాళియుడను సర్పరాజును కృష్ణుడు చంపెనని చెప్పుదురు. పాములలోకెల్ల నిదియె పెద్దది. 15 లేక 20 అడుగులపొడవు గలిగి దూలములావు గలిగియుండును. జింకను మేకను సునాయాసనుగా నిది తినగలదు. జంతువును పట్టుకొనినతరువాత దానిచుట్టును గట్టిగా చుట్టు



కొని ఊపిరి తిరుగకుండునట్లు అది దానిని చంపును. ఇది పెద్ద జంతువును తినినతరువాత కదలక మెదలక పడియుండును.

### అమెరికా కొండచిలువ

ఇది యెద్దంతపరిమాణము కలిగియుండును. మృగములను పట్టుకొని బిగించి చంపును. ఇది అమెరికాలో ఉష్ణదేశములందుండును. 35 అడుగులపొడవు గల కొండచిలువయొక్క చర్మము ఇంగ్లండులోని వస్తుప్రదర్శనశాలలో నున్నది. ఇది మనుష్యులకొరకు మృగములకొరకు నదులయందు చెరువులయందు నివసించును. దీనినే బ్రహ్మరాక్షసి యందురు.

### సర్పముల చరిత్ర

సర్పములకును; కాళ్లులేనిబల్లులజాతికిని భేదములు కనుగొనుట కష్టము. హిందూ దేశములోనికొండచిలువలలో తోక ప్రారంభించుచోట కాళ్లుమాదిరి మొలకలు గాననగును. దీనినిబట్టి యొకప్పుడు పరిణామదశలో సర్పములకు గూడ కాళ్లున్నవని తెలిసికొనగలుగుచున్నాము. సర్పములలో దవుడల యొక్క బొమికలు సాగునటుల నతుకబడియుండును. కావుననే యివి తమకన్న పెద్దజంతువులను మ్రింగుటకు వీలగుచున్నది. వాని నేత్రములకు కదలగల పై రెప్ప లుండవు. కాననవి మనవైపుజూచిన రెప్పవేయక చూపునునిలుపును. అందుచే భయమును గలుగజేయును. వానికి మెడయుండదు. దేహముకన్న తల వెడల్పుగానుండును. వీనినాలుక బహుమృదువుగానుండి చివర రెండుగా విభజింపబడియుండును. పిల్లికిమీసము లెట్లు

ఉపయోగమో సర్పములకు యీనాలుక యట్లే. ఈనాలుకతో చీకటిలో దానితోవను తాకి తెలిసికొనగలదు.

జంతువర్గములో సర్పములయొక్క గమనము చాల యద్భుతమని జంతుశాస్త్రజ్ఞులయొక్క యభిప్రాయము. విషము లేని సర్పములలో పైదవుడలో సన్నని రెండువరుసలపండ్లుం డును. ఇవి వాడిగాను వెనుకకువంగియుండును. ఇటువంటివే యొకేవరుస క్రిందిదవుడలోనుండును. ఈపండ్లు వెనుకకువంగి యున్నవి గావుననే అది దానియాహారజంతువును పట్టుకొనిన నది తప్పించుకొనజాలదు. దీనినిగుర్తించియేకాబోలు సర్పము మీదకువచ్చిన మనబట్టను మీదకువిసరినచో నాపామాబట్టను పట్టుకొనునుగాన యీవంగినపండ్లలో నది దగుల్కొనును. అందువలన నాసర్పము విడిపించుకొనజాలదని మనలోవాడు కగా ననుకొనుచుందురు. విషసర్పములలో విషదంష్ట్రములు గొట్టములవలెనుండును. కొన్నిటిలో నీ కోర లొకప్రక్క పల్ల ముగానుండును. మనలో ఉమ్మిని తయారుజేయు మాంస గ్రంథులీవిషమును తయారుజేయునవిగా మారియున్నవి. ఇవి కంటికి క్రిందుగను వెనుకగను నమర్చబడియుండును. నోరు బాగుగా తెరచి కరవబోయినపుడు మాంసకండలీమాంస గ్రంథులను నొక్కునుగాన విషము కోరలలోనుండి ప్రవహించి కోర దిగినచోట యితరజంతువులలోనికి ప్రవహించును.

వేడి ఎక్కువయున్నప్రదేశములలో సర్పములెక్కువ. వివిధరకములలో యెక్కువసంఖ్యలో హిందూదేశములయీ ప్రాంతములు ముఖ్యము. బ్రిటిషుదీవులలో మూడురకములు



గలవు. ఇవి సాధారణముగా నివసించును. పర్వతప్రాంతముల యిసుకయెడారులలో యెక్కువగాగానగును. కొన్నిభూమిలో త్రవ్వుకొని నివసించును. కొన్నిరకములు చెట్లమీద నివసిం చును, కొన్ని నేలమీదను నీటిలోగూడ నివసించును. మరి కొన్ని సముద్రపునీటిలో నివసించును. ఇవి గుడ్లుపెట్టును. తెల్లనితోలుమాదిరిగా నుండు గుల్లలో యీగుడ్లుండును. తడవకు చాలాగుడ్లుపెట్టును. నేలలోపెట్టబడుగుడ్లు యెండ వేడిమివలననే పొదుగబడును. కొండచిలువలు తమంతట తామే పొదుగును.

ఒకరకపు సర్పములు: వీనిని గుడ్డిసర్పములందురు. భూమిఅడుగుననే నివసించును. వీనికి కళ్లుండవు. చీమలనుతిని ముఖ్యముగా బ్రతుకును. వీనిలో నూరురకములున్నవి. ముఖ్య ముగానివి ఉష్ణదేశములలో గానవగును. జంతుపరిణామములో యీ చిన్నగుడ్డి అంధకారములోనుండు సర్పముల తరువాత బహుపెద్దవిగానుండు కొండచిలువలు యని యూహింపబడు చున్నది. వీనితరువాత విషసర్పములు జంతుపరిణామములో వెలువడినటుల గాన్పించును.

## కొండచిలువలు

ఇవి విషజంతువులుగావు. పైదవుడలో రెండువరుసల పండ్లుండును. కోరలుండవు. వీనితోకలు ఇతర వస్తువులను పట్టుకొనుటకు వీలుగా నేర్పరుపబడినవి. కొండప్రదేశములన్న వీనికి ప్రీతిగాన వీనిని కొండచిలువలందురు. దక్షిణతూర్పు ఆసియాలో ఆస్ట్రేలియాలో మధ్యదక్షిణఆఫ్రికాలో యీజాతు

లున్నవి. ఇవి 30 అడుగులదాక యుండును. తోకతో జుట్టి బిగించి నలిపిజంపును. అట్లుసాంతముగ జచ్చినజంతువును తల దగ్గిరనుంచియు మ్రింగును. ఈవిధముగా జుట్టుటవలన బొమికెలు విరిగిపోవును గాన తేలికగా మ్రింగుడుపడును. ఇటుల నొకమారు భుజించిన వీనికి కొన్నిదినములు మాసములవరకు మరల నాహారమవుసర ముండదు. ఇవి కుందేళ్లను, గొఱ్ఱెలను, చిన్న దూడలనేగాక తరచుగా మనుజులనుగూడ యిటుల తినును.

## వృక్షసర్పములు

ఇవి హిందూదేశములో ఆస్ట్రేలియాలో నున్నవి. వీనికి పెద్దపెద్దకన్నులుండును. పచ్చరంగు కలిగియుండును. వీనిరంగును యివి నివసించు చెట్లరంగును యొకేవిధముగా నుండును, గావుననివి చెట్లమీద నున్నటుల గుర్తించుటయే కష్టము. విషతీవ్రత త్రాచులలోను, కట్లపాములలోను గాననగును. ఈదేశములో పాములవలన నష్టములు త్రాచులవలన తరువాత కట్లపాములవలన యగుచున్నవి. త్రాచులకున్న పడగ యాభాగముతోనున్న బొమికలు ప్రత్యేకముగా కదలుట వలన గలుగుచున్నది. ఈ బొమికలను దానియిష్టము వచ్చిప్పుడు కదల్పగలదు. దీనిపైనున్నతోలు వదులుగా నుండును, గాన నిటులచేయగలదు. ఈ పడగవెనుకభాగమున సులోచనముల మాదిరిగా నుండును. కొన్నిటిలో నిది యుండకపోవచ్చును. ఇది 6 లేక 7 అడుగుల వరకు యెదుగును. అడవులలో నిది 13 అడుగులవరకు గాననగును. ఈపెద్దసైజు త్రాచు



మామూలుగా తక్కిన చిన్నసైజు త్రాచులను, యితరపాములను తిని బ్రతుకును.

## సముద్రపుపాములు

వీనితోకలు బోట్లనునడుపు తెడ్డుమాదిరిగా కూర్చబడి యుండునుగాన యివిచాల త్వరితముగా ఈదగలవు. ఇవి చాల విషజంతువులు. చేపలనుతిని బ్రతుకును. ఇవి యుష్ణపు సముద్రములతో నివసించును. ఇవిగుడ్లను పెట్టవు. తయారైన పిల్లలనే పెట్టును.

## త్రాచు - కట్లపాము జాతులు

పరిణామములో ప్రత్యేకమైనది సర్పజాతిలో కట్లపాములనునవి. వీనిలో పైదవుడబొమికలు చాల తేలికగా గదలునట్లుగా నేర్పరుపబడినవిగాన నోరు చాల వెడల్పుగా తెరువగలవు. పైదవుడ ముందరివైపున గొట్టములవలె నుండు రెండు విషకోరలు మాత్రముండును. వీనితల వెడల్పుగా నుండును. శరీరము లావుగను, తోక చిన్నదిగను మొండిదిగను యుండును. కంటిపాప నిలువుగానుండును. గాన యిదిరాత్రిసంచరించునని తెలియుచున్నది. ఈజాతి వన్నియు విషజంతువులే. ఈజాతి సర్పములు యిసుకలో ఒడలు పూడ్చుకొని తల మాత్రము బయటకు పెట్టుకొని పడుకొనును. ఏదైనజంతువు దగ్గరగా వచ్చిన తటాలున యెగిరి మీదపడును. వీనివిషము అరగంటలో మనుజునిగాని, పశువునుగాని చంపును. ఉత్తర అమెరికాలో విపరీతమైన సర్పమున్నది. ఇది కదలిన దాని తోకమీద నున్న కొమ్ములుమాదిరివి యొకవిధమైన శబ్దమును గలుగ

చేయును. కాన యీ సర్పము వచ్చుచున్నటుల తెలిసికొనగలము. ఈ సర్పములు రెండు తెగలుగా విభజింపబడియున్నవి. మొదటిది త్రాచుపాములు, రెండవది కట్లపాములు, ఈ రెండును ఇతరజంతువులకును, మనుజులకును చాల నపాయకరములే. ప్రతిసంవత్సరము నీపాముల కాట్లవలన సుమారు 25 వేలమంది మృతిజెందుచున్నటుల లెక్కలవలన తెలియుచున్నది.

## విషాది వివరణపట్టిక

పొగాకుతోటలవైపునకు పాములురావు; గావున పొగాకును ఔషధముగా వాడుచుందురు. ఇదియును కొంతపని చేయును. శీతాకాలములో విషమెక్కువగా యుండును. చీకటిలో వెలుతురుకన్న విషమెక్కువగా నుండును. పాము చాల దూరమునుండి వచ్చి కరచినపుడుగాని, రెండు దవుడులు సరిగ కలువకపోయినగాని విషము చాల కొద్దిగా నెక్కును. మంచినీళ్లలోనుండు పాములకు విషముండదు. సముద్రములలోనుండు సర్పములలో కృష్ణసర్పముకన్న పదిరెట్లెక్కువ విషముండును. ఉష్ణప్రదేశములలో మెక్కువ విషముండును. సర్పముయొక్క వయస్సునుబట్టిగూడ విషము మారును. సర్పము కోపముగానున్న విషమెక్కువగా నుండును. ఆహారము తినిన తరువాతను, కూసమువిడిచిన తరువాతను విషముండదు. ఈ సర్పములన్నియు చెట్లెక్కగలవు. నదులదాటగలవు. త్రాచుపాముల జాతి చాలజ్ఞాపకశక్తిగలవి. వాటిని బాధించినవారిని చాలకాలమైనను జ్ఞాపకముంచుకొని వీలైన తిరిగి శిక్షించగలవు.

| | విషగ్రంథిలో నుండు విషము | కరచినప్పుడు వెలువడు నది | మనుజుని, పశువును చంపుటకు వలయు నది | మరణము తటస్థించు కాలము |
|---|---|---|---|---|
| త్రాచుపాము | ½-18 గ్రెయినులు | 6 గ్రెయినులు | 1/12 గ్రెయినులు | 10 ని॥ మొ॥ 30 గంటలు |
| కృష్ణసర్పము | 2- 6 గ్రెయినులు | 4 గ్రెయినులు | 1/12 గ్రెయినులు | 10 ని॥ మొ॥ 24 గంటలు |
| వైపరులు | 1- 4 గ్రెయినులు | 2 గ్రెయినులు | 1/ 8 గ్రెయినులు | 6 గం॥ మొ॥ 8 రోజులు |
| కట్లపాము | 1/50-2 గ్రెయినులు | 1 గ్రెయిను | 1/100 గ్రెయినులు | 12 గం॥ మొ॥ 8 రోజులు |

## ముఖ్యమైన విషయము.

పాములలో అనేకరకములను దైవము సృష్టించియున్నాడని ఇదివరకే చెప్పియుంటిని. ఒక్కొక్కసమయములో పాము కరచి పారిపోయినపుడది ఏసర్పమైనది తెలిసికొనుటకవకాశము యుండదు. ప్రాణాపాయము చేయు పాములయొక్క లక్షణములు త్వరలోనే తెలియును. ప్రాణాపాయము వెంటనే చేయక నెమ్మదిగాచేయు పాములనుగూర్చి తగిన చికిత్సలు చేయవచ్చును. అనేకమంది వైద్యులు అనేక రకములుగ చికిత్సలు చేయుదురు. అటువంటివారు మన దేశములో చాలమంది యున్నారు, వీరు వాడునట్టి ఆకుపసరులు, మంత్రములు బాగుగా పనిచేయును.

పాము స్వల్పమైనజంతువైనను దానికాటువలన పశుదేహమున ప్రసరించువిషము స్వల్పమైనను దీని తీవ్రస్వభావమువలన కొన్నినిమిషములలో ప్రాణము తీయుచున్నది. కఱచిన వెంటనే చికిత్సచేయుటకు ఆలస్యమైనయెడల చికిత్సచేయువారలకు తగినంత అనుభవము లేకపోయినగాని కఱవబడినపశువుప్రాణమును కాపాడుటకష్టము. ప్రతి సంవత్సరము విషపురుగుల కాట్లవలన అనేకజీవములు మృతినొందుచున్నవి. వీటి కష్టముల నివారించుటకు రోగనిదానముగల పశువైద్యు లత్యావసరము. ఎటువంటివైద్యపండితుడైనను విషపురుగులకాట్లను కనుగొనుట కష్టము. అందుచేతనే కొన్ని కొన్ని ప్రాంతములందు సునాయాసముగా పశువులు మరణించుచుండును. వేసవికాలములో పొలముల



లోను, బీళ్ళలోను పశువులను కట్టునపుడు కొన్నిపశువులు తెల్లవారుసరికి విషపురుగులకాట్లచే చనిపోయి యుండును. మరునాటిరాత్రికూడ ఒక్కొక్క స్థలములో ఆరీతిగనే జరుగుచుండును. అప్పుడా రైతు ఆతురతజెంది తన పొలములో ఏమైన పాము లున్నవాయని విచారించి తగినప్రయత్నములు చేయుచుండును. పాముకరచిన పశువు సూర్యోదయము కాగానే మరణించును. పాముల పుట్టలులేని ప్రాంతములందు పశువుల నుంచవలెను. ఇంకను పశువులశాలలలోను, కోళ్లగూళ్లలోను, గడ్డివాములలోను ఎలుకల కొరకవి దాగియుండును. అవి యుండుచోటు గ్రహించి పశువులను జాగ్రత్తగా కాపాడుచుండవలెను.

## పాముకాటు లక్షణములు.

పాముకాటునకు వెంటనే అనగా విషము దేహమునందు వ్యాపించకమునుపే చికిత్సచేయుట కారంభింపవలయునుగాని "ఆలస్యం అమృతంవిషం" అనునట్లు విషము దేహమునం దంతట నుండు రక్తములో ప్రవేశించి రక్తము నల్లబడిన తరువాత నేమియు లాభములేదు. పాముకరచిన పశువులకు బాగుగా లక్షణములు కనబడుచుండును. కరచిన చోట భరింపరాని మంటయుండును. శీఘ్రముగామత్తును కలుగజేయును. తటాలున క్రిందినుండి పైకి పక్షవాతము క్రమ్మునట్లగును. కాళ్లలో సత్తువ బోవును. నేలగూలబడును. గుండెలు పత్తుకొనిపోవునట్లుండి దడగానుండును. క్రమేపి తలవ్రాలి